మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 51 • పేజీలు:12+16 • వెల: రూ.5 సోమవారం • 22-1-2018 www.manamnews.com /manamnews



జీశాట్-11తోనే ఆఖరు?

జీఎస్ఎల్వీ సామర్థ్యం పెంచుతాం

ఉపగ్రహాల బరువు తగ్గించవచ్చు

విదేశాలపై ఆధారపడక్కర్లేదు

7లో..



'కాబూల్' ఉగ్రవాదులు హతం

దాడిచేసిన ఐదుగురిని మట్టుబెట్టిన బలగాలు

హోటల్ నుంచి 150 మంది విడుదల

ఉగ్రవాదుల కాల్పుల్లో మృతుల సంఖ్యపై అస్పష్టత

12 గంటల పోరాటం

'పంచాయతీ' షురూ!

వచ్చే నెలలో ఎన్నికలు సాధ్యమేనా?

ఇంకా సిద్ధం కాని ఓటర్ల జాబితా

జూలై చివరిదాకా పంచాయతీల గడువు

ఎన్నికలు ప్రత్యక్షమా.. పరోక్షమా?

గ్రామాలలో ఉత్కంఠ... విస్తృత చర్చ



హైదరాబాద్, జనవరి 21 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల లొల్లి షురూ అయింది. పంచాయతీ ఎన్నికలపై రోజుకో తీరుగాప్రభుత్వం చేస్తున్న ప్రకటనపై రాజకీయ పార్టీల్లో వేడి రాజుకుంటుంది. మరో వైపు కొత్త పంచాయతీల ఏర్పాటుపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గ్రామాల్లో అప్పుడే ఎన్నికల కోలాహలం మొదలైంది. కొత్తగా ఏర్పాటయ్యే పంచాయతీలపైనే ఆయా ప్రాంతాల నేతలు దృష్టి సారిస్తున్నారు. తమ పంచాయతీ పరిధి మారుతుందా...తమ గ్రామమే కొత్త పంచాయతీ అవుతుందా, ఎన్ని కొత్త పంచాయతీలు ఏర్పడను న్నాయి అనే అంశంపై పల్లెల్లో చర్చ సాగుతోంది. మునిసిపాలి టీల శివారు ప్రాంతాల్లోని గ్రామాల వీలినంపై పార్టీలు దృష్టి కేంద్రీకరిం చాయి. మొత్తంగా ఎక్కడ చూసినా సంక్రాంతి **మిగతా 6లో..**



వేటు పడింది

ఆ 20 మంది ఎమ్మెల్యేలు అనర్హులే

ఈసీ ప్రతిపాదనకు రాష్ట్రపతి ఆమోదం

ఢిల్లీ ఉప ఎన్నికలకు మార్గం సుగమం

ఈసీ మా మాట వినిపించుకోలేదు

దీనిపై కోర్టుకు వెళ్తాం: డిప్యూటీ సీఎం

ఇది రాజకీయ కుట్ర: ఆప్ ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 21:

లాంఛనం పూర్తయింది... ఆ 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు సంపూర్ణం అయింది. లాభదాయకమైన పదవులు అనుభవిస్తున్న ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ ఎన్నికల కమిషన్ చేసిన సిఫారసుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ **మిగతా 6లో..**

ఇదీలోకం!



ఆ శక్తి ఓటర్లకు మాత్రమే ఉందని వాళ్లు కూడా తెలుసుకునేలా లేరు సార్..!



సీఈసీగా ఓపీ రావత్

రేపు కొత్త బాధ్యతల స్వీకరణ

కొత్త కమిషనర్‌గా అశోక్ లావాసా

న్యూఢిల్లీ, జనవరి 21: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)గా ఓం ప్రకాశ్ రావత్ నియమితులయ్యారు. ప్రస్తుత సీఈసీ అచల్ కుమార్ జ్యోతి పదవీకాలం సోమవా రంతో ముగుస్తుండటంతో... ఆయన వార సుడిగా రావత్ రానున్నట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈనెల 23న ఆయన తన కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంతకాలం రావత్ ఎన్నికల కమిషన్‌లో ఒక కమిషన ర్‌గా ఉండేవారు. ఆయన స్థానంలో కొత్త కమిషనర్‌గా కేంద్ర ఆర్థికశాఖ మాజీ కార్య దర్శి అశోక్ లావాసాను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు చేపట్టను న్నారు. సునీల్ **మిగతా 6లో..**

సూత్రధారుల మాటేంటి?

పోలీసు నియామకాల బాగోతం పక్కదోవ

పెద్ద చేపలను తప్పించేందుకు ప్రయత్నాలు

11 మంది కానిస్టేబుళ్లు సహా 14 మంది అరెస్టు

ఉమ్మడి నల్లగొండలోనే 54 మంది నిందితులు

ఎస్ఐలుగా ఎంపికైన 18 మందిపైనా విచారణ



హైదరాబాద్, జనవరి 21 (మనం ప్రతినిధి):

రాష్ట్రంలో 2009నాటి పోలీసు నియామకాల బాగోతం కేసు పక్కదోవ పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. అప్పట్లో అసలు అభ్యర్థులు తమకు బదులు కొసరు వ్యక్తులతో పరీక్ష రాయించి (పైలటిం గ్) ఉద్యోగం సంపాదించారు. ఒకరూ.. ఇద్దరు కాదు- ఏకంగా 93 మంది ఇలాగే **మిగతా 6లో..**

అమెరికా ప్రభుత్వ స్తంభన యథాతథం

7లో..



రాజ్‌భవన్ వద్దు.. ప్రజాభవన్‌లోనే!

రాష్ట్రానికి కేంద్రం చాలా ఇచ్చింది

- టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ
- ధనికుల కోసమే పంచాయతీ పరోక్షం
- కేంద్ర మాజీమంత్రి బండారు దత్తాత్రేయ



హైదరాబాద్, జనవరి 21 (మనం న్యూస్):

తాను ప్రజాభవన్‌లోనే ఉంటాను తప్ప రాజ్‌భవన్‌కు వెళ్లబోనని బీజేపీ సీనియర్ నేత, ఎంపీ బండారు దత్తాత్రేయ స్పష్టం చేశారు. ఏ రాష్ట్రానికీ గవర్నర్‌గా వెళ్లే ఉద్దేశం తనకు లేదని.. రాబోయే ఎన్నికల్లో కూడా తాను పోటీ చేస్తానని ఆయన చెప్పారు. హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లా డారు. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నిధులు ఇవ్వడం లేదన్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపణలను దత్తాత్రేయ ఖండించా రు. అందులో వాస్తవం లేదన్నారు. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం అత్యధిక సాయం చేసిందని, రెండేళ్లలో మిషన్ భగీరథకు రూ.3,939 కోట్లు, మిషన్ కాకతీయకు రూ. 677 కోట్లు, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు కింద రూ. 874 కోట్లు, మిషన్ భగీరథ పైప్‌లైన్ల కోసం రూ.1767 కోట్లు ఇచ్చిందని ఆయన తెలిపారు. కాకతీయ కెనాల్, కొమురం భీం ప్రాజెక్టులకు కూడా వందల కోట్ల రూపాయలు ఇచ్చామని చెప్పారు. ప్రాజెక్టులను వేగవంతం **మిగతా 6లో..**

మెట్రోకు నిధుల వేట

రెండోదశ కోసం కేటీఆర్ యత్నాలు.. విదేశీ బ్యాంకుల వద్ద ప్రతిపాదనలు



- **పర్యటనలలో ఇది కూడా ముఖ్యాంశం**

హైదరాబాద్, జనవరి 21:

మెట్రోరైలు రెండోదశ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని మునిసిపల్ శాఖ మంత్రి కె. తారక రామారావు (కేటీఆర్) విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీ వల పది రోజుల పాటు స్విట్జర్లాండ్, జపాన్, దక్షిణ కొరి యా దేశాలలో పర్యటించినపుడు కూడా ఆయన ఈ దిశ గా విస్తృత ప్రయత్నాలు చేశారు. ఆయన వెంట ఐటీ శా ఖ కార్యదర్శి జయేష్ రంజన్, ప్రభుత్వ **మిగతా 6లో..**



వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో సోమవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. రాత్రిపూట చలి తీవ్రత పెరుగుతుంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 30 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు

గాలిలో తేమ: 62 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: పంచమి సా.4.25 తదుపరి షష్ఠి; నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.7.04 తదుపరి ఉత్తరాభాద్ర వర్జ్యం: సా.7.35-9.15; దుర్ముహూర్తం: మ.12.05-12.50, మ.3.04-3.48; రాహుకాలం: ఉ.8.17-9.41; అమృతఘడియలు: లేవు; శుభసమయం: ఉ.6.00-7.00, మ.3.49-4.00.

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 6.02

అనతికాలంలో 'మనం'కు అత్యంత ప్రజాదరణ



మనం దిన పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మనం-2018 క్యాలెండర్ ఆవిష్కరణలో వక్తలు

మహదేవ్‌పూర్, జనవరి 21(మనం న్యూస్): మనం తెలుగు దినపత్రిక అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ఐబి విశ్రాంతి భవన ఆవరణలో ఆదివారం మనం - 2018 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మనం పత్రిక దినదినాభివృద్ధి చెందుతూ, అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల ప్రజల మన్ననలు పొందిందన్నారు. ప్రతికా రంగంలో ప్రస్తుతమున్న పోటీని తట్టుకొని 'మనం' పత్రిక దూసుకెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ హసీనాభానొ, కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మహదేవ్‌పూర్ సర్పంచ్ కోట రాజబాబు గౌడ్, మహదేవ్‌పూర్ సింగిల విండో చైర్మన్, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీపతిబాపు, మహదవేపూర్, పలిమెల మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జావ్వాజి తిరుపతి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీధర్, మండల బీజేపీ అధ్యక్షుడు అన్కారీ ప్రకాశ్, శ్రీ మందరగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఒడెటి రవిందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఆయూబొద్దిన్, మహిళ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బన్సోడ రాణీభాయి, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు లింగాల రామయ్య, నల్లభూగ ధర్మయ్య, మండల నాయకుడు పత్తి మల్లేష్, విశ్వబ్రాహ్మణ సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఆరెందల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమాజంలో టీచర్ల పాత్ర కీలకం

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్

గోదావరిఖని, జనవరి 21(మనం న్యూస్): సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఆదివారం జరిగిన ప్రైవేట్ టీచర్స్ హెల్త్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ఈటల ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరకొర వేతనాలతో ప్రైవేటు ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను త్వరలోని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కులమతాలకు అతీతంగా తెలంగాణ ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. మెరుగైన బోధన చేసి విద్యార్థులను ఉన్నతశిఖరాలకు చేర్చాలని ఉపాధ్యాయులకు ఆయన సూచన చేశారు. అనంతరం ఆయన హెల్త్ కార్డులు పంపిణీ చేశారు.ప్రైవేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ వసీం అలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహార్‌రెడ్డి, రెండు జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమ శాఖ చైర్మన్ మూల విజయరెడ్డి, కార్పోరేటర్లు సోమారపు లావణ్య, బాలసాని స్వప్న, తిరుపతిగౌడ్, సింహచలం మాధవి, తెలంగాణ జాగృతి పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అందె సదానందం తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయుక్తంగా కిసాన్ సెల్ సెంటర్: పోచారం




హైదరాబాద్,జనవరి 21(మనం ప్రతినిధి): కిసాన్ సెల్ సెంటర్ ద్వారా అందుతున్న సేవలు రైతులకు ఉపయుక్తంగా ఉంటున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్‌లో ఆదివారం నిర్వహించిన కిసాన్ సెల్ సెంటర్ 15వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఆయా ప్రాంతీయ భాషల్లో రైతుల సందేహాలను నివృత్తి చేయడంలో కిసాన్ సెల్ సెంటర్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. రైతులకు మొక్కల సంరక్షణ, వాతావరణం, మార్కె టింగ్, విత్తనాలు, ప్రభుత్వ పథకాలపై సూచనలు ఇవ్వడంలో కిసాన్ సెల్ కృషి చేస్తుందన్నారు. హైదరాబాద్‌లోని కేసీసీ ఆధ్వర్యంలో రైతులకు నా లుగు సంవత్సరాలుగా 32 శిక్షణ తరగతులు నిర్వహించందని తెలిపారు. ఈ సందర్భంగా 20 మంది రైతులను సన్మానించారు. సమావేశంలో భారత వ్యవసాయ శాఖ విస్తరణ విభాగం సంయుక్త కార్యదర్శి పీకే బోర్తాకూర్, ఉషారాణి, వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం.జగన్‌మోహన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం సంచాల కులు ప్రదీప్, రాజిరెడ్డి, విజయ్ 200 మంది రైతులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో భూకంపం

ఇంపాల్, జనవరి 21: మయన్మార్, మణిపూర్‌లోని భారత సరిహద్దు ప్రాంతంలో శనివారం ఉదయం భూమి కంపించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 4.2గా నమోదయ్యిందని అధికారులు తెలిపారు. శనివారం వేకువజాము 3.36 గంటల ప్రాంతంలో ఎనభై కిలోమీటర్ల లోతులో భూమి కంపించింది.అయితే ఈ ఘటనలో ఎవ్వరూ గాయపడలేదు.

హోదా మరిచి ప్రశంసలా?

- పేరు మార్పు.. అంచనా పెంపు..
- తదితర అంశాలపై ప్రశ్నించరా
- ప్రశ్నించాల్సింది పోయి పొగడ్తలా?
- 38వేల కోట్ల నుంచి 80వేల కోట్లు..
- వ్యత్యాసం ఎందకని నిలదీయలేదు
- రాజ్యాంగ పరిరక్షణ మరిచారు
- గవర్నర్ పదవిని కించపరిచే వ్యాఖ్యలు
- నరసింహన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపాటు
- ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపణ







హైదరాబాద్, జనవరి 21(మనం ప్రతినిధి): రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉండాల్సిన వ్యక్తి తన స్థాయి మరిచి ప్రభుత్వాన్ని ప్రశంసల్లో ముంచెత్తారంటూ గవర్నర్ నరసింహన్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. అధికార పార్టీని ఉద్దేశించి శనివారం ఆయన చేసిన వ్యాఖ్యలు గవర్నర్ పదవిని, హోదాను కించపరిచేలా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆదివారం గాంధీ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గవర్నర్ తీరును తప్పుబట్టారు. శనివారం నాడు గవర్నర్ నరసింహన్ కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన విషయం తెలిసిందే! ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని స్థాయికి మించి పొగిడారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేరు పెట్టిన ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లి.. ప్రాజెక్టు పేరును ఎందుకు మార్చాల్సి వచ్చిందని ప్రశ్నించకపోవడం విచారకరమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టి విక్రమార్క విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టును పేరు మార్చి, డిజైన్‌లో మార్పులు చేర్పులుచేసి కొనసాగించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అంబేడ్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి 38,500 కోట్ల అంచనా వ్యయంతో బడ్జెట్ కేటాయింపులు చేసి, పనులు ప్రారంభించాక ప్రాజెక్టు డిజైన్ ఎందుకు మార్చారని భట్టి నిలదీశారు. పైగా అంచనా వ్యయం రెట్టింపు కావడం వెనకున్న మతలబు ఏంటనే ప్రశ్నలు సంధించకుండా.. ఆహో, ఓహో అంటూ ప్రభుత్వాన్ని పొగడడంపై గవర్నర్‌పై భట్టి విక్రమార్క తీవ్రంగా మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌ను కాళేశ్వరం చంద్రశేఖర రావు అని, హరీశ్ రావును కాళేశ్వరరావు అని అభివర్ణించిన నేపథ్యంలో.. రేపు రాజ్‌భవన్‌ను టీఆర్ఎస్ భవన్ అంటారేమోనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణహిత ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టు చేస్తే రూపాయి కూడా ఖర్చులేకుండా కాళేశ్వరం పూర్తయ్యేదని అన్నారు. ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టుల పేర్లు మార్చి.. సీతారామ ప్రాజెక్టుగా మార్చి పది వేల కోట్లు అదనంగా పెంచారని భట్టి ఆరోపించారు. ఈ ప్రాజెక్టుల్లో జరిగిన టెండర్లలో పెరిగిన వాటిని ప్యాకేజ్ వారిగా రాజ్ భవన్ కు పిలిచి రివ్యూ చేయాలని గవర్నర్‌ను కోరారు.. గవర్నర్‌గా అది మీ బాధ్యత అని గుర్తుచేశారు. అలా చేయకుంటే ప్రాజెక్టుల విషయంలో రాష్ట్రపతిని కలిసి గవర్నర్ పాత్రపై ఫిర్యాదుచేస్తామని చెప్పారు. పార్టీ మారి ప్రభుత్వంలో చేరిన నేతలతో మంత్రులుగా గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారని, ఈ చర్యతో గవర్నర్ రాజ్యాంగాన్ని అవమానించారని భట్టి విక్రమార్క విమర్శించారు. ప్రాజెక్టుల విషయంలో రాష్ట్రపతిని కలుస్తామని, రాష్ట్రంలో ఇటీవలి పరిణామాలు, గవర్నర్ పాత్రపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు ఫిర్యాదు చేస్తామని భట్టి తెలిపారు.

ప్రధానికి ఫిర్యాదు చేస్తాం.. వీహెచ్

రాష్ట్రంలో ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణంలో 80 వేల కోట్ల కుంభకోణం, లక్ష కోట్ల అవినీతి జరిగిందని వి.హన్మంతరావు ఆరోపించారు. కేవలం ప్రాజెక్టుల పేరు మార్చడం ద్వారానే అంచనా వ్యయం పెంచారని విమర్శించారు. ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి బదులు పొగుడుతున్న గవర్నర్‌పై ప్రధాన మంత్రికి ఫిర్యాదు చేస్తామని వీహెచ్ పేర్కొన్నారు.

రివ్యూ చేస్తే బాగుండేది.. శ్రీధర్ బాబు

రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు తప్పుడు సమాచారమిచ్చిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తాజా ప్రాజెక్టు ద్వారా రైతులను ఎలా ఆదుకుంటారనేది ప్రభుత్వం వివరించలేదన్నారు. రిలీఫ్ అండ్ రీ హాబీటేషన్ ఎలా జరిగిందో చెప్పలేదని గుర్తుచేశారు. అదేవిధంగా 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎంత మొత్తుకున్నా అమలు చేయలేదని ఆరోపిస్తూ.. ఈ అంశాలపై గవర్నర్ రివ్యూ చేసుంటే బాగుండేదని శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు. 'భూమి నష్టపోయిన రైతులను రాజ్ భవన్ కు పిలిపించి గవర్నర్ వివరాలు తెలుసుకోవాలి. అప్పుడు సర్కార్ నిజ స్వరూపం తెలుస్తుంది. ప్రాణహితను జాతీయ ప్రాజెక్టు నుంచి ఎందుకు తీసేశారు' అంటూ శ్రీధర్ బాబు ప్రశ్నలు సంధించారు.

గవర్నర్ వాఖ్యలు విడ్డూరం.. కనుకుల

కాళేశ్వరం ప్రాజెక్టుపై గవర్నర్ నరసింహన్ తన హోదాను మరిచి, బాధ్యతలను పక్కనపెట్టి.. అధికార పార్టీ ప్రతినిధి రీతిలో మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ కనుకుల జనార్దన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రాజెక్టు పనుల్లో జరుగుతున్న మంచిచెడులను ఎత్తిచూపాల్సిందిపోయి ప్రభుత్వాన్ని ప్రశంసించడం అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఇటీవల ఓ అంశంపై తనను కలిసిన కాంగ్రెస్ పార్టీ నేతల పట్ల గవర్నర్ వ్యవహరించిన తీరు ఆక్షేపణీయమన్నారు. రాజ్యాంగ బద్ధంగా ఉంటూ నిష్పక్షపాతంగా తన విధులను నిర్వహించాలని, తనపై గురుతరమైన బాధ్యత ఉందన్న విషయం మర్చిపోవద్దని కనుకుల పేర్కొన్నారు.




బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

- ప్రభుత్వ సంరక్షణ గృహానికి బాలిక తరలింపు

తిరుచ్చి, జనవరి 21: తొమ్మిదేళ్ల బాలికకు, 39 ఏళ్ల వ్యక్తితో పెళ్లి చేసేందుకు యత్నిస్తుండగా తిరుచ్చి పోలీసులు గురువారం అడ్డుకున్నారు. బాలికను ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఓ ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న బాలికకు, ఆమె కంటే 30 ఏళ్లు పెద్దవాడైన వ్యక్తితో పెళ్లి చేసేందుకు తొట్టాయం తాలుకా మిన్నతామ్‌పట్టి గ్రామంలో ఏర్పాట్లు జరుగుతున్నాయంటూ ఓ గుర్తు తెలియని వ్యక్తి గురువారం పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. గ్రామానికి చేరుకున్న పోలీసులు తమకు అందిన సమాచారంపై విచారణ జరపగా, బాల్య వివాహం విషయం నిజమేనని తేలింది. పెళ్లికి సిద్ధం చేసిన బాలికను ఆమె తల్లి(విధవ, వ్యవసాయ కూలీ) నుంచి తీసుకుని శిశు సంరక్షణ కమిటీ వారికి అప్పగించారు. బాలికకు వివాహం చేయలని అనుకోవడం నిజమేనని, ప్రస్తుతం బాలిక తమ సంరక్షణలోనే ఉందని, ఆమె భవిష్యత్తుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తిరుచ్చి. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఎస్. ఇందిరా గాంధీ తెలిపారు. అయితే రక్తసంబంధీకులైన యువకులతో బాలికలకు వివాహం నిర్ణయించడం అనేది గ్రామంలో తమ సామాజిక వర్గంలో సర్వ సాధారణమని, బంధుత్వం కొసాగించేందుకు ఇలా చేస్తామని గ్రామస్థులు పోలీసు విచారణలో చెప్పారు. బాలికకు యుక్తవయస్సుకు రాగానే ఆ యువకుడితో పెళ్లి చేసేందుకు ఇది ఒక ఒప్పందం అని పోలీసులు తెలిపారు. పదేళ్లలోపు వయసు ఉన్న బాలికను పెళ్లి చేయాలని ప్రయత్నించిన విషయం తెలుసుకున్న అధికారులు మాత్రం నివ్వెరపోయారు.

ట్రిపుల్ తలాక్‌కు కాంగ్రెస్ అడ్డు

- బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా



వారణాసి, జనవరి 21: ట్రిపుల్ తలాక్ బిల్లుకు రాజ్యసభ ఆమోదం లభించకుండా కాంగ్రెస్ అడ్డుకుంటుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పేర్కొన్నారు. యువతను పార్టీలో చేర్చుకునేందుకు వారణాసిలో నిర్వహించిన యువ ఉద్గోష్ కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీ కంటే ముందు బీజేపీ అంటే ఓ ఆలోచన అన్నారు. భారతదేశ నవ నిర్మాణామే లక్ష్యంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారన్నారు. కొత్తగా పార్టీలో చేరిన 17,000 మంది కార్యకర్తలకు స్వాగతం పలికారు. దేశవ్యాప్తంగా 7.5 కోట్లు మరుగుదొడ్లు నిర్మాణం చేసి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడామన్నారు. ట్రిపుల్ తలాక్ విషయంలో బీజేపీనే చొరవ తీసుకుందన్నారు. క్రైమ్ రేట్‌లో ఉత్తర ప్రదేశ్ దేశంలోనే ముందు ఉండేదని, యోగి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో గణనీయమైన మార్పులు సంభవించాయన్నారు. అంతకముందు సభా ప్రాంగణం వద్ద నిరసన వ్యక్తం చేసిన 40 మంది కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

రామగుండం ఉద్యమ గడ్డ

సాంకేతికతతో పోలీసు వ్యవస్థ బలోపేతం.. హోం మంత్రి నాయిని, ఆర్థిక మంత్రి ఈటల

నూతన కమిషనరేట్ కార్యాలయానికి భూమి పూజ.. రాష్ట్రమంతటా ఫ్రెండ్లీ పోలిసింగ్: డీజీపీ



గోదావరిఖని, జనవరి 21(మనం న్యూస్): రామగుండం ఉద్యమాలకు పురిటిగడ్డ అని, సింగరేణి త్యాగాల నిలయమని తెలంగాణ హోం శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఆర్థిక శాఖమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రూ.25 కోట్లతో నిర్మించనున్న నూతన కమిషనరేట్ కార్యాలయానికి డీజీపీ మహేందర్‌రెడ్డితో కలిసి మంత్రులు ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు రామగుండం అంటే అన్నల నిలయంగా ఉండేదని, ప్రస్తుత తెలంగాణ పోలీసు నిలయంగా మారిందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తెలంగాణ పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. కోటి ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యంగా కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. పోలీసు వ్యవస్థను పటిష్టపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కేటాయించందన్నారు. పోలీసు సంక్షేమాన్ని ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. హైదరాబాద్ అంత ప్రశాంతంగా రాష్ట్రం అంతా ప్రశాంతంగా ఉండేలా డీజీపీ పని చేస్తున్నారన్నారు. అలాగే రామగుండం సీపీ విక్రమ్‌జీత్ దుగ్గల్ మంచి డైనామిక్ ఆఫిసర్ అని నేర నియంత్రణలో కీలకంగా వ్యవహరిస్తున్నారని అభినందించారు. అనంతరం డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో రాష్ట్ర పోలీసులు వందశాతం పని చేస్తున్నారన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేస్తున్నామన్నారు. పేద, ధనిక వర్గాలు అనే తేడా లేకుండా పోలీసు స్టేషన్‌కు వచ్చిన వారందరికీ సమ ప్రాధాన్యం ఇచ్చి, ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు, పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, పెద్దపల్లి కలెక్టర్ దేవసేన, నార్త్‌జోన్ ఐజీ నాగిరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్, కరీంనగర్ రేంజ్ డీఐజీ ప్రమోద్‌కుమార్, రామగుండం సీపీ విక్రమ్‌జీత్‌దుగ్గల్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్ సాయి.. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించండి.. ఆదివాసీ హక్కుల పోరాట సమితి వినతి



హైదరాబాద్, జనవరి 21(మనం ప్రతినిధి): ఆదివాసీల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జాతీయ ఎస్టీ కమిషన్ చైర్మన్ నందకుమార్‌సాయి అన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు అందరూ ఒక్కటిగా మారి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. గతంలో ఆదివాసీలకు విద్య, వైద్యం, ఆరోగ్యం వంటి సౌకర్యాలు తక్కువగా ఉండేవని, మోదీ ప్రభుత్వం ఆదివాసీలకు వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఏ వర్గాన్నైనా, కులాన్నైనా, తెగనైనా తొలగించాలన్నా, చేర్చాలన్నా ప్రత్యేక మార్గదర్శకాలు లేవని, రాజ్యాంగ పరమైన నిర్ణయం అవసరమని ఆయన అన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితాలోంచి తొలగించాలని ఆదివాసీలు ఆయనను కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, ఇతరత్రా సౌకర్యాలు ఆదివాసీలకు అందడం లేదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాబూరావ్ వాపోయారు. ఆదివాసీలు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు వచ్చిన వారు లబ్ధి పొందుతున్నారని ఆయన చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఆదివాసీల సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్తానని చైర్మన్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తుడుందెబ్బ, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఉయిక సంజీవ్, ఈసం సుధాకర్, ముక్తి రాజు, మోతిరాం. ఆదివాసీ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ, నాయకులు కబ్బాకుల రవి, మోకాళ్ల శ్రీనివాస్‌రావు, నాగు, నగేశ్, కైలాష్, పోచయ్య పాల్గొన్నారు.

2019 ఎన్నికలు రాహుల్ బాధ్యతే

- గుజరాత్ ఫలితాలతో దూకుడుమీదున్న పార్టీ


ఢిల్లీ, జనవరి 21: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీలో సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఇదే దూకుడు కొనసాగిస్తూ, రాహుల్ నాయకత్వంలో 2019 సాధారణ ఎన్నికల్లో విజయం సాధిస్తామని, కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ విశ్వాసం వ్యక్తంచేశారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రంలో కాంగ్రెస్ నైతిక విజయం సాధించిందని అహ్మద్ పటేల్ అన్నారు. ఈ విజయం పార్టీ కార్యకర్తల్లో నైతికతను మరింత పెంచిందని, దీని ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటుందని.. 2019 ఎన్నికల్లో పార్టీ విజయానికి ఇది దోహదం చేస్తుందని ఆయన వివరించారు. 2019 ఎన్నికలను యంగ్, డైనమిక్ అయిన పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విజయం దిశగా నడుపుతారని పటేల్ విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ ప్రక్షాళన చేసేందుకు రాహుల్ కసరత్తు చేస్తున్నారా అన్న ప్రశ్నకు సమాధానంగా, ఇందుకు సీనియర్లతో ఓవైపు సంప్రదింపులు జరుపుతూనే, మరోవైపు యువతను కూడా పార్టీ కార్యక్రమాలకు రాహుల్ వినియోగిస్తున్నట్టు వివరించారు.

'భావసారుప్యమున్న పార్టీలతో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం, కానీ పొత్తులగురించి ఇంత త్వరగా ఏమీ చెప్పలేం, వీటిపై కాంగ్రెస్ అధ్యక్షుడు, సీనియర్లు ఆతరువాత నిర్ణయం తీసుకుంటారు' అన్న పటేల్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సంఖ్యను భవిష్యత్‌లో రాహుల్ పెంచగలరన్న ధీమా వ్యక్తం చేశారు. సౌదీ అరేబియాలో వచ్చిన కొత్త చట్టాలవల్ల హజ్ యాత్రకు ఒంటరిగానే మహిళలు వెళ్లిరావచ్చు, కానీ బీజేపీ మాత్రం ఇది తమ విజయంగా ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగకుండా పదేపదే కాంగ్రెస్ అడ్డుకుంటోందనడం సరికాదని మరో ప్రశ్నకు సమాధానంగా పటేల్ వెల్లడించారు.

'ఆప్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు'..

తెలంగాణలో హాట్ టాపిక్

- టీఆర్ఎస్‌పై పోరుకు కాంగ్రెస్‌కు కొత్త అస్త్రం
- లాభదాయక పదవులపై ఫిర్యాదుకు సిద్ధం



హైదరాబాద్, జనవరి 21(మనం ప్రతినిధి): ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారింది. లాభదాయక పదవుల్లో ఉన్న ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రపతికి సూచన చేసింది. రాష్ట్రపతి ఇందుకు ఆమోదం తెలిపారు. అయితే ఈ విషయం దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరుగురు శాసనసభ్యులను పార్లమెంటరీ కార్యదర్శులకు నియమించి, వారికి క్యాబినెట్ హోదా కల్పించారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. శాసన సభలో ఉన్న సభ్యుల సంఖ్య ఆధారంగా వారిలో 15 శాతం మందికే క్యాబినెట్ హోదా కల్పించాలని, టీఆర్ఎస్ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా వ్యవహరించిందంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కోర్టు ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ ఆరుగురు సభ్యులను పార్లమెంటరీ సెక్రటరీ పదవుల నుంచి తొలగించారని, అయితే వారిని అనర్హులుగా ప్రకటించలేదని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రజల నుంచి ఎన్నికైన ఓ ప్రజాప్రతినిధి మరో లాభదాయక హోదాను అనుభవించడం చట్టవిరుద్ధమని అంటున్నారు. ఢిల్లీ స్పూర్తితో ఎన్నికల సంఘంతో పాటు రాష్ట్రపతికి కూడా ఈ విషయంపై ఫిర్యాదు చేస్తామని తెలంగాణ కాంగ్రెస్ నేతలు అంటున్నారు. అయితే లాభదాయక పదవుల విషయంతో పాటు పార్టీ ఫిరాయింపుల విషయంలోను ఎన్నికల సంఘం స్పందిచాలని ప్రజలు కోరుతున్నారు.



మోదీ మెచ్చిన చిన్నారి

- **స్వచ్ఛత అంటే ఎంత ఇష్టమో..!**
- **చిన్నారిని ఆదర్శంగా తీసుకోవాలన్న ప్రధాని**

హైదరాబాద్, జనవరి 21(మనం న్యూస్): ఓ కశ్మీరి చిన్నారి ప్రధాని నరేంద్రమోదీ దృష్టిని ఆకర్షించింది. ప్రకృతి అందాలకు పెట్టింది పేరైన జమ్మూకశ్మీర్‌కి వెళ్లే పర్యాటకులు తప్పకుండా దాల్ లేక్‌ను సందర్శిస్తారు. దాల్ సరస్సులోని షికారాలో పడవప్రయాణం చేస్తూ ప్రకృతి అందాలను వీక్షిస్తే ఆ ఆనందమే వేరని వెళ్లి వచ్చినవారు చెబుతుంటారు. అటువంటి అందమైన ఈ సరస్సు కాలుష్య కోరల్లో చిక్కుకోవడంతో దీన్ని శుభ్రం చేసేందుకు ఓ చిన్నారి స్వయంగా నడుం బిగించింది. ప్రతిరోజు చిన్నారి తన తండ్రితో కలిసి ఓ చిన్న పడవలో వెళ్లి సరస్సులోని చెత్తను తొలగించేందుకు కృషి చేస్తోంది. అంతేకాదు 'దేశంలోనే అందమైన సరస్సుల్లో దాల్ లేక్ ఒకటి, అటువంటిది ఇప్పుడు ఇది కాలుష్యం బారిన పడింది, దాన్ని శుభ్రం చేయాల్సిన బాధ్యత మనపైనే ఉంది, మీరు కూడా నాతో చేతులు కలిపి లేక్ శుభ్రం చేసేందుకు సహాయపడండి, ఈ అందమైన లేక్ కాలుష్యం బారిన పడకుండా కాపాడుకుందాం' అంటూ తన ముద్దు ముద్దు మాటలతో చిన్నారి వీడియో సందేశాన్ని ఇచ్చింది. ఈ వీడియోను మోదీ ట్విటర్‌లో షేర్ చేస్తూ.. 'ఈ చిన్నారి మాటలు మీ రోజుని మరింత మెరుగుపరిచేలా ఉన్నాయి, స్వచ్ఛతంటే ఎంత ఇష్టం' అని మోదీ ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పలువురు నెటిజన్లు ఈ చిన్నారిపై ప్రశంసల జల్లు కురిపిస్తూ... వయసులో చిన్నదైనా చాలా గొప్పగా ఆలోచించిందని, ఈ చిన్నారిని చూసి చాలా నేర్చుకోవాలని ట్వీట్లు చేస్తున్నారు. చిన్నారిని స్ఫూర్తిగా తీసుకొని అందరూ ఇదే విధంగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని నెటిజన్లు ట్వీట్లు పెడుతున్నారు.

మోత్కుపల్లిపై టీడీపీ వేటు?

- **వ్యాఖ్యలు ఉపసంహరించుకో..**
- **చర్య తప్పదంటున్న రమణ**

హైదరాబాద్, జనవరి 21, మనం ప్రతినిధి: సంచలన వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మోత్కుపల్లి నర్సింహులుపై వేటు తప్పేలా లేదు. టీడీపీ తెలంగాణ రాష్ట్ర శాఖను టీఆర్ఎస్‌లో విలీనం చేయాలంటూ పొలిట్ బ్యూరో సభ్యుడు మోత్కుపల్లి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు ఎల్. రమణ సూచించారు. మోత్కుపల్లి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోకపోతే చర్యలు తీసుకునే యోచనలో పార్టీ ఉందని రమణ వెల్లడించారు. జనవరి 18న టీడీపీ తెలంగాణ శాఖను టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు కోరారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఎన్టీఆర్‌కు నివాళులర్పించిన తర్వాత నర్సింహులు చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలాన్ని రేపాయి. ఈ వ్యాఖ్యలు తెలంగాణ టీడీపీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళాన్ని రేపాయి. ఈ విషయమై టీడీపీ తెలంగాణ రాష్ట్ర పొలిట్ బ్యూరో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. మోత్కుపల్లి నర్సింహులు నుంచి ఈ వ్యాఖ్యలపై వివరణ కోరాలని నిర్ణయించారు. మోత్కుపల్లి వ్యాఖ్యలను ప్రజలెవరూ ఒప్పుకోరని టీటీడీపీ అధ్యక్షుడు రమణ చెప్పుకొచ్చారు. పైరవీ భవన్‌గా మారిన ప్రగతి భవన్‌ను తెలంగాణ ప్రజా ఆసుపత్రిగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని దోచుకోవడంలో గతంలో కాంగ్రెస్ ముందుండేదని, ప్రస్తుతం టీఆర్ఎస్ ఆ స్థానాన్ని భర్తీ చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

మోత్కుపల్లి వైఖరేంటి?

మరోవైపు తాజా పరిస్థితుల్లో మోత్కుపల్లి ఏం చేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న వ్యాఖ్యలపై ఆయన పార్టీ వివరణ ఇస్తారా, లేదా అన్నది అంతు చిక్కడంలేదు. ఇక శనివారం జరిగిన పార్టీ పొలిట్ బ్యూరో సమావేశానికి కూడా ఆయన హాజరు కాలేదు. వ్యక్తిగత కారణాలతోనే ఈ సమావేశానికి హాజరుకాలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

కనుమరుగవుతున్న గద్దలు

- **రక్షించుకోవాలంటున్న పక్షి ప్రేమికులు**

హైదరాబాద్, జనవరి 21: జంటనగరాల పరిసరాల్లో ఆకాశంలో విహరించే గద్దల సంఖ్య గణనీయంగా పడిపోయింది. నాంపల్లి, ఎల్బీ స్టేడియం పరిసర ప్రాంతాల్లో గతంలో వందల సంఖ్యలో గద్దలు కనిపించేవి. ఇటీవల చాలా అరుదుగా నగర వాసుల కంటపడుతున్నాయి. ప్రస్తుతం నగరంలో పదివేల కంటే తక్కువ సంఖ్యలో ఈ పక్షులు ఉండడం ఆందోళన కలిగించే అంశం. బాణసంచా కాల్పులు, పతంగుల పండగ వంటి కార్యక్రమాలు పక్షుల జీవనానికి ముప్పుగా మారుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా గద్దలు ప్రతి ఏడాది మార్చి నుంచి ఏప్రిల్ నెలల మధ్యలోసంతానోత్పత్తి చేస్తాయి. కానీ దక్షిణ భారతదేశ వాతావరణంలో ఈ ప్రక్రియ జనవరి నుంచి మార్చి నెలలోపు ముగుస్తోంది. హైదరాబాద్ నగర పరిసరాల్లో సంచరించే గద్దలు(ఇండియన్ స్పాటడ్ ఈగల్స్) సాధారణంగా 60 సెంటీమీటర్ల వరకు పొడవు ఉంటాయి. వీటి రెక్కల విస్తీర్ణం 150 సెంటీమీటర్లు వరకు ఉంటుంది. ఈ జాతి గద్దల్లో ఆడ పక్షి ఒకసారి ఒకటి నుంచి మూడు గుడ్లు వరకు పెడుతుంది. ఎత్తైన చెట్ల మీద కర్ర పుల్లలు, ఆకులతో గూడు నిర్మించుకుని ఇవి నివాసం ఉంటాయి. ఏదిఏమైనా ఈ పక్షి జాతి కనుమరుగువుకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైన ఉందని పక్షి ప్రేమికులు అంటున్నారు.

సమస్యల రైల్!



- **జనాదరణ తగ్గుతున్న మెట్రో ప్రయాణం**
- **పార్కింగ్ లేక ప్రయాణికుల అవస్థలు**
- **సాంకేతిక సమస్యలతో భయాందోళనలు**
- **బాలారిష్టాలు మాత్రమే... అధికారులు**

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (మనం న్యూస్): ''అంతన్నాడింతన్నాడే గంగరాజు'' అని అతడి ఉత్తుత్తి గొప్పల గుట్టువిప్పే పాట గుర్తుందా? హైదరాబాద్ మెట్రోరైల్ ప్రయాణికులు ఇప్పుడు ఆ పాటనే పాడుకుంటున్నారు. కాబోయే విశ్వనగరానికి మణిహారం.. రాష్ట్రానికి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్.. అంటూ ఏ మార్గంలో నడిపితే ఎంతమేర గిట్టుబాటవుతుందో లెక్కలు వేసి మరీ కోట్ల రూపాయల వ్యయంతో ఈ పథకం తొలిదశను పూర్తిచేశారు. ఆపై సాక్షాత్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలి ప్రయాణంతో సేవలకు శ్రీకారం చుట్టారు. దేశంలోని మెట్రో నగరాల్లో తొలిదశలోనే ఇంత ఎక్కువ దూరం ప్రయాణించే తొలి మెట్రో రైలు మార్గం ఇదేనని ఊదరగొట్టారు. కానీ, నెలన్నర దాటేసరికే ప్రయాణికులు కరువై మెట్రోరైళ్లు వెల వెలబోతున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఆదిలో భయపడినట్టుగానే దిమ్మతిరిగే చార్జీలకు తోడు వాహనాల పార్కింగ్ సమస్య ఫలితంగా జనాదరణ తగ్గుముఖం పట్టింది. ఇది చాలదన్నట్లు సాంకేతిక సమస్యలతో మధ్య లోనే నిలిచిపోవడం, ట్రెయిన్ సెన్సర్ వ్యవస్థ మొరాయిస్తుండటం లాంటి బాలారిష్టాలు ఇంకా తొలగలేదు. పర్యవసానంగా రైళ్ల వేగం కూడా తగ్గిపోయింది.

అధిక చార్జీలు... పార్కింగే అసలు సమస్య?

మెట్రోరైల్లో ప్రయాణించాలంటే ఆటో లేదా బస్సు లేదా సొంత వాహనంలో స్టేషన్‌దాకా 'ఒక ప్రయాణం' తప్పదు. కానీ, బస్సు దిగాక మళ్లీ కొంతదూరం నడక తప్పదు. ఇక సొంత వాహనమైతే ఎక్కడుంచాలన్నది పెద్ద సమస్య. అధిక చార్జీల మాట పక్కనపెడితే పార్కింగ్ సదుపాయం లేకపోవడం ప్రయాణికులను అగచాట్ల పాల్జేస్తోంది. దీంతో సొంత వాహనాలున్నవారు మెట్రోరైల్‌పై ఆసక్తి చూపడంలేదు. కొందరు ఉద్యోగులు కాస్త లేటైనా అదే ఉత్తమమని చెబుతున్నారు. అలాగే కాలనీలు, మేజర్ హౌజింగ్ ఏరియాలకు మెట్రో కనెక్టివిటీ లేకపోవడం నిరాదరణకు మరో కారణం. ఫలితంగా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. డిసెంబర్ 3వ తేదీన అత్యధికంగా 2.2 లక్షల మంది ప్రయాణించగా, తొలినాళ్లలో రోజుకు సగటున 1.25 లక్షల మంది వరకు ఎక్కారు. కానీ, ఇప్పుడా సంఖ్య 75-80 వేలకు పడిపోయింది. అయితే, ఇది తాత్కాలికమేనని, భవిష్యత్తులో ప్రయాణికుల సంఖ్య రోజుకు 1.2-1.25 లక్షల వరకు ఉంటుందని అంచనా వేసినట్లు మెట్రోరైల్ అధికారులు చెబుతున్నారు. మిగిలిన నగరాల్లో కూడా ఇది సహజమేనని, సాధారణంగా మెట్రో సేవలు ప్రారంభమైన కొన్నాళ్ల వరకు సరదా కోసం ఎక్కుతారని.. తర్వాత అవసరం ఉన్నవాళ్లు మాత్రమే ప్రయాణిస్తారని పేర్కొన్నారు. ఈ కారణంగానే సంఖ్య తగ్గినట్లు కనిపిస్తుందని మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. మొత్తంమీద ఇతర నగరాల్లోని మెట్రోల కంటే ఇప్పటికీ మనది బాగానే ఉందని.. రెండుమూడు నెలల్లో అంతా చక్కబడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రయాణికులు మాత్రం పీక్ అవర్స్‌లో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉందంటున్నారు. బోగీల సంఖ్యను ఆరుకు పెంచాలని, సికింద్రాబాద్-అమీర్‌పేట మధ్య ప్రయాణం నరకంలా కనిపిస్తోందని నాగేశ్ అనే వ్యక్తి ట్విట్టర్‌లో పోస్ట్‌చేశారు. బేగంపేట ప్రకాష్‌నగర్ స్టేషన్ వద్ద పార్కింగ్ లేదని, చాలాచోట్ల పార్కింగ్ సమస్యల వల్లే ప్రయాణికులు రావడం లేదని శ్రీనిజ అనే మరో ప్రయాణికురాలు చెప్పారు. కాగా, అంతర్జాతీయ స్థాయిలో మెట్రోకు పార్కి ంగ్ ఉండదన్నది అధికారుల మాట. కానీ, ఆ దేశాల్లోని విశాలమైన రోడ్లు, ఫుట్‌పాత్‌లతో పోలిస్తే మనకు ప్రత్యామ్నాయం ఏదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. అయితే, నాల్గెదు స్టేషన్ల వద్ద తప్ప మిగిలిన అన్ని చోట్లా పార్కింగ్ వసతి ఉందని ఎన్వీఎస్ రెడ్డి పేర్కొ న్నారు. ఇక మెట్రో రాకతో నగరంలో ట్రాఫిక్ కాస్త తగ్గి, కాలుష్యం అదుపులోకి వస్తున్నదని విశ్లేషకులు అంటున్నారు.

రేట్లు రెట్టింపు... మధ్యలో ఇబ్బందులు

నాగోల్ నుంచి మియాపూర్ వరకు బస్సులో వెళ్తే రెండు గంటలు పడుతుందని, మెట్రోరైల్‌లో 40 నిమిషా ల్లో చేరుకోవచ్చని తొలుత ప్రకటించినట్లు ఓ చిరువ్యా పారి గుర్తు చేశారు. అయితే, భార్యతో కలిసి తాను వెళ్లినప్పుడు రెట్టింపు సమయం (80 నిమిషాలు) పట్టింద న్నారు. బస్సుతో పోలిస్తే 40 నిమిషాలు కలిసొచ్చినా మెట్రో చార్జీ రూ.120 కాగా, బస్సులో రూ.50 మాత్రమేనని పేర్కొన్నారు. మొత్తంమీద 40 నిమిషాల కోసం రూ.70 అదనపు ఖర్చు తమవంటివారికి విలాసమేనని చెప్పారు. ఇక ఇప్పుడైతే మెట్రో రైల్ ప్రయాణ సమయం ఇంకా పెరిగిందని పేర్కొన్నారు.

మోజు తీరగానే మొహం మొత్తిందా?

మెట్రోరైలు సేవలు ప్రారంభమయ్యాక తొలిరోజు ప్రయాణికుల సంఖ్య 2 లక్షలుగా నమోదై రికార్డులకెక్కింది. మెట్రోరైల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపిన 32 రోజుల లెక్క ప్రకారం 32.25 లక్షల మంది ప్రయాణించారు. ఏ కొత్త వ్యవస్థకైనా బాలారిష్టాలు తప్పవని కూడా ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కానీ, రోజు రోజుకూ జనాదరణ క్షీణిస్తున్న సూచనలే అధికంగా కనిపిస్తుండటం గమనార్హం.

అక్కడ విశాలం.. ఇక్కడ శూన్యం

రద్దీలేని రసూల్‌పురా స్టేషన్‌వంటి చాలా ప్రాంతాల్లో పార్కింగ్ వసతులున్నాయి. కానీ, దేశంలోనే విశిష్టమైనదిగా పేరొందిన అమీర్‌పేట్ మెట్రో స్టేషన్ మాటేమిటని ప్రయాణికులు వాపోతున్నారు. ఇక నాగోల్‌లో బైకులు, కార్లకు పార్కింగ్ ఇబ్బంది లేకపోయినా సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. చాలాచోట్ల స్టేషన్ల సమీపంలో బస్‌బే లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మెట్రో ప్రారంభమైన నెలకే సాంకేతిక సమస్యలు తలెత్తి ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరయ్యారు.



గవర్నర్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం: టీపీసీసీ

- **గవర్నర్ తీరుపై ఏపీ బీజేపీ అసహనం**

హైదరాబాద్, జనవరి 22, మనం ప్రతినిధి : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ తీరు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ హోదాలో ఉండికూడా కేసీఆర్ ప్రభుత్వంపై నరసింహన్ ప్రశంసల జల్లు ఎలా కురిపిస్తారంటూ ఇటు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, అటు ఆంధ్రప్రదేశ్ బీజేపీ గుర్రుగా ఉన్నారు. గవర్నర్ వ్యవహరిస్తున్న తీరుపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకులు బహిరంగంగానే ఆరోపణలు గుప్పిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ నేతలు గవర్నర్ తీరుపై పెద్ద ఎత్తున విమర్శించారంటూ తెలంగాణ సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి గతం గుర్తుచేశారు. అటు గవర్నర్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అడ్డుపడ్తున్నారంటూ ఏపీలోని బీజేపీ శాసనసభ పక్ష నేత విష్ణుకుమార్‌రాజు ఆరోపిస్తున్నారు. ఏపీకి చెందిన నాలా బిల్లు విషయంలో గవర్నర్ తీరుపై ఆయన మండిపడ్డారు. ఇదే తరహా బిల్లు తెలంగాణ ప్రభుత్వం నుంచి తన వద్దకు వచ్చినప్పుడు మూడే రోజుల్లో సంతకం పెట్టారని అన్నారు. ఏపీలో సేద్యపు పొలాలను వ్యవసాయేతర భూమిగా మార్చే చట్ట సవరణకు సంబంధించిన ఈ నాలా బిల్లుపై, ఏపీ సర్కార్‌కు గవర్నర్‌కు మధ్య లేఖల యుద్ధం సాగిన దాఖలాలున్నాయి. గతంలో తనపై వచ్చిన ఆరోపణలపై స్పందించిన గవర్నర్, టీ కాంగ్రెస్ నేతల మాటలు కుటుంబసభ్యుల మధ్య మనస్పర్థలాంటివని పేర్కొన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తూ..రాజ్‌భవన్‌ను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు గవర్నర్ గతంలో వివరించినా వివాదం సద్దుమణగలేదు.



వచ్చే ఎన్నికల్లో సోషల్ మీడియానే కీలకం: లక్ష్మణ్

హైదరాబాద్, జనవరి 21: వచ్చే ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రధాన పాత్ర పోషించనుందని బీజేపీ నేత డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈ క్రమంలో పార్టీ ఐటీ సెల్‌ను బూత్ స్థాయి వరకు విస్తరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఐటీ సెల్ వర్క్ షాప్ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. మోదీ ప్రధాని అయ్యాక 19రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ప్రజలు విశ్వసనీయతకు పట్టం కడుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని, టీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలు అటకెక్కాయని లక్ష్మణ్ ఆరోపించారు.

చురుకుగా కాళేశ్వరం పనులు

- **ప్రాజెక్టు పరిశీలనలో హరీశ్ రావు**
- **సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి**
- **ముగిసిన 2 రోజుల పర్యటన**




హైదరాబాద్, జనవరి 21: కాళేశ్వరం ప్రాజెక్టు పనులు కొనసాగుతున్న తీరు సంతృప్తికరంగా ఉందంటూ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఈమేరకు ప్రాజెక్టు పరిశీలన, పనుల పర్యవేక్షణ కోసం ఆయన చేపట్టిన పర్యటన ఆదివారం రాత్రి ముగిసింది. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు రాష్ట్ర గవర్నర్ వెంట పర్యటించిన మంత్రి శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా క్షేత్ర స్థాయి పర్యటన లు,సమీక్ష సమావేశాలు జరిపారు. శనివారం రాత్రి కాళేశ్వరం ప్యాకేజి 6, 7, 8 పనులను ముఖ్యంగా టన్నెల్ తవ్వకాల ను పరిశీలించి వాటి పురోగతిని అక్కడే సైటులో సమీక్షించారు.ఆదివారం ఉదయం గోలివాడ, సుందిళ్ళ,అన్నారం పంపు హౌజ్ ల పనుల పురోగతిని సమీక్షించారు. ఆదివారం సాయంత్రం కన్నెపల్లి పంపు హౌజ్ దగ్గర కాళేశ్వరం పనులపై ఇరిగేషన్ ఇంజనీర్లు, ఏజెన్సీ ల ప్రతినిధులతో సమీక్షించారు. కాళేశ్వరంను ఇరవై నెలల్లో పూర్తి చేయనున్నట్టు హరీశ్ రావు చెప్పారు.అత్యంత వేగంగా అటవీ, పర్యావరణ అనుమతులు సాధించడం ముఖ్యమంత్రి కేసీఆర్ కు మాత్రమే సాధ్యపడిందన్నారు.గత ప్రాణహిత- చేవెళ్ల డిజైన్లో తమ్మిడి హట్టి వద్ద నీటి లభ్యత లేదని సి.డబ్ల్యు.సి తే ల్చడంతో సి.ఎం.కేసీఆర్ మేడిగడ్డను ఎంపిక చేశారని హరీశ్ రావు గుర్తు చేశారు.వచ్చే జూన్, జూలై నాటికి సుందిళ్ళ, అన్నారం ఆనకట్టలను పూర్తి చేయడానికి పట్టుదలతో పని చేస్తున్నట్లు తెలిపారు.

మేడిగడ్డ బ్యారేజీని 2018 చివరి నాటికి పూర్తి చేస్తామని హరీశ్ రావు ప్రకటించారు. కాళేశ్వరంప్రాజెక్ట్ పనుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నామని చెప్పారు.రోజుకు రెండున్నర లక్షల సిమెంటు బస్తాలు వాడుతున్నట్టు మంత్రి చెప్పారు. కన్నేపల్లి - అన్నారం ఆప్రోచ్ కాలువ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. వచ్చే మే నెలకల్లా ఈ కెనాల్ ను పూర్తి చేయాలని ఏజెన్సీ ని ఆదేశించారు.ఈప్రాజెక్ట్ పూర్తయితే 125 కిలోమీటర్ల మేర నదిలో 365 రోజుల మేర నీరు నిల్వ ఉంటుందన్నారు. సుందిళ్ళ, అన్నారం, మేడి గడ్డ ఆనకట్టలపై జాతీయ రహదారుల ప్రమాణాలతో రోడ్ బ్రిడ్జ్ లు నిర్మిస్తున్నట్టు మంత్రి తెలియజేశారు. భూపాలపల్లి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా పంట పొలాలకు నీరిచ్చేలా చిన్నపాటి ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్టు హరీశ్ రావు పేర్కొన్నారు.మంథని అసెంబ్లీ నియోజకవర్గం లోని ప్రతి ఎకరానికి సాగు నీరందుతుందన్నారు. చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి రెండో దశ అటవీ అనుమతులు వచ్చినందున ఈ పథకం త్వరగా పూర్తి చేసి రెండు పంటలకు నీరివ్వాలని ఆదివారం సాయంత్రం కన్నెపల్లి పంపు హౌజ్ దగ్గర సమీక్ష లో ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తో పేద్దపల్లి జిల్లా మంథని రూపు రేఖలు మారనున్నట్టు మంత్రి హరీశ్ రావు అన్నారు.అటు ఎస్.ఆర్.ఎస్.పి,ఇటు కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, మంథని లిఫ్ట్ పథకాలతో మొత్తం మంథని అసెంబ్లీ నియోజక వర్గం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు. కాళేశ్వరం గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుందన్నారు. మత్స పరిశ్రమ అభివృద్ధి చెందడం వల్ల ఎంతో మందికి జీవనోపాధి లభిస్తుందన్నారు. నౌకాయానం అభివృద్ధి జరుగుతుందని మంత్రి హరీశ్ రావు అన్నారు.చిన్న కాళేశ్వరం లిఫ్టు తో మంథని లో 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని ఆయన చెప్పారు.

వరంగల్ డిక్లరేషన్‌కు 20ఏండ్లు

- టీపీఎఫ్ సభకు అడ్డంకులు
- నేతలను అడ్డుకున్న పోలీసులు
- అమరవీరుల స్థూపం వద్ద ఉద్రిక్తత
- వరవరరావు అరెస్టు.. విడుదల

వరంగల్, జనవరి 21 (మనం న్యూస్ బ్యూరో): వరంగల్ డిక్లరేషన్‌కు 20 ఏండ్లు నిండిన సందర్భంగా తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభకు అడ్డంకులు ఎదురయ్యాయి. సభ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పించేందుకు ప్రయత్నించిన ప్రతినిధులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, టీపీఎఫ్ ప్రతినిధుల మధ్య వాగ్వివాదం జరిగింది. అనుమతి లేదంటూ పోలీసులు అడ్డగించడంతో నిరసనకారులు ప్రభుత్వ చర్యలను నిరసించారు. ప్రభుత్వానిది నిరంకుశవైఖరిగా అభివర్ణించారు. అణిచివేత ధోరణులను తప్పుపడుతూ నినాదాలు చేశారు. దీంతో వరవరరావుతో సహా పలువురు నేతలను సుబేదారి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహిళలను సైతం విచక్షణా రహితంగా పోలీసులు ఈడ్చుకుంటూ వాహనాలలో ఎక్కించారు. ఆపై పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో టీపీఎఫ్ ప్రతినిధులు సభావేదికను సైతం మార్చుకోవాల్సి వచ్చింది. ఆపై హంటర్‌రోడ్డులోని అభిరామ్ గార్డెన్ వేదికగా సభను నిర్వహించారు. షరతులతో కూడిన అనుమతినిచ్చి వరవరరావును సభలో పాల్గొనేందుకు అనుమతించారు. నలమాస కృష్ణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వరవరరావు తదితర నేతలు మాట్లాడుతూ పాలకుల తీరును తీవ్రంగా కండించారు. తెలంగాణ రాష్ట్రంలో సభలు నిర్వహించుకోవడానికి కూడా స్వేచ్ఛ లేకుండాపోయిందన్నారు. కేసిఆర్ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల ఆకాంక్షలను రాజకీయ కార్యరంగంలోకి తెచ్చిన సుప్రసిద్ధ వరంగల్ డిక్లరేషన్ స్ఫూర్తిని మరో తెలంగాణ పోరాటానికి బాటలు వేయాల్సిన చారిత్రాత్మక సందర్భంగా ఆదివారం నిర్వహించిన సభ జరుగుతుందన్నారు. సభ నిర్వహణ పట్ల పోలీసుల వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ సూరపల్లి సుజాత, దేవేంద్ర, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.







'కంగ్రీ'లకు పెరిగిన డిమాండ్

- **కరెంటు కష్టాలతో అల్లాడుతున్న కశ్మీరీలు**

శ్రీనగర్, జనవరి 21: ఎముకలు కొరికే చలిలో కశ్మీరీలు సంప్రదాయ హీటర్లవైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి దాపురించింది. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని స్థితిలో ఉన్న రాష్ట్రంలో హీటర్లను వినియోగించే పరిస్థితుల్లేక, 'కంగ్రీ'లనే కశ్మీరీలు ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో కంగ్రీలకు ఇక్కడ విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన ఎలక్ట్రిక్ దుప్పట్లు, హీటర్ల స్థానంలో మళ్లీ సంప్రదాయ హీటర్లను ఉపయోగించాల్సి వస్తోందని, స్థానికులు వాపోతున్నారు.

12 గంటల కరెంటు కోత

నిజానికి కొన్నేళ్ల క్రితం వీటిని ఉపయోగించేవారి సంఖ్య విపరీతంగా పడిపోయింది, కానీ కరెంటు కష్టాలతో అందరూ మళ్లీ కంగ్రీలవైపు మొగ్గుచూపాల్సివస్తోంది. నిత్యం ఇక్కడ 6-12 గంటలపాటు కరెంటు కోతలుండడంతో చలికి స్థానికులు వణికిపోతున్నారు.

కంగ్రీలంటే?

వాడుక భాషలో మనం దీన్ని 'నిప్పు బుట్ట'లనవచ్చు. రెండు కాళ్ల మధ్య నిప్పు రాజేసిన ఈ బుట్టలను పెట్టకుంటే అప్పుడు ఒంటికి కాసింత వేడి తగిలి, చురుకుదనం వస్తుంది. ఇక ధర విషయానికి వస్తే ఒక్కో బుట్ట రూ. 150-200 వరకూ పలుకుతుంది. నాణ్యమైన కంగ్రీ ధర 300-500 రూపాయల మధ్య ఉంటుంది. మరో విశేషమేమిటంటే ఈ కంగ్రీల తయారీ, వినియోగం కేవలం కాశ్మీర్‌కే సొంతం. హీటర్ల రాకతో కేవలం మధ్యతరగతి, పేదవారు మాత్రమే కంగ్రీలను వినియోగించేవారు, పవర్ కట్‌లను తట్టుకోలేక ఇప్పుడు అందరూ కంగ్రీలనే ఆశ్రయిస్తున్నారు. కశ్మీరీ హస్తకళల్లో భాగమైన కంగ్రీలకు గిరాకీ పెరుగుతుండడంతో, చాలా కాలం తర్వాత కంగ్రీ వ్యాపారులు లాభాలు కళ్లజూస్తున్నారు. ఇక కశ్మీరీల నిత్య జీవితంలో ఇది ఎంతలా భాగమైందంటే..కశ్మీరీ అమ్మాయిల వివాహ సమయంలో అందమైన, ఖరీదైన కంగ్రీ బుట్టలను కానుకగా ఇచ్చి పంపడం ఆనవాయితీగా వస్తోంది.

మన సాహితి

సరళి

మయ నాగరికతకు సాహితీ ప్రతినిధి

ఆస్ట్రియాస్

మిగ్యూల్ యేంజల్ ఆస్ట్రియాస్ సాహిత్యంలో నోబెల్ బహుమతి గ్రహించిన రెండవ లాటిన్ అమెరికన్ రచయిత. ఆయన కవి, నవలాకారుడు, నాటక రచయిత, రాయబారి, పైగా గొప్ప జర్నలిస్ట్. ఆస్ట్రియాస్ లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని, ప్రధాన స్రవంతిలోకి మిళితం చేయటానికి ఎంతో దోహదం చేశాడు. పాశ్చాత్య సాహిత్యానికి అనువుగా, అంతరించిపోయిన సంస్కృతుల, జాతుల వైభవాన్ని పునరుద్ధరించిన మహారచయిత. ఆ విధంగా తన స్వదేశం గౌటిమల ఔన్నత్యాన్ని ప్రపంచానికి అద్దంపెట్టి చూపించాడు.

ఆస్ట్రియాస్ గౌటిమల నగరంలో జన్మించినా, యవ్వనకాలం దాకా పరాయి దేశాలలోనే పెరిగాడు. ఆయన 19 అక్టోబర్ 1899లో జన్మించాడు. 21వ సంవత్స రంలో పారిస్‌లో అంతరించిపోయిన మానవజాతుల చరిత్రని అధ్యయనం చేశా డు. భాషాశాస్త్రాలు, ఆంత్రోపాలజీ ఏ విధంగా సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తాయో నిరూపించిన ప్రథమ లాటిన్ అమెరికన్ రచయితగా చరిత్రకెక్కాడు. పారిస్‌లో చదువుకొనే క్రమంలోనే సర్రియలిస్ట్ ఉద్య మంతో మమేకమై లాటిన్ అమెరికన్ సాహిత్యాన్ని ఆధునిక మార్గంలోకి మళ్లించిన వైతాళికుడు ఆయన. ఆయన మహా రచనగా పేరుబడ్డ ఎల్‌సెనార్ ప్రెసిడెంట్ నవల గౌటిమల దేశపు నియం త్రణలపై ఎక్కుపెట్టిన రచనగా కొనియాడ బడింది. మాక్‌మిలన్ సంస్థ ఆ నవలను ఆం గ్లంలో ప్రచురించి వేల కాపీలు అమ్మింది. ఫలితంగా ఆయన జీవితాంతం ప్రవాసంలో గడిపాడు. ఎక్కు వ కాలం దక్షిణ అమెరికాలోనూ, ఐరోపాలోనూ తలదాచుకున్నాడు. ఆయన మరో మహా అద్భు త నవల మెన్ ఆఫ్ మైజ్‌లో ఆయన అంతరిం చిపోయిన మయజాతి చరిత్రని మహా



అద్భుతంగా చిత్రీకరించి గౌటినుల జాతి నాగరికత తో అనుసంధానం చేశాడు. ఫలితంగా రష్యా 1966లో లెనిన్ శాంతి బహుమతిని దక్కించు కున్నాడు. గొప్ప బాల్యంలేని రచయిత గొప్ప రచ యితగా నిలబడలేడని ఆయన నిర్వచిస్తాడు.



1922లో పేద విద్యార్థుల కోసం తన దేశం లో పాపులర్ విశ్వవిద్యాలయం స్థాపించాడు. ముందుగా వైద్యవిద్యార్థిగా చదువుకున్న కాద నుకొని న్యాయశాస్త్రం అభ్యసించాడు. స్థానిక నే టివ్ ఇండియన్ జాతుల అంతర్ధానంపై సమర్పించిన సిద్ధాంత పత్రాలకు గాల్వేజ్ బహుమతి పొందాడు. దాంతోపాటు ఆయన నెలకొల్పిన సంఘాలు విజృభించి గౌటిమల ప్రజల్లో దేశభక్తిని ప్రేరేపిం చాయి. ఆ బీజాలు ఆయన సాహిత్యంలోనూ ప్రతిబింబించాయి.

ఆయన జీవితాంతం నియంత కాబ్రెరాకి వ్యతిరేకంగా పోరాడి విజేతగా నిల బడ్డాడు. నియంతల ప్రభుత్వాన్ని పడగొట్టడంలో ముఖ్యపాత్ర పోషించాడు. 1936 లో ఆయన రచించిన కవిత్వం రెండో పుస్తకంగా వెలువడింది. 1946లో ఆయన రాయబారిగా చేరి తన జర్నలిస్ట్ జీవితానికి స్వస్తి పలికాడు. తమ దేశంపై ఎన్ సాల్వడార్ తిరుగుబాటులను అణచివేతలో రాయబారిగా ఆయన కృషి వర్ణిం చలేము. ఆస్ట్రియాస్ గొప్ప కథల పుస్తకం లెజెండ్స్ ఆఫ్ గౌటిమల (1930) మయన్ నాగరికత పురాస్మృతిని, స్పానిష్ జాతుల దాడితో అంతరించిన దాని మూలాలు గౌటిమలన్ జాతీయతకి ఏ విధంగా సాంస్కృ తిక జీవసారంగాను వర్ణిస్తాయి. స్పానిష్ అమెరికన్ సాహిత్యానికి ఆంత్రోపాలజీ ఏ విధంగా అనుసం ధానంగా లెజెండ్స్ ఆఫ్ గౌటిమల నిలబడిందో చెప్పలేం. ముఖ్యంగా ఆయన మూడు నవలలు దిబనానట్రైయాలజీలో స్థానిక ఇండియన్ జాతులను అమెరికన్ అరటి కంపెనీలు ఏ విధంగా ధ్వంసం చేశాయో వర్ణించి వాటికి పౌరాణిక స్థాయిని కల్పించాడు. మార్క్వెజ్ హండ్రెడ్ ఇయర్స్ ఆఫ్ సాలిట్యూడ్‌లోనూ బనానా కంపె నీల నాగరికత ధ్వంసం కన్పిస్తుంది. ముఖ్యంగా మయన్ నాగరికతని గౌటిమల సంస్కృతి విస్తారాన్ని ప్రస్తావిస్తా అసంబంధం భాషానుగతం కాదని జాతీయతకే మహాస్ఫూర్తి అని ఆయన తుది భావనం.

◆ సాగర్ శ్రీరామకవచం
9885473934



వేదనల వెండితెర

కథలుగా చెప్పుకోవడానికి
మన వేదనల కన్నీళ్లు
వెండితెరపైన బాగా
ఉపకరిస్తాయి
మబ్బులు కమ్మిన ఆకాశమంతా
జీవితాన్ని కమ్మేసినట్టు
మన కనీళ్ళ అంతరంగాన్ని
ఒక సింబాలిక్ షాట్‌తో
ముగించేస్తారు.
ఇక వెన్నల రాదేమోననే
భయం ఆవహిస్తుంది
మధ్యలో ఓ విరామం
ఓ నిట్టూర్పుకు నెలవౌతుంది
ఎలాగో సమయంతో పాటు
కథ ముగుస్తుంది
కనక వర్షం అక్కడ
కన్నీళ్ళు ఇక్కడ
వెండి తెరపైన ఓ ఆత్మీయతా
భావాన్ని కుమ్మరించిపోతుంది
నవీనమైన సానుభూతితో
కొంత మనోనయనం
చెమ్మగిల్లుతుంది
వేదనల వెండి తెరపైన
ముగింపు ఎలా వున్నా
మన కన్నీటి రేఖా చిత్రం
మాత్రం అలానే వుంటుంది.

\- రవి ఆర్కె
9849294127

'అమోహం'కు 'ఉమ్మడిశెట్టి సాహితీ పురస్కారం'

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు త్రిదశాబ్ది పురస్కారం – 2017 కోసం యువ కవయిత్రి సుధామోదుగు కవితాసంపుటి 'అమోహం' ఎంపికైనట్లు అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ ఉమ్మడిశెట్టి రాధేయ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డు న్యాయ నిర్ణేతలుగా కొప్పర్తి వెంకటరమణమూర్తి, ఆచార్య మేడిపల్లి రవి కుమార్, డాక్టర్ ఆర్.సీతారాంలు వ్యవహరించారు. 'సౌకుమార్యంతో, సౌంద ర్యంతో, పరవశంతో, వివశత్వంతో, వేదనతో, విచికిత్సతో, తత్వాన్వేషణతో మానవ జీవన మార్మికతను కవిత్వమై పలవరించిన కవయిత్రి సుధామోదుగు 'అమోహం' తొలి కవితా సంపుటి కావడం ఓ విశేషం. త్వరలో అనంతపురంలో నిర్వహించనున్న 'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు త్రిదశాబ్ది ఉత్సవం'లో కవయి త్రికి అవార్డు ప్రదానం జరుగుతుందని డాక్టర్ రాధేయ తెలియజేశారు.

\- డాక్టర్ రాధేయ
వ్యవస్థాపకులు, ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు

అక్షరాల తోవ ఉగాది కథల పోటీ

అక్షరాల తోవ సాహిత్య సారథి ఉగాదికి జాతీయ స్థాయి కథల పోటీని నిర్వ హిస్తోంది. ఈ కథలను ఫిబ్రవరి 10తేదీలోగా పంపించాలి. ప్రథమ బహుమతి నాలుగువేల రూపాయలు, ద్వితీయ బహుమతి మూడువేల రూపాయలు, తృతీయ బహుమతి రెండువేల రూపాయలు, నాలుగవ బహుమతి వేయి రూపా యలు అందజేస్తారు. పోటీలను పంపేవారు అక్షర తోవ, దాసరాజు శ్రీనివాస్, ఇ.నెం.11-9-166/1, లెనిన్‌నగర్, అసాధరణ్ ఆస్పత్రి వెనుక, ఖమ్మం – 507001, తెలంగాణ అనే చిరునామాకు పంపాలి. వివరాలకు నామా పురు షోత్తం, 9866645218, దాసరాజు శ్రీనివాస్ 9010972169, రాచమళ్ళ ఉపేందర్ 9849277968 ఫోన్‌నెంబర్లను సంప్రదించవచ్చు.

\- అక్షరాల తోవ, ఖమ్మం

మధ్యతరగతి జీవితాలను చిత్రికగట్టిన మాదిరెడ్డి

సరిగ్గా యాభై యేండ్ల క్రితం కథలు రాయడం ప్రారంభించిన మాదిరెడ్డి సులోచన 15 ఏండ్ల కాలంలో దాదాపు వందకు పైగా కథలు రాసినారు. అంతే సంఖ్యలో నవలలూ రాసినాది. తెలుగు పాఠక లోకానికి ఆమె నవలా రచయిత్రిగానే ఎక్కువగా తెలుసు. ఇప్పుడు ఆమె కథల్లో కొన్నింటిని సంపుటిగా తెస్తున్నాము. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఇక్కడి ప్రతిభను, ఘనతను ప్రపంచానికి చాటి చెప్పే ప్రయత్నంలో ఇప్పుడీ కథలు ఒక్క దగ్గరికి తెస్తున్నాము. ఇందులోని కథలు ప్రధానంగా 1970వ దశకంలోని సమకాలీన తెలుగు సమాజాన్ని చిత్రిక గట్టినాయి. ఇందులో పేదలు ముఖ్యంగా మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వారి జీవితాలను స్త్రీ దృక్కోణంలో ఆవిష్కరించింది. అన్ని కథల్లోనూ తనదైన ముద్ర ఉండేలా పురుష సమాజం పట్టించుకోని లేదా విస్మరించిన అంశా లను అక్షరీకరించారు. కథలు ప్రధానంగా హైదరాబాద్ కేంద్ర బిందువుగా నడిచాయి. అయినప్పటికీ ఇందులోని దాదాపు సగం కథలు విదేశాల్లోని విషయాలను విమర్శనా దృక్కోణంతో వస్తువుగా స్వీకరించి రాసినవే! స్త్రీల పట్ల సమాజం చూపించే ఉదాసీనత, వివక్ష, చివరకు తల్లిదండ్రులు కూడా ఆడపిల్లల పట్ల ఎట్లా నిర్బా ధ్యతగా ఉంటారో ఈ కథల్లో ఆమె చెప్పారు. అంతేగాదు స్త్రీలు వ్యక్తపరిచే అసూయ, అనుమానం పడే ఆపోహ చేసే అవమానం అన్నీ ఏ మాత్రం వెనకేసుకు రాకుండా రాశారు.



1976లో రాసిన 'తాడిక్రింద పాలు' కథలో ఒంటరిగా ఒక తెలుగు మహిళ ఢిల్లీకి ఇంటర్వ్యూకు వెళ్ళడం. అదీ నైజీరియాలో ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు పోవడాన్ని గురించి రాశారు. అయితే ఇందులో విశేష మేమిటంటే గతంలో ఎప్పుడో చేసిన తప్పుకు ఎప్పటికీ శిక్ష విధిస్తూ ఉండ డాన్ని తప్పు పట్టారు. మనుషుల నైజాన్ని, మనసుల్లోని ఖాళీలను ఎత్తి చూపించింది. హైదరాబాద్‌లో ఉన్న ప్పుడు ఆప్యాయంగా, అన్యోన్యంగా ఉన్న పక్కింటి కుటుంబం వాళ్ళు ఢిల్లీలో అందుకు విరుద్ధంగా ప్రవర్తించ డాన్నీ కూడా ఈ కథలో చిత్రించారు. ఇంటర్వ్యూ కోసం ఒంటరిగా ట్రెయిన్ లో ప్రయాణం చేయాల్సి రావడం, అక్కడికి వెళ్ళిన తర్వాత అపరిచితుడైన ఒక వ్యక్తి అన్నీ దగ్గరుండి సహాయం చేయడం, అతడి వ్యక్తిత్వంపై ఇతరులు అనుమానం వ్యక్తం చేయడం, చివరికి అతడు గతంలో విచ్చలవిడిగా తిరిగినా దాన్ని వదిలేసి ప్రస్తుత ప్రవర్తననే పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు.

ఈ కథల్లో అమెరికా, లెబనాన్, నైజీరియా, ఉగాండా ఇట్లా అనేక దేశాలకు వలసబోయిన తెలుగువారి జీవితాలను, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిగమించిన తీరుని ఆమె రాసినారు. తెలుగు కథా సాహిత్యంలో విదేశాలకు వెళ్లిన తెలుగువారి జీవితాలను విస్తృతంగా చర్చించిన వారిలో మాదిరెడ్డి సులోచన ముందుంటారు. వీరిలో బహుశా ఈమె మొట్టమొదటి కథయిత్రి కావొచ్చు కూడా! తెలుగు డయోస్పొరా కథల్లో ఈమె కథలు మేటి అని చెప్పొచ్చు. మాదిరెడ్డి రాసిన 'కానుక' కథలో అమెరికా నుండి వచ్చిన క్లాస్‌మేట్ వివాహం సందర్భంగా ఇచ్చిన గిఫ్ట్ పట్ల గెస్టులు తిరస్కార భావాన్ని చిత్రించారు. గిఫ్ట్‌కు వంకలు పెట్టడం కాదు. దాన్ని ఇచ్చిన వారి మనసుని చూడాలన్నట్టుగా చెప్పారు. మరో కథ 'అసూయ'లో తోటి వారిని చూసి ఆసూయపడే మనస్తత్వాన్ని చిత్రించారు. అది కూడా నైరోబిలో. ఇందులో విదేశాల్లో తెలుగువారి మాట వినబడితే కలిగే ఉద్వేగాన్ని, వారి కలయికను గురించి చెప్పారు. నైరోబీ వెళ్లిన తెలుగువారు అసూయను అలాగే తీసుకెళ్ళిన తీరుని వివరించారు. ఇందులో కూడా స్త్రీల హక్కులు, సమానత్వం గురించి కూడా రాసింది. అలాగే 'మరపురాని క్షణాలు' కథలో ఉగాండా రాజధాని అడిస్ అబాబాలో పోలీసులు, దొంగలు, వారి బారిన పడ్డ ఇద్దరు యువతులు, చివరికి వారి సాహసం తెచ్చిన తంటాలను చెప్పారు. ఇవన్నీ ఆఫ్రికా దేశమైన నైరోబీలో దాదాపు తొమ్మిదేండ్లు మాదిరెడ్డి సులోచన ఉద్యోగం చేయడం మూలంగానే రాయగలిగారు. విదేశాల గురించి రాసిన విధంగానే ఢిల్లీ, బొంబాయి, మద్రాసుల గురించి రాయగలిగారు. అంటే ఆమె అప్పటికే దేశ, విదేశాలు పర్యటించి ఉండడం మూలంగానే వాటి మూలాలు పట్టుకొని రాయగలిగారు. రచయిత తాను చూసిన ప్రదేశాలను చూడచక్కగా వివరిస్తారు. ఆ పనిని సులోచన కరెక్టుగానే చేసినారు. పాఠకులకు అటు ఢిల్లీని, ఇటు అడిస్ అబాను తన కథనంతో కండ్ల ముందర ఉంచారు. విదేశాలతో పాటు స్వదేశంలోనూ పెరిగిపోయిన మద్య సేవనం, ధూమపానం గురించి రాశారు. అయితే అప్పటికింకా ఇవి రెండూ ఆరోగ్యానికి హాని కలిగించే, కూడని పనులు అనే ధ్యాస లేకుండేది. అందుకే ఆమె అలవోకగా వాటి గురించి, 'హీరోచితంగా' రాసినారు.

విదేశాలు, మత్తు, ధూమపానం, వేశ్యాలోలత్వమే గాకుండా సాంసారిక జీవితాలను కూడా అక్షరబద్ధం చేశారు. అంతేగాదు స్త్రీల కాఠిన్యాన్ని చిత్రించిన కథలు కూడా ఇందులో ఉన్నాయి. 'ఓ తల్లి కథ'లో తన కూతురు చనిపోవడంతో అల్లుడికి మరో పెళ్లిచేసి ఆమెను భర్త దగ్గరకు వెళ్ళకుండా అనేక ఇబ్బందులు పెట్టి కేవలం పనిమనిషిగా, తన మనవరాలు/మనవడి బాగోగులు చూసుకునే ఆయాగా ఉండాలని కోరుకున్న ఓ తల్లి కథను చెప్పారు. అలాగే 'యుగళ గీతం' అనే కథ... కొత్త పెళ్ళి కూతురు పుట్టింటి వారిని ఒక విధంగా, మెట్టినింటి వారిని మరోవిధంగా చూడడాన్ని తప్పుబట్టారు. చివరికి ఆ కొత్తపెళ్ళి కూతురు అక్క ఉపాయం ఇచ్చి భార్యాభర్తల మధ్య పెరిగిన దూరాన్ని చెరిపేసింది. 'హరిప్రియ' అనే కథలో స్త్రీల హక్కులు, సమానత్వం గురించి చర్చ చేసినారు. స్త్రీవాద దృక్కోణంతో కథను కొనసాగించారు. అయితే అందరు పురుషులూ ఆధిపత్యాన్ని ప్రదర్శించబోరని, వాళ్లలో గూడా సమానత్వాన్ని కోరుకునే వారుంటారని ఇందులో చెప్పారు. ''అదొక్కటేనా స్త్రీని పిల్లలు కనే యంత్రంగా వాడుకోవటం లేదూ! స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు అరి కట్టటం లేదు. పై చదువులు చదివిస్తున్నారా? చదివితే తమకు చిన్నతనం అనుకోవటం లేదూ'' అంటూ గళాన్ని వినిపించారు. మరో కథ 'కోరిక తీరిన వేళ'లో స్త్రీలు తల్లి కావాలని పడే తపనను చిత్రికరించారు. అంతేకాదు.. ఎవరికి వారు తమ పిల్లలను తమ కిష్టమైన రీతిలో పెంచాలని చూడడాన్ని కూడా చెప్పారు. కథ చివరికి విషాదాంతంగా ముగిసింది. అనాకారిగా ఉండే మగువ పట్ల తల్లిదండ్రులు కూడా వివక్ష ప్రదర్శిస్తారని, అది చివరికి హత్యలకు దారి తీసిన విధానం గురించి 'తప్పునాదా?'' కథలో చెప్పారు. భర్త చేతిలో చిత్రహింసలకు గురయ్యే మగువను రక్షించడమే గాకుండా చివరికి వివాహమాడిన యువకుడి వీరోచిత గాథని 'పంజరం విడిచిన పక్షి' కథలో రక్తి కట్టించారు. ఈమె కథల్లో మధ్యతరగతి

> తెలుగు కథా సాహిత్యంలో విదేశాలకు వెళ్లిన తెలుగువారి జీవితాలను విస్తృతంగా చర్చించిన వారిలో మాదిరెడ్డి సులోచన ముందుంటారు. వీరిలో బహుశా ఈమె మొట్టమొదటి కథయిత్రి కావొచ్చు కూడా! తెలుగు డయోస్పొరా కథల్లో ఈమె కథలు మేటి అని చెప్పొచ్చు.



జీవితంలో ప్రధానమైన సినిమాలను, ఎగువ మధ్యతరగతి జీవితాల్లో టైమ్‌పాస్ ఆటయిన పేకాట గురించి విరివిగానే రాశారు. కథలు చదువుతూ ఉంటే మనం ఒక యాభై ఏళ్ళు వెనక్కి వెళతాం. ఆనాడు నలుగురు తాజ్‌మహల్ హోటల్లో తినగలిగినన్ని తిన్నా బిల్లు 50 రూపాయలకు మించలేదు. అలాగే ఎక్కడైనా టెలిగ్రామ్‌లు, ఉత్తరాలే ఉన్నా యి. అంతెందుకు ఢిల్లీకి వెళ్ల డానికి 48 గంటల రైలు ప్రయాణమని రాశారు.

మొత్తమ్మీద ఈ కథల్లో మధ్య తరగతి నుంచి ఎగువ మధ్య తరగతి జీవితాలను విరివిగా చిత్రించారు. ఉద్యోగస్తులు ముఖ్యంగా లెక్చరర్లు, డాక్టర్లు, లాయర్లు, టీచర్ల గురించి, వారు వృత్తి రీత్యా ఎదుర్కొంటున్న సమస్యలనూ, వారి నిజాయితీని గురించి చెప్పారు. అలాగే సమాజంలో పేరుకు పోయిన అవినీతిని, దాన్ని ఎవరికి వారు ఎలా తుదముట్టించాలో కథల్లోని పాత్రల ద్వారా చెప్పిం చారు. ఇక ఎగువ మధ్యతరగతి విషయంలో విదేశాలకు వలస వెళ్ళిన కుటుంబాల గురించీ, వారి హాబీలు, అలవాట్లు, విపరీతపు పోకడల గురించి చెప్పారు. అంతేగాదు సంపన్న కుటుంబాలు, కార్పొరేట్ స్థాయి వ్యాపారాలు అందులో ఉండే సాధక బాధకాలను కథల్లో చెప్పింది.


తెలంగాణ నుంచి రాజకీయ కథలు రాసిన వారిలో కూడా ఈమె అందె వేసిన చేయి. 'ఇదీ భారతం' అనే కథలో జై ఆంధ్ర ఉద్యమ సమయంలో టెంపరరీ ఉద్యోగాల కోసం కూడా పైరవీలు ఎలా జరిగేవో, టాలెంట్ ఉన్న వారికి సైతం అన్యాయం జరిగే విధానాన్ని ఎండగట్టింది. బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, అవినీతి, ప్రభు త్వాల ఆలసత్వం అన్నీ కలగలిసి నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను పాలకుల్లో చలనం తీసుకొచ్చే విధంగా అక్షరీకరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో మాదిరెడ్డి సులోచన గురించి ఎక్కువగా గాకున్నా కొంత చర్చ జరిగింది. పాఠ్య పుస్తకాల్లో ఆమె రచనలను చేర్చడం జరిగింది. ఆమె నవలల గురించి, సినిమాలుగా రూపొందిన నవలల గురించీ, కథల గురించీ కొంత లోతుగానే సాహిత్య లోకంలో చర్చ జరుగుతోంది. ఆమె నవలలు కొన్నింటిని ఇటీవల కొన్ని ప్రచురణ సంస్థలు పునర్ముద్రిస్తున్నాయి. అందులో భాగంగానే తెలంగాణ ప్రచురణలు 'సుషుప్తి' నవలను పునర్ము ద్రించింది. తెలంగాణ మూలాలను పట్టించుకుంటున్న, వెలుగు లోకి తెస్తున్న విద్యావతి... ఆమె జీవిత చరిత్రను తెలుగు అకాడెమీ కోసం రాశారు. నవచేతన పబ్లికేషన్స్‌వారు 120 మంది తెలంగాణ స్త్రీల కథలను సంకలనంగా వెలువరించారు. దీంతో తొలితరం తెలంగాణ కథా రచయిత్రుల గురించి మళ్ళీ చర్చ జరుగుతోంది. ఈ చర్చను మరింత ముందుకు తీసుకు పోయేందుకు ఇటీవల బొమ్మ హేమాదేవి కథలను నా సంపాదకత్వంలో వెలువరించాను. ఇప్పుడు మాదిరెడ్డి సులోచన కథలను విద్యావతితో కలిసి మీ ముందుకు తీసుకొస్తున్నాము. అయితే ఆమె రాసిన వందకు పైగా కథల్లో ఇప్పుడు 20 కథలను మీ ముందుకు తెస్తున్నాము. అవకాశం, ఆర్థిక స్థితి కలిగినట్లయితే మిగిలిన కథలను కూడా వీలువెంబడి ప్రచురిస్తాము. అందుకు మీ అందరి ఆదరాభిమా నాలు, సహాయ సహకారాలు అవసరం.. వాటిని మీ నుంచి ఆశిస్తూ...

◆ సంగిశెట్టి శ్రీనివాస్

(మాదిరెడ్డి సులోచన కథలు పుస్తకానికి రాసిన ముందుమాట)

అక్షర మధనం

నిత్యం మధనం ఎక్కడడైనా జరుగుతూ ఉంటుంది అంటే అది కవి అంతరంగంలోనే! అవును కవి నిత్యం సమాజం చుట్టూ భ్రమిస్తూ ఉంటాడు. అలా తిరుగుతున్నప్పుడు వివిధ సమస్యలు అత నిని వెంటాడి వేధిస్తుంటాయి అప్పుడే అతని అంతరంగ లోయలలో నుంచి అక్షర కెరటాలు ఉవ్వెత్తున లేచి ప్రచండ రూపం దాల్చి సమా జాన్ని నగ్నంగా నిలబెడతాయి. కవి శరీరమంతా కవనమయమే. ఆణువణువూ కవితాక్షరమే తన మనసు. మెదడు కళ్ళు, చేతులు ఇలా అన్ని అవయవాలలో నుంచి కవ నం పాల నురగలా ఉప్పొంగుతూ ఉంటుంది. సీనియర్ కవి, రచ యిత వారణాసి భానుమూర్తి రా



వు హృదయంలో మధింపబడిన కవితా సంకలనం సాగర మధ నం. ఈ కవితా సంపుటిలోని కవి తలన్నీ సమాజంలో జరిగే వివిధ పరిణామాలపై తన కలం గాండ్రిం చి ప్రశ్నించింది. మొదటి కవిత మార్పు భానుడులో మనిషి మాట్లాడే జంతువని నిక్కచ్చిగా చెప్పడమే కాక వ్యవస్థలో మార్పు రావాలి అని మధనపడి పోతాడు. పచ్చి నిజం కవితలో నిజాల ఇజాలను పచ్చిగా కడిగేస్తాడు. కార్మిక చక్రవర్తి కవితలో కార్మికుడిని ఒక దరిద్ర నారాయ ణుడు అని చెప్పిన తీరు బాగుంది. అవును కార్మికుడు నారాయణుడే కదా.. అతను లేనిదే ఈ భూమి ముందుకు నడ వదు కాని దరిద్రం మాత్రం అతని వెంటే ఉంటుంది. ఈ పుస్తకం పతాక కవితా సాగర మధనంలో ఆటుపోట్లు ఎన్ని ఉన్నా ఈ ధరణి పవిత్రత కోసం మాటలు రాని మూగజీవిలా మారి అక్షరాలతో కేకలు పెట్టించి ధరణి పవిత్రతను కాపాడుకుంటాను అని శపథం చేస్తున్నాడు. రైలు బండి కవితలో రైలు ప్రయాణం గురించి వర్ణించిన తీరు రైలులో లుచ్ఛగాళ్ళు, తుచ్ఛాగాళ్ళు చేసే అల్లరి పను లు, ఇలా ఒకాట రెండా సమస్త రైలు సమస్యలు ఒక్క కవితలో చెప్పడమే కాక కవితలో ఆర్తి, ఆవేదన, వ్యంగ్యం, బాధ, హాస్యం, వెగటు.. ఇలా నవరసాలు ఒకే కవితలో పండించారు. అనుభవం ఇది.. అనుభవిస్తేనే కదా తెలుస్తుంది. తనకున్న అనుభవంతో అనుభవం గురించి నాలుగు వాక్యాలలో అనంత భావాన్ని నింపి మన ముందుం చారు. తప్పెవరిది అనే కవితలో తాగిన మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రాణాలర్పించిన బడాబాబుల పుత్రరత్నాల మరణాలకు కారకులెవరు? వారి తల్లిదండ్రులే కదా.. అని వివరించిన తీరు బాగుంది. ఇలా కవి సమాజంలోని వివిధ పరిణామాలపై కవితా బాణాలతో సంధించాడు అని చెప్పాలి. పుస్తకంలోని కర్తవ్యం, నేను సైతం, శాంతి పవనం, నేను, అనుభవం, అంతే చాలు, జీవిత వేదం ఇలాంటి కవితలన్నీ చదువరులను ఆలోచింప చేస్తాయి. వారణాసి భానుమూర్తి రావు తెలుగు సాహిత్యానికి మరెన్నో పుస్తకాలు అందించాలని మనస్ఫూర్తిగా కోరుతూ....!!

◆ అఖిలాశ, బెంగుళూరు
072595 11956

పుస్తక సమీక్ష

తెగువతో వదిలిన విల్లు... వెన్నెలవాడ కవిత్వం

తన చుట్టూ ఉన్న జనానికి వెలివాడ నుంచి వెన్నెలవాడకు దారి చూపిస్తున్న యువకవి కే.పీ.లక్ష్మీనరసింహ. కన్నీళ్లు పక్కనబెట్టి ఆత్మవిశ్వాసంతో అక్షరాలే ఆయుధాలుగా అడుగులేస్తున్న తెగువ అతడు. అణగదొక్కే మనువాదంపై, ఆదు కోని ప్రభుత్వంపై, దోపిడీదారులపై ఎక్కుపెట్టిన కవితాస్త్రాలు ఈ వెన్నెలవాడ కవితలు. అంబేద్కర్, జ్యోతిరావ్ పూలే, నారాయణ గురు, పెరియార్, కాన్షీరాం, సావిత్రి బాయిలను అణువణువునా నింపుకొని, వారి ఆశయా లను నరనరాన రక్తంలో నింపుకున్న వారి వారసుడు. వాళ్ళంతా విడిచిన విల్లులాంటి వారు కొందరు, అందులో ఒకడు కే.పీ. మనువాదంపై, అగ్రకులాలపై విసిరిన బాణాలు ఇందులో కోకొల్లలు.

'నీ శాస్త్రాలు / మేము విసిరిన విస్తర్లు

మనువా! / వెలివాడలు వెన్నెలవాడలై లేస్తున్నాయి' అంటూ గుండె నిండా ధైర్యాన్ని లేవనెత్తుతాడు. దోపిడీ వ్యవస్థను బొంద పెట్టడానికి బహుజన దళమై 'కాషాయ చీకటిని / నీలి జెండాలై పాడె కడతాం!' అంటాడు. నన్నూ నా చరిత్రను మట్టిలో కప్పెట్టినా నేను విత్తనంలా పొడుచుకొస్తానని, మా అస్థిత్వాన్ని అణగదొక్కితే బెదిరే కోడిపిల్లను కానంటూ 'వెలివాడ పొయిల / పదునెక్కిన ఖడ్గాన్ని' అంటూ పౌరుషం చూపుతాడు. తన కోపాన్ని, ద్వేషాన్ని ఎన్ని రకాలుగా చెప్పినా, అది తనలో రగిలే దావాగ్ని లావాలా ఎగసెగసి పడుతూనే ఉంటంది, వెలివాడలు వెన్నెలవాడలయ్యేదాక.

పల్లెలన్నీ పట్టణానికి ఎలా వలస పోతున్నాయో చెబుతూ, రైతన్న జీవితాన్ని వర్ణిస్తూ కార్పొరేట్ దాడులకు ఎలా ఒరిగిపోతున్నాడో వివరిస్తాడు. రైతు ఎద మట్టి లో సమాధి ఔతోందని, ఆయువు పోస్తున్న రైతన్న ఆవిరైపోతున్నాడని రైతు దీన గాథను చూపెడతాడు. నీటిలో కలువలా తేలాల్సిన మగువ నేడు లోతుల్లో వేరు తెగిన కలువ మొక్క ఈ దేశ ఆడపిల్ల అంటూ, ఆడపిల్ల మొలకెత్తని విత్తనం అయ్యిందని ఆవేదన చెందుతాడు. రాజకీయ నాయకులు తమ పబ్బం గడుపుకోవడానికి ఎలా తియ్యగా మాట్లాడుతూ, ప్రజల్లో కలిసిపోతూ, ఎన్నెన్నో రకాలుగా నటిస్తూ, ఆకట్టుకుంటూ ఉంటారు. వారి కపట చిరునవ్వు వెనుక విషపు కోరలు దాగు న్నాయని, అవసరమైనప్పుడు ఓటుతో మా ప్రతాపం చూపిస్తా మని హెచ్చరిస్తాడు. తెలంగాణ వచ్చాక బతుకులన్నీ బాగుపడ తాయనుకుంటే ఉద్యోగాలు లేక విద్యార్థులు ఎలా విలపిస్తు న్నారో గుర్తుచేస్తూ, ఇప్పుడు ఉద్యోగాలకై ఉద్యమాలు చెయ్యా లంటాడు. మిగతా కవితల్లో కులాల నాగులకు ప్రేమికులు ఎలా బలౌతున్నారో, కాలం ఎలా



చేపపిల్లలా జారి పోతుందో సెలవి స్తాడు. భాష, శిల్పం విషయానికొస్తే ఆవేశానికి తగ్గభాషతో, పల్లెపదాలతో అచ్చమైన పరిమళాన్ని అందిస్తాడు. పదాల్లో, వాక్యాల్లో ఎదిరించే వాక్య ప్రయోగం, ప్రవాహం కనబడుతుంది. నిరంతర పోరా టం సాగించడమే కర్తవ్యం అంటాడు. నింగిని ఒడిసి పట్టాలన్న ఆశతో ఎగిసిపడి నప్పుడల్లా ఎన్ని ముత్యాలు జారిపడినా, ఎన్ని అవమానాలు మూటగట్టుకున్నా ఆ చూపు గమ్యాన్ని ఏదో ఒకరోజు ముద్దాడుతుందని ఆశయాన్ని తన కవిత్వంతో వినిపిస్తాడు. చరిత్ర తిరగరాసినంత మాత్రాన మొఖం వీపు కాదని మేము నీ గాలికి విరిగిపడే రెమ్మలము కాము, మూలవాసి మానులం అంటూ ఇలాగే మరిన్ని బాణాలను సంధిస్తూ కోల్పోయిన జీవితాన్ని పొందుతూ, అలుసుగా చూస్తున్న జనాన్ని ఎదిరిస్తూ సమానత్వం, సాధికారత సాధించేదాక కలం కన్న కలలను నిజం చెయ్యాలని ఆరాటపడతాడు. ఇలాగే ఇంకా ఎంతో పదునైన కవిత్వం రాస్తూ సాహితీ జగత్తులో తనదైన ముద్ర వెయ్యాలని ఆశిద్దాం.

◆ పుట్టి గిరిధర్
9491493170

Manam Mahi
మనం మహి
హైదరాబాద్
సోమవారం 22 జనవరి 2018
భూమి అందరి అవసరాన్ని తీరుస్తుంది, అత్యాశను కాదు
5

మడ అడవులే మనుగడ



మడ అడవులపై మన దేశానికి చెందిన యువకుడు తీసిన చిత్రానికి 2017 అంతర్జాతీయ యువ వీడియో పోటీల్లో బహుమతి లభించింది. కేరళకు చెందిన ఆదర్శ్ ప్రతాప్ అనే 23 ఏళ్ల యువకుడు తమిళనాడులో ని పిచ్చావరం ప్రాంతంలోని మడ అడవులపై తీసిన వీడియో చిత్రానికి ఈ బహుమతి ప్రకటించారు. 'మడ అడవుల్ని సంరక్షిద్దాం' అనే టైటిల్‌తో తీ సిన ఈ వీడియోలో మడ అడవుల సంరక్షణ వల్ల లభించే ప్రయోజనాల ను ప్రతాప్ వివరించాడు. 2004లో తమినాడును సునామీ తుడిచిపెట్టిం ది. అయితే ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచిన ఈ మడ అడవులు విస్తరించిన ప్రదేశంలో మాత్రం కనీసం ఒక మరణంగానీ, పైసా ఆస్తినష్టం గానీ సంభవించకపోవడం విశేషం. అంతేగాక ఈ మడ అడవుల వల్లే ఆ ప్రదేశంలోని 18 గ్రామాల మనుగడకు ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు.

కేరళలోని వెల్లాయనిలో వ్యవసాయంలో మాస్టర్ డిగ్రీ చేస్తున్న ఆద ర్శ్ ప్రతాప్ ఈ అడవుల వల్ల కలిగే ప్రయోజనాలు తెలుసుకుని ప్రపంచానికి మడ అడవులు ఘనతను చాటిచెప్పాలనుకున్నాడు. 'లెట్ మాన్‌గ్రోవర్స్ రికవర్'టైటిల్‌తో అతను తీసిన షార్ట్ ఫిల్మ్ వాతావరణ మార్పులను వివరించింది. వాటివల్ల వేలాదిమంది ఎలా కాపాడబడ్డారో తెలిపాడు. కోస్తా ప్రాంతాల్లోని ప్రజలను రక్షించేందుకు పర్యావరణాన్ని మడ అడవులు పోషిస్తున్న పాత్రను వివరించాడు. ఐక్యరాజ్యసమితి వాతావరణ మార్పుల సచివాలయానికి చెందిన వాతావరణ సాధికారత సంస్థ ఈ పోటీని నిర్వహించింది. ఈ పోటీకి 94 దేశాల నుంచి 247 ఎంట్రీలు వచ్చాయి. పోటీలో పాల్గొన్నవారిలో 18 నుంచి 30 ఏళ్ల లోపువారే ఉన్నారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పోల్ ద్వారా ఇద్దరిని విజేతలుగా ప్రకటించింది. ప్రకృతి సంబంధమైన షార్ట్ ఫిలిమ్స్‌ను తీయాలనుకుంటున్న ట్లు ప్రతాప్ తెలిపాడు. ప్రస్తుతం ఉత్తర కేరళలోని నిలంబూర్‌లో గల చోళ నాయకులపై చిత్రాన్ని తీస్తున్నానన్నాడు. వాతావరణ మార్పుల వీడియోల కోసం టీవీ చానల్‌ను ప్రారంభించాలనుకుంటున్నాడు. -(మహి డెస్క్)

'హరిత' హాలాహలం


మొదటి హరిత విప్లవ ప్రయోగం దేశ భూసారాన్ని, ప్రజారోగ్యాన్ని గుల్లచేస్తే, ముంచుకొస్తున్న మలి విడత హరిత విప్లవం జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేసే ప్రమాదం పొంచివుంది. మలి విడత హరిత విప్లవంలో భాగంగా క్రిమి సంహారక లక్షణాలతో పాటు అధిక దిగుబడి నిచ్చే హైబ్రిడ్ విత్తనాల(బీటీ పత్తి, బీటీ వంకాయ, బీటీ ఆవాలు వంటి)లతో వ్యవసాయం చేయడం ప్రపంచ ఆహార భద్రతకు భరోసాగా వ్యవసాయ వాణిజ్య కార్పొరేట్ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీటీ విత్తనాలు క్షేత్రస్థాయిలో పర్యావరణం, పంట దిగుబడి దెబ్బతీయడమే కాక, సార్థకనామ లక్షణమైన క్రిమి సంహారక లక్షణాలను సైతం ఏ మాత్రం ప్రదర్శించకపోవడంతో దేశ వ్యాప్తంగా పత్తి రైతాంగం దివాళా తీసింది. పర్యవసానంగా వ్యవసాయ సంక్షోభం కారణంగా జరుగుతున్న రైతు ఆత్మహత్యలూ గణనీయంగా పెరిగాయి. క్షేత్రస్థాయి ప్రతికూల ఫలితాల దృష్ట్యా కొత్త హైబ్రిడ్ విత్తనాలను సరైన అనుమతులు, ముందస్తు ప్రయోగాలు లేకుండానే వ్యవసాయ కార్పొరేట్ సంస్థలు మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నాయి. గత్యంతరంలేని స్థితిలో రైతాంగం నేడు బీజీ 3 (బీటీ రకం) పత్తి విత్తనాల వేలంవెర్రిలో కొట్టుకుపోతోంది. అనధికార, పర్యావరణ కాలుష్యకారక, జీవవైవిధ్య వినాశక బీటీ 3 పత్తి విత్తనాల వినియోగంపై విధివిధానాలను, మార్గదర్శకాలను రూపొందించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది.

పత్తి అధికంగా సాగుచేసే గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో అనుమతిలేని బీటీ విత్తనాలు ఏ మేరకు వ్యాప్తిచెందాయో అధ్యయనం చేసేందుకు క్షేత్రస్థాయి తనిఖీ, శాస్త్రీయ మూల్యాంకన కమిటీ (ఎఫ్ఐఎస్ఈసీ) బృందం ఇటీవల తెలంగాణలోని గద్వాల, మంచిర్యాల, వికారాబాద్ జిలాల్లో పర్యటించి అనేకమంది రైతులు ఈ విత్తనాల్ని పలుచోట్ల వినియోగించడాన్ని గుర్తించింది. కొన్నేళ్లుగా కార్పొరేట్ సంస్థలు చట్టవిరుద్ధంగా బీటీ 3 పత్తివిత్తనాలను మార్కెటింగ్ చేస్తున్నా, దేశంలో రైతుల ఆత్మహత్యలు, నిరసనలు పెరిగే దాకా కేంద్రం పట్టించుకోకపోవడం శోచనీయం.

తెలుగు రాష్ట్రాల్లో తెలంగాణలోనే పత్తి పంటను అధికంగా సాగుచేస్తు న్నారు. దేశంలో 40 శాతం పత్తి విత్తనాల అవసరాలను తీర్చే విధంగా తెలంగాణలో బీటీ పత్తి విత్తనాలు ఉత్పత్తి అవుతున్నాయి. తెలంగాణ రైతులు పది రకాల పత్తి విత్తనాలను 80–95 లక్షల ప్యాకెట్లను (ఒక ప్యాకెట్ బరువు 450 (గ్రాములు) వినియోగిస్తున్నారు. వర్షాభావ ప్రాంతాల్లో పత్తిని సాగు చేయడం వల్ల రైతాంగం నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అధిక దిగుబడి, అధిక ఆదాయం ఉన్నందు వల్ల బీటీ పత్తి విత్తనాల్ని రైతాంగం ఎంచుకోవడం లేదు. ఇతర విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో గత్యంతర పరిస్థితుల్లో బీటీ పత్తిని పండిస్తున్నారు. బీటీ మార్కెట్‌లోని 93 శాతం వాటా ఉన్న మోన్‌శాంటో కంపెనీ విత్తన వ్యాపారంలో గుత్తాధిపత్యం సాధించింది.

ఒక్కొక్క ప్యాకెట్‌పై రాయల్టీగా రూ.700లను మోన్‌శాంటో వసూలు చేయడంతో పత్తి రైతు ఉత్పాదక ఖర్చు 8వేల శాతానికి పెరిగినా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణం. ప్రపంచీకరణలో భాగంగా 1995లో భారత విత్తన మార్కెట్లోకి మోన్‌శాంటో కార్పొరేట్ వ్యవసాయ వాణిజ్య సంస్థ ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటిదాకా రెండులక్షలకు పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని అనేక అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. 2002 నుంచి బీటీ విత్తనాలు మార్కెట్‌లోకి వచ్చాయి. పునర్ వినియోగానికి పనికిరాని విత్తన పరిశ్రమ, వ్యాపారం దేశంలో వ్యవస్థీకృతం కావడంతో భారత రైతాంగ విత్తన సార్వభౌమత్వం హరించుకుపోయింది. వ్యవసాయ కార్పొరేట్ శక్తుల అత్యాశ పునాదిగా జరిగే ప్రపంచీకరణ, హరిత విప్లవం – 1, 2, భారీ నీటి ప్రాజెక్టులు, రసాయనాలు, హైబ్రిడ్ విత్తనాల, వ్యవసాయోత్పత్తుల ఫ్యూచర్స్ మార్కెట్ మాయాజాలం వగైరా రూపంలోని వ్యవసాయ విధానాలు వ్యవసాయక సమాజాల స్వయం సమృద్ధిని ధ్వంసం చేశాయి. కార్పొరేట్ వ్యవసాయ విధానాలు ఇలానే కొనసాగితే 'రైతాంగ ఉపద్రవం' ప్రభుత్వాలను ముంచెత్తుతుంది.

మథనం



భూగర్భ జల బకాసురులు

> జల వాణిజ్యంపై ప్రపంచ కార్పొరేట్ వాణిజ్య దిగ్గజాల కన్ను పడింది. పారిశ్రామిక కార్యకలాపాలకు కూడా జల వినియోగం అవసరం కావడంతో ఈ కంపెనీలు భూగర్భ జలాశయాలను సైతం కబళిస్తున్నాయి.

భూమిమీద మనకు లభించే సహజవనరుల్లో నీటిని మించినది మరొకటి లేదు. నీరే అన్ని ప్రాణులకు జీవనాధారం. భూమి వేడెక్కడం, కరవు పరిస్థితులు తురచుగా తలెత్తుతుం డడం, కాలుష్యజలాల లభ్యత పెరగడం, పరిశుభ్రమైన నీరు లభించడం అగమ్యమైన పరిస్థితులు ఈశతాబ్దంలో మనిషిని వేధిస్తున్న ప్రధాన సమస్యగా పరిణమించింది. ప్రపంచంలో గ్లోబల్ కార్యకలాపాలకు, వల్లెవేస్తున్న అభివృద్ధి మంత్రానికి, ప్రపంచీకరణలో భాగంగా నీరు ప్రముఖపాత్ర పోషిస్తోంది. ద్రవ్యాన్ని వినిమయంగా భావించే గ్లోబల్ కంపెనీల విన్యాసాలు పెరిగి జల వాణిజ్యంపై వాల్ స్ట్రీట్, ప్రపంచ వాణిజ్య దిగ్గజాల దృష్టిపడి ంది. ఇతర పారిశ్రామిక వాడలకు కూడా జల వినియోగం అవసరం కావడంతో ఈ దిగ్గజ కంపెనీలు జలవాణిజ్యంపై వేగంగా అడుగులు వేయడం మొదలుపెట్టాయి.

ప్రపంచంలోని నీటి వనరులను కొనుగోలు చేయడం వారి ప్రధాన లక్ష్యంగా మారింది. ఇందుకు వారికి ప్రపంచబ్యాంకు అండదండలు కూడా లభించడంతో వాటి ప్రయత్నాలు మరింత ముమ్మరమయ్యాయి. ప్రపంచ సంపన్నులు, ప్రపంచంలోని ప్రధాన బ్యాంకులు ఈ వ్యాపారంలో భాగస్వాములయ్యాయి. మనిషికి నీటి హక్కును రద్దు చేస్తూ బహుల జాతి సంస్థల ఒత్తిడితో ఐక్యరాజ్య సమితి తీర్మానం చేసింది. భూగర్భం నుంచి నీటిని తోడేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించేందుకు, పెంపొందించుకునేందుకు దిగ్గజ కంపెనీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రపంచంలోని ఏ ప్రాంతంలో భవిష్యత్తు అవసరాల కోసం ఎవరు నీటిని నిల్వచేసినా ఈ కంపెనీ ప్రతినిధులు చేరుకుని పోటీపడి మరీ కొనుగోలు చేస్తున్నాయి. భూమి ఉపరితలంపై లభించే జలాన్నే కాకుండా, భూగర్భంలో లభించే నీరు నీటిని కూడా కాంట్రాక్టుపై గ్లోబల్ సంస్థలు సొంతం చేసుకునే ప్రయత్నాలకు దిగుతున్నాయి. ఫలితంగా మొత్తం జలరాశిపై పెత్తనం ప్రఖ్యాతి గాంచిన గ్లోబల్ సంస్థల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం పొంచి వుంది. దీంతో నీరు కావాలంటే వారి దగ్గరి నుంచి కొనుక్కునే దుర్గతికి మానవ జీవితానికి దిగజారనుంది. ఇందుకోసం పైపులు ద్వారా నీటిని తరలించేందుకు భూమిని తవ్వడం, అడవుల్ని నాశనంచేసే ప్రక్రియలకు గ్లోబల్ సంస్థలు ప్రయత్నించకమానవు. అదే పరిస్థితిలో పర్యావరణ సమస్యతో పాటు జీవవైవిధ్యం కూడా దెబ్బతింటునదనేది తిరుగులేని వాస్తవం.

విశ్వవ్యాప్తంగా వ్యవసాయ ఆహార ఉత్పత్తులను పెంచేందుకు 2015 నాటికి 17 శాతం నీటి వినియోగం పెరిగింది. అదే ఏడాది నాటికి మానవుల నీటి వినియోగం 40 శాతం పెరిగింది. 21 శతాబ్దంలో సహజ వనరుల లభ్యతలో నీరు ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. పరిశ్రుభమైన నీటిని పొందే హక్కు ప్రపంచ ప్రజలందరికీ ఉందని ఎప్పుడో ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. గత 30 ఏళ్లుగా శుద్ధమైన తాగునీరు లభ్యత క్షీణిస్తోంది. శుద్ధిచేసిన జలాల్ని దేశాలకు సరఫరా చేసేందుకు, భూమిపై లభించే నీటిని ప్రైవేట్ పరం చేసేందుకు ప్రపంచ బ్యాంక్ ఆర్థికసాయాన్ని అందిస్తోంది. తమ లాభాల కోసం పేదల దాహాన్ని కూడా డబ్బుచేసుకునే ప్రయత్నాలకు కార్పొరేట్ సంస్థలు దిగుతున్నాయి. ఇదే పరిస్థితులు కొనసాగితే భూమి మీద పూర్తి అజమాయిషీ సంపాదించడమే బడా పారిశ్రామిక సంస్థల యత్నం. తత్ఫలితంగా నీరు, గాలి, భూమి కలుషిత మవుతాయి. కలుషత నీటికి ప్రతిగంటకు 240 మంది పిల్లలు మృత్యువాత పడుతున్నారు. పారిశుధ్య లోపం వల్ల ఏడాదికి ఐదేళ్లలోపు గల 1.5 మిలియన్ పిల్లలు కలరా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక జ్వరాల బారిన పడి చనిపోతున్నారు. పరిశుభ్రమైన నీరు లభించక పోవడం వల్ల రెండు నుంచి మూడు మిలియన్ల మంది మరణిస్తున్నారు. భూగర్భ జలాలను హరించేందుకు ప్రపంచ కోటేశ్వరులు, కార్పొరేట్ దిగ్గజాలు గోల్డ్‌మాన్ సాక్స్, జేపీ మోర్గాన్ చేజ్, సిటీ గ్రూప్, యుబీఎస్, డ్యూయిస్ బ్యాంక్, మాక్వారీ బ్యాంక్, హెచ్ఎస్‌బీసీ బ్యాంక్ తదితర కార్పొరేట్ సంస్థలు పోటీపడి భూగర్భజలాలను కొనుగోలు చేస్తున్నాయి. ఫలితంగా పేదలకు నీరు లభ్యంకావడం గగనకుసుమం అవుతుంది. ప్రతి చుక్క నీటిని కార్పొరేట్ దిగ్గజాలు నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయకతప్పని పరిస్థితి ఏర్పడుతోంది. బలివియాలోని బెచ్‌టెల్ నీటి ప్రైవేటీకరణలో ప్రఖ్యాతిగాంచిన పెద్ద సంస్థ. తాము నిర్ణయించిన ధరకే నీటిని కొనుగోలుచేయాలని ఆ సంస్థ యత్నాలకు బొలివియాలో గండిపడింది. బెచ్‌టెల్ సంస్థకు వ్యతిరేకంగా బొలివియాలో ప్రజాఉద్యమం తలెత్తింది. తమ మునిసిపాలిటీలో బెచ్‌టెల్ సరఫరా చేస్తున్న నీటి పంపిణీ నిలిపివేయాలని బొలివియాలోని మూడో అతిపెద్ద నగరంలో ఉద్యమం చెలరేగడంతో చివరకు అంతపెద్ద కంపెనీకూడా బొలివియా నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. అదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా అనేక ప్రైవేట్ సంస్థలు నీటి ప్రైవేటైజేషన్ పట్ల ఎంతో ఆసక్తి కనబరుస్తూ ముందుకొచ్చాయి. చిలీలో నీటి సర్వీసులు మాత్రమే ప్రైవేటై జేషన్ అయ్యాయి. రేట్లలోను, నాణ్యత సర్వీసులు అందించడంలోనూ ప్రతి ప్రైవేట్ కంపెనీ విఫలం కావడంతో అన్ని చోట్లా ప్రజల నుంచి వ్యతిరేకతలు వ్యక్తమయ్యాయి. ప్రతి చోటా ఇదే ఫలితం ఎదురుకావడంతో ప్రైవేట్ కంపెనీలకు సలహాదారునిగా ఉన్న కార్పొరేట్ అకౌంటబులిటీ ఇంటర్నేషనల్ రంగంలోకి దిగింది. ప్రభుత్వాలను, ప్రజలను నీటి ప్రైవేటీకరణకు అనుకూలంగా చైతన్యం తీసుకొచ్చే చర్యలు చేపట్టింది. భూ గర్భంలోని నీటి వినియోగం, గుర్తించేందుకు గ్రేటర్ నోయిడా కార్పొరేషన్ ఒక ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించింది.

పాకిస్థాన్‌లోని లాహోర్ దనవంతులపై నెజిల్ కార్పొరేషన్ దృష్టిపెట్టి ప్రచారం మొదలుపెట్టింది. నెజిల్ కార్పొరేషన్ ఉత్పత్తి అయిన 'ప్యూర్ లైఫ్' వాటర్ బాటల్ లాహోర్ ధనవంతులకు స్టేటస్ సింబల్‌గా తయారైంది. ఈ బాటిల్‌లో నింపేనీటిని స్థానిక భూగర్భ జలాలనే నెజిల్ ఉపయోగించింది. దీంతో ఆ ప్రాంతంలోని పేదలకు స్వచ్ఛమైన నీరు బదులు కలుషిత నీటిని వాడుకోవాల్సి వచ్చింది. ఈవిధంగా తమ ప్రాంతంలోని నీటిపై పేదలు తమ హక్కును కోల్పోయారు. ఇదే పరిస్థితి నైజీరియాలో కూడా తలెత్తింది. ఒక బాటిల్ నీటి ఖరీదు నైజీరియాలోని పేదల రోజువారీ సంపాదన కంటే ఎక్కువ పలికింది. భూగోళంవ్యాప్తంగా నీటిని సేకరించడంలో నెజిల్ కంపెనీ అనుసరించిన అనైతిక, చట్టవ్యతిరేక విధానాలపై కార్పొరేట్ వాచ్ నివేదిక విడుదలచేసింది. ప్రజారోగ్య ఆరోగ్యాన్ని దిగజార్చేలా సహజసిద్ధమైన పర్యావరణాన్ని నాశనం చేస్తూ పెద్దయెత్తున లాభాలను ఆర్జించడాన్ని ఆ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది.

-శీలోజు యాదగిరి



కాటేస్తున్న ధూళి కాలుష్యం




వాయుకాలుష్యం వల్ల భారత్‌లో ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్న అంశంలో సహజంగా అందరి చూపు ఢిల్లీ వంటి నగరాలపై పడుతుంది. అయితే, కొత్తగా ఆవిష్కృతమైన అధ్యయనాలు మరో కొత్తకోణాన్ని చూపుతున్నాయి. అయితే పీఎం (పార్టిక్యులేట్ మ్యాటర్) 2.5కు చేరుకుంటే భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో కూడా వాయుకాలుష్య పరిస్థితులు ప్రజ్వరిల్లి ఆనారోగ్య కారకాలుగా మారతాయని ఈ సర్వే చెబుతోంది. వాయువులో ఘన, ద్రవరూపంలో మిళితమై వాతావరణ కాలుష్యానికి, ఆరోగ్య సమస్యలకు కారణమయ్యే చిన్న చిన్న కణాలను పర్టిక్యులర్ మ్యాటర్ అంటారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న జనాభా లెక్కలు, ఎన్ఎస్ఎస్ఓ, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి సర్వేల ప్రకారం, గ్రామీణ ప్రాంతాల్లో సంభవిస్తున్న 75 శాతం మరణాలకు పీఎం 2.5కు చేరుకోవడమే కారణమని వెల్లడైంది. 'భారత్‌లో వాయుకాలుష్యం వల్ల వ్యాధుల భారం' అనే శీర్షికతో వెలువడిన నివేదికను జనవరి 11 హెల్త్ ఎఫెక్ట్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రచురించింది. 2015 లో 1.1 మిలియన్ మరణాలకు పీఎం 2.5 కారణమైందని ఈ నివేదిక వెల్లడించింది. ఇది దేశంలోని మొత్తం మరణాల్లో 10.6 శాతానికి సమానం. ఇక్కడ ఆసక్తి కలిగించే అంశమేమిటంటే, పీఎం 2.5 ప్రభావం అటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమానంగానే ఉందని నివేదిక పేర్కొన్నది. పర్యావరణానికి సంబంధించి ఆరోగ్యంపై చూపేప్రభావంపై నివేదిక వెలువడడం ఇదే ప్రథమం. కాలుష్యం పరిధి, మానవ ఆరోగ్యంపై అది చూపే పరిస్థితులపై విధాన నిర్ణేతలకు ఈ సర్వే ఎంతో ప్రయెజనకారి కాగలదు. 267,700 మరణాలకు జీవ సంబంధమైన దహనాలు కారణమని తేలింది. అంటే 2015లో పీఎం 2.5 వల్ల 25 శాతం మరణాలు సంభవించాయని అధ్యయనం పేర్కొన్నది. దీని తరువాత రెండోస్థానాన్ని బొగ్గు దహన ప్రభావం ఆక్రమిస్తోంది. పారిశ్రామిక, థర్మల్ ప్లాంట్ల ప్రభావాన్ని పక్కనపెడితే బొగ్గు దహన ప్రభావం వల్ల 169,300 మరణాలు సంభవించాయి. వ్యవసాయ వ్యర్థాలు బహిరంగంగా దహనం చేయడం వల్ల 66,200 మరణాలు చోటుచేసుకున్నాయి.

కాగా, రవాణా 23,100 మరణాలకు కారణంగా నిలుస్తోంది. అంటే పీఎం 2.5 వల్ల మరణాలకు ఒక్క రవాణారంగమే కారణమనుకోవడం పొరపాటు. అయితే, ఇక్కడ పరిశీలించవలసిన విషయమేమిటంటే ఈ అధ్యయనం కోసం వినియోగించిన భౌగోళిక పటం చాలా పెద్దది కావడం వల్ల రవాణా రంగాన్ని వివిధ గ్రామీణ ప్రాంతాలను ఆకర్షించడంలో విఫల మైంది. ఈ ఇబ్బందిని అధ్యయనంలో అంగీకరించారు. భవిష్యత్తు అంచనాలను కూడా ఈ సర్వే చూపించింది. 2015 పరిస్థితులను గమనించి భవిష్యత్తులో ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టకపోతే 40 శాతానికి పీఎం 2.5 పెరిగిపోయి మరణాల సంఖ్య మూడురెట్లు పెరిగే అవకాశమున్నదని సర్వే హెచ్చరించింది. అంటే 2015లో 1.1 మిలియన్ మరణాలు సంభవిస్తే సరైన చర్యలు చేపట్టకపోతే ఈ మరణాలు 3.6 మిలియన్లకు చేరుకుంటాయన్నమాట. అదే గనుక ప్రభుత్వం తగిన చర్యలు చేపడితే 2050 నాటికి ఈ మరణాలను పూర్తిగా అదుపులోకి తేవచ్చు. -(మహి డెస్క్)

2015లో పీఎం 2.5 వల్ల మరణాలు

కారణం	మరణాల సంఖ్య
జీవసంబంధిత వ్యర్థాల దహనం	267,700
బొగ్గు దహనం	169,300
వ్యవసాయ వ్యర్థాల దహనం	66,200
రవాణా వెదజల్లే కాలుష్యం వల్ల	23,100

ఎండలు ఇక మండే కాలం!



ఉద్గారాలను రెండు డిగ్రీల సెంటీగ్రేడ్‌కు తగ్గించి భూతాపాన్ని అదుపుచేయకపోతే 2070 నాటికి వేసవి కా లం ఎనిమిది నెలల పాటు కొనసాగుతుందని తాజా సర్వేలు చెబుతున్నాయి. ఇప్పటికే వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు తీవ్ర అలసటకు గురవుతున్న విషయం విదితమే! ప్రపంచంలోనే అత్యంత సున్నిత ప్రాంతంగా గుర్తింపు పొందిన గంగామైదాన ప్రాంతం తేమ ప్రాంతమైనప్పటికీ ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రత 31 డిగ్రీల సెంటీగ్రేడ్ చేరుకుంది. 1970 వచ్చేసరికి ఈ ఉష్ణోగ్రత 100 రెట్ల డిగ్రీల నుంచి 250 రెట్లకు పెరిగే ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. 18 వాతావరణ నమూనాలు, రెండు ఉద్గారాల పరిస్థితులు, ఐదు జనాభా పెరుగుదలను పరిశీలించిన కొలంబియా యూనివర్శిటీ డాక్టరేట్ విద్యార్థి ఈథన్ కోఫెల్ (27) చేసిన అధ్యయనం విపత్కర పరిస్థితుల్ని వివరించాడు. అతనితో నిర్వహించిన ఇంటర్వ్యూ వివరాలు...

ప్ర : తేమతో కూడిన వాతావరణం ఉష్ణోగ్రతల పెరుగుదలలో సామ్రాజ్యవాద శక్తుల ప్రభావం మానవజీవితంపై ఉంటుందా?

జ: వెలువడే ఉద్గారాలపై అంత తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రత పెరుగుతుందా లేదా అనేది తేలుతుంది. అదే గనుక జరిగితే భారత్, మధ్య ప్రాచ్యం, అమెజాన్, తూర్పు చైనాలో భాగాలపై ఎక్కువ ప్రభావం పడుతుంది.

ప్ర: ప్రజల జీవనవిధానంపై ఈ ప్రభావం ఎలా ఉంటుంది?

జ: బయట తిరగేవారికి ఎక్కువగా శ్వాసకోస సమస్యలు, దక్షిణ అమెరికాలో ఇప్పటికే ఏర్పడిన కొన్ని కొత్తకొత్త రోగాలకు ఈ అధిక ఉష్ణోగ్రతలు కారణమవుతాయి. సమాజానికి ఈ వేడి ప్రభావం తీవ్ర భయానక పరిస్థితుల్ని కల్పిస్తుంది.

ప్ర: ఉష్ణోగ్రత మరింత ఉధృతమైతే, పరిస్థితి ఏమిటి? ఏడాదికి 50 నుంచి 125 రెట్లకు ఉష్ణోగ్రత పెరిగితే ఎలా?

జ: ఉష్ణోగ్రత పెరిగితే దాని ప్రభావం అటు శాస్త్రపరంగా, ఇటు సామాజికపరంగా తీవ్రంగా ఉంటుంది. ఈ పరిస్థిలేర్పడితే అటు భౌతికశాస్త్రం, ఇటు వాతావరణ శాస్త్రం రెండూ సమ్మిళతమై కొత్త సబ్జెక్టుగా వాతావరణ శాస్త్రంగా రూపొందవచ్చు.

ప్ర: తేమ వాతావరణం ఉష్ణోగ్రత, తేమ మీద ఆధారపడుతుంది. వాతావరణ మార్పు ఈ రెండూ పెరగడానికి కారణమవుతుందా?

జ: 2070 నాటికి క్లిష్టమైన ఉష్ణోగ్రతలు 10 నుంచి 15 శాతం పెరుగుతుందని భావిస్తున్నాం. ప్రపంచంలోని నాలుగు ప్రాంతాలైన చైనా, పశ్చిమ ఆఫ్రికా, భారత్, అమెరికా తూర్పు ప్రాంతాల్లో ఈ ఉష్ణోగ్రతల ప్రభావం ఉంటుం దని భావిస్తున్నాం. ఈ ఉష్ణోగ్రతలు భారత్‌లో 1 డిగ్రీ సెంటీగ్రేడ్ నుంచి 2 డిగ్రీల సెంటీ గ్రేడ్ పెరిగే అవకాశాలుండగా 3 డిగ్రీల నుంచి 4 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు అమెరికా తూర్పు ప్రాంతం, చైనా, పశ్చిమ ఆఫ్రికాల్లో పెరిగే అవకాశాలున్నాయి.



ప్ర: ఉష్ణోగ్రతలు ఏ మేరకు పెరుగుతాయనే అంశంపై అధ్యయనానికి ఇంకా చాలా సమయం ఉంది కదా! 2010లో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పెరుగుతాయని చెప్పారు. మానవ జీవనానికి ఇదే అత్యధిక ఉష్ణోగ్రత. ఉద్గారాలను తగ్గిస్తే ఉష్ణోగ్రతల పెరుగుదలను అరికట్టవచ్చునని, 21వ శతాబ్దంలో కొన్ని అంశాల్లో తగు చర్యలు చేపట్టకపోతే దక్షిణ ఆసియాలో 35 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయని చెబుతున్న విషయంలో మీ అధ్యయనం మాటేమిటి?

జ: 35 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు ఉష్ణోగ్రతలు పెరుగుతాయనే అంశంపై మాదే మొట్టమొదటి అధ్యయనం. వచ్చే రోజుల్లో 750 మిలియన్లమందిపై దీని ప్రభావం పడుతుందని మా అధ్యయనంలో తేలింది.

-(మహి డెస్క్)

'మేత'తో వాత!



ప్రజారోగ్యంపై దృష్టిపెట్టని ప్రఖ్యాత విదేశీ కంపెనీల వలలో అమాయకులు సులభంగా చిక్కుకుని తీవ్రంగా నష్టపోతున్నారు. మనుషులతో పాటు జంతువుల దాణాను కూడా కైంకర్యం చేసే సమర్థత ఉన్న రాజకీయ నేతలు అచేతనంతో చూస్తుం డిపోతున్నాయి. పాలకుల అసమర్థ నిర్ణయాలు ఎంత తీవ్రనష్టానికి, మనుషుల మనుగడనే ప్రశ్నిస్తున్న నేపథ్యంలో బడా కంపెనీల ప్రయోజనాల కోసం మౌనం పాటిస్తున్నాయి. అధిక ప్రయోజనాలు చేకూరుతుందంటూ పెద్దయెత్తున ప్రచారాలతో పశువుల దాణాలో యాంటీబయోటిక్స్‌ను బడా కంపెనీలు గుప్పిస్తున్నాయి. భవిష్యత్తు ప్రమాదాలను గ్రహించకుండా అమాయకంగా రైతులు వాటి ఉచ్చులో బిగుసుకుపోతున్నారు. పశువుల దాణాలో యాంటీబయాటిక్స్ వాడకం ఎక్కువైంది. ప్రస్తుతం నెలకొన్ని వాతావరణ కాలుష్య పరిస్థితుల్లో వ్యాధి నిరోధకశక్తిని పెంచేందుకు యాంటీబయాటిక్స్ వాడకం తప్పడం లేదని చెబుతున్నారు. 2030 నాటికి జంతు దాణాలో యాంటీబయాటిక్స్ వాడకం 82 శాతానికి చేరుకుంటుందని 'సైన్స్' జర్నల్ నిర్వహించిన సర్వేలో తేలింది. లాభాపేక్షలేని 'సెంటర్ ఫర్ డిసీజ్ డైనమిక్స్, ఎకనమిక్స్ అండ్ పాలిసీ' (సీడీడీఈపీ) అనే సంస్థ సర్వే నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా 130,000 టన్నుల యాంటీబయాటిక్స్ వాడుతుండగా, ఇది 2030 నాటికి 82 శాతానికి చేరుకోగలదని సర్వే అంచనావేసింది. చైనా, అమెరికా, బ్రెజిల్, భారత్, స్పెయిన్ వరుసగా యాంటీబయాటిక్స్ వాడకంలో ముందున్నాయి. అసలు పశువుల దాణాలో యాంటీబయోటిక్స్‌ను కలపడాన్ని నిషేధించాలని సీడీడీఈపీ సంస్థ డిమాండ్ చేసింది. ఈ సర్వేకు 38 దేశాలకు చెందిన ప్రభుత్వాల లెక్కల ప్రకారం సేకరించిన జంతుసంబంధమైన యాంటిమైక్రోబియల్స్‌ను ఆధారం చేసుకుని ఈ పరిశోధనను నిర్వహించినట్లు సర్వేలో తెలిపారు.

-(మహి డెస్క్)

మహి పేజీకి వ్యాసాలు పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో పంపవలసిందిగా సూచన.
e-mail: manammahimahi@gmail.com



మెట్రోకు నిధుల వేట

(మొదటి పేజీ తరువాయి)

సలహాదారు జి.వివేక్ కూడా ఉన్నారు. వీళ్లంతా విదేశాలలోని పలు ఆర్థిక సంస్థలు, ఇంజనీరింగ్ దిగ్గజాలతో చర్చించి.. విమానాశ్రయం వరకు మెట్రో రైలును తీసుకెళ్లడానికి మార్గాలు అన్వేషిస్తున్నారు. ఏదైనా పెద్ద విదేశీ బ్యాంకు ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చాలన్నది కేటీఆర్ ఉద్దేశంలా కనిపిస్తోంది. అలాగే దీనికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించేందుకు ఒక అంతర్జాతీయ ఏజెన్సీని నియమించాలని భావిస్తున్నారు. మెట్రోరైలు రెండోదశ నిర్మాణ పనులు చేపట్టడానికి ఎల్అండ్‌టీ సంస్థ సుముఖంగా లేదు. దాంతో వేరే డెవలపర్లను చూసి వాళ్లతో ప్రాజెక్టు ముందుకు నడిపించాలని అనుకుంటున్నారు. ఇందుకోసం స్వదేశీ, విదేశీ ఫండింగ్ ఏజెన్సీల వైపు చూస్తున్నారు. విమానాశ్రయానికి మెట్రోరైలు కనెక్టివిటీ కావాలంటే ఎల్బీనగర్ వైపు నుంచి చాంద్రాయణగుట్ట మీదుగా కాకుండా.. రాయదుర్గం నుంచి అయితే మేలని భావిస్తున్నారు. ఆ మార్గంలో అయితే భూసేకరణ సులభం అవుతుందన్నది సర్కారు ఆలోచనగా కనిపిస్తోంది. హైటెక్ సిటీ నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో లింకు వస్తే అది లాభదాయకంగా ఉంటుందని కూడా భావిస్తున్నారు. దీని గురించిన ఫీజిబులిటీ పరిశీలన వివరాలను కూడా హెచ్ఎంఆర్ఎల్ పూర్తిచేసింది. అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థ కూడా మెట్రోరైలు కనెక్టివిటీకీ పచ్చజెండా చూపడంతో ఇక ఆ మార్గంలో విస్తరణకు ప్రయత్నాలు మొదలయ్యాయి. దాంతోపాటు.. నాగోల్ నుంచి ఎల్బీనగర్, ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, అలాగే అటు ఈసీఐఎల్ మార్గం.. ఇలా నగరంలో అన్నివైపులకూ శివార్లకు కూడా మెట్రో సేవలు అందించాలన్నది సర్కారు వ్యూహంగా కనిపిస్తోంది.

సీఈసీగా ఓపీ రావత్

(మొదటి పేజీ తరువాయి)

అరోరాతో పాటు ఆయన మరో కమిషనర్‌గా ఉంటారు.

ఎవరీ రావత్

మధ్యప్రదేశ్ క్యాడర్‌కు చెందిన 1977 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఓం ప్రకాష్ రావత్ (64) పలు రాష్ట్రాలతో పాటు కేంద్రంలో కూడా వివిధ హోదాలలో పనిచేశారు. భారీ పరిశ్రమల శాఖ కార్యదర్శిగా పనిచేసి.. ఇటీవలే పదవీ విరమణ చేశారు. 1993లో రక్షణశాఖలో డైరెక్టర్‌గా విధులు నిర్వహించిన ఆయన... ఆ తర్వాతి సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి ఎన్నికలకు పరిశీలకుడిగా దక్షిణాఫ్రికాకు వెళ్లారు. 2010లో ఉత్తమ సేవలకుగాను ప్రధానమంత్రి నుంచి అవార్డు అందుకున్నారు.

ఈ వేసవికి ప్రత్యేక రైళ్లు

రద్దీని తట్టుకునేందుకు 148 ప్రత్యేక సర్వీసులు

విజయవాడ, జనవరి 21 (మనం ప్రతినిధి): వేసవి సెలవుల్లో ప్రయాణాలకు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా దక్షిణ మధ్య రైల్వే 148 ప్రత్యేక రైళ్లను నడపబోతోంది. సికింద్రాబాద్-రక్సాల్, కాచిగూడ-టాటానగర్, హైదరాబాద్-జైపూర్‌ల మధ్య ప్రత్యేక రైళ్లను వేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్ కుమార్ తెలిపారు. వేసవిలో సికింద్రాబాద్ నుంచి రైలు నం. 07091 ప్రత్యేక సర్వీసు ప్రతి మంగళవారం రాత్రి 9.40 గంటలకు బయలుదేరి గురువారం సాయంత్రం 6.15కు రక్సాల్ చేరుతుంది. అలాగే ఈ రైలు (07092) రక్సాల్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12.45కు బయలుదేరి ఆదివారం ఉదయం 6.55కు సికింద్రాబాద్ చేరుతుంది. కాగా, కాచిగూడ నుంచి టాటానగర్‌కు 46 ప్రత్యేక సర్వీసులను రైల్వే నడపనుంది. ఈ రైలు కాచిగూడలో ప్రతి సోమవారం (ట్రైన్ నం. 07438) మధ్యాహ్నం 1 గంటకు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 7.45కు టాటానగర్‌కు చేరుతుంది. అలాగే తిరుగుప్రయాణంలో ఈ రైలు (07439) టాటానగర్‌లో ప్రతి మంగళవారం రాత్రి 10.50కు బయలుదేరి మరుసటి ఉదయం 5 గంటలకు కాచిగూడ చేరుతుంది. ఇక హైదరాబాద్ నుంచి జైపూర్‌కు 36 ప్రత్యేక రైళ్లను కేటాయించారు. ఈ రైలు హైదరాబాద్‌లో ప్రతి శుక్రవారం (ట్రైన్ నెం. 02731) సాయంత్రం 4.25కు బయలుదేరి, ఆదివారం ఉదయం 6.25కు జైపూర్‌కు చేరుతుంది.



తిరుగుప్రయాణంలో ఈ రైలు (02732) జైపూర్‌లో ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2.35కు బయలుదేరి మంగళవారం మధ్యాహ్నం 2 గుటలకు హైదరాబాద్ చేరుతుంది. అలాగే సికింద్రాబాద్ నుంచి బరౌని మధ్య 44 ప్రత్యేక సర్వీసులు నడపనుంది. ఈ రైలు సికింద్రాబాద్‌లో ప్రతి ఆదివారం (07009) రాత్రి 10 గంటలకు బయలుదేరి, మంగళవారం ఉదయం 11.40కి బరౌని చేరుతుంది. అలాగే తిరుగుప్రయాణంలో ఈ రైలు (070010) బరౌనిలో బుధవారం ఉదయం 7.10కు బయలు దేరి గురువారం రాత్రి 10.40కి సికింద్రాబాద్ చేరుతుంది.

‘పంచాయతీ’ షురూ!

(మొదటి పేజీ తరువాయి)

పండుగతో పల్లెల్లో ఎన్నికల సందడి ప్రారంభమైంది. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల అజెండాను ముందుకు తీసుకురావటంతో అన్ని పార్టీల నేతలంతా పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనుండటంతో పంచాయతీ ఎన్నికలు రిఫరెండంగా ఉంటాయని అన్ని పార్టీల్లో భావన నెలకొంది. దీంతో పంచాయతీ ఎన్నికలను అధికార పార్టీతో ప్రతిపక్ష పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశాలున్నాయి.



ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగేనా..?

వచ్చే నెలలోనే పంచాయతీల ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఇంకా కొత్త పంచాయతీల ఏర్పాటు ఒక కొలిక్కి రాలేదు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల ఖరారు కాలేదు. ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టుగా సీఎం కేసీఆర్ కలెక్టర్ల సదస్సులో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా 12వేల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగాలి. ఇంత తక్కువ సమయంలో ఎన్నికలు నిర్వహించటం అంటే కత్తి మీద సాములాంటిదేనని అధికారులు పేర్కొంటున్నారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నుంచి ప్రక్రియ ముగిసేవరకు తప్పనిసరిగా 45 రోజుల వ్యవధి ఉండాలి. ఈ ప్రకారం చూస్తే ఇప్పటికిప్పుడే నోటిఫికేషన్ జారీ చేస్తేనే ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అధికారులే పేర్కొంటున్నారు. ఓటర్ల సవరణ జాబితా ఇప్పటి వరకు ప్రకటించకపోవడంపై ఇప్పటికే ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసింది. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ఈ ఏడాది జూలై 31, ఆగస్టు 1వతేదీ వరకు పంచాయతీ పాలకవర్గాల గడువుంది. ఆ తర్వాత కూడా మూడు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించడానికి అవకాశం ఉంటుంది. ఒకవేళ ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహి ంచినా, గెలిచిన వారు పాత పాలకవర్గాల గడువు ముగిసేవరకు కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేసే అవకాశాలు లేవు. ఈ క్రమంలో మరో మూడు నెలల తర్వాతే ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

గ్రామాల విలీనంపై కసరత్తు..

నూతన పంచాయతీల ఏర్పాటుకు సంబంధించి గతేడాది కొన్ని మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. పంచాయతీల నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామాలను, 500 జనాభా ఉన్న తండాలు, గూడేలను పంచాయతీలుగా గుర్తించాలని సూచించింది. శాసనసభ్యుల ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త పంచాయతీల ఏర్పాటు వివరాలను అందజేయాలని ప్రభుత్వం కోరింది. అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంచాయతీల ఏర్పాటుపై ప్రతిపాదనలు పంపారు. కొద్ది రోజుల తర్వాత ఈ అంశం మూలన పడింది. తాజాగా పంచాయతీ ఎన్నికలపై కొత్త మార్గదర్శకాలతో ప్రతిపాదనలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఇదిలా ఉండగా ఆయా జిల్లాల పరిధిలోని నగర, మునిసిపాలిటీలు కార్పొరేషన్ల పరిధిలోని పల్లెల్లో మరో రకమైన రాజకీయ వాతావరణం నెలకొంది. 15 వేలు ఓటర్లు పైబడిన పంచాయతీలను నగర పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని నవంబర్లో నిర్ణయించిన దాఖలాలున్నాయి. వీటికి ఐదు కిలోమీటర్ల దూరంలోని పంచాయతీలను వీటిలో వీలినం చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తుంది. పంచాయతీలకు పాలకవర్గాలు ఉన్నప్పుడు పట్టణ పాలక సంస్థల్లో విలీనానికి మోకాలొడ్డుతున్నాయనే భావన ప్రభుత్వంలో ఉంది. పాలకవర్గాలు విలీనానికి వ్యతిరేకంగా తీర్మానాలు చేయడం, న్యాయస్థానాలను ఆశ్రయిస్తుండటంతో పాలకవర్గాలను రద్దు చేసిన తర్వాతే విలీనం చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే పల్లెలను పట్టణ పాలక సంస్థల్లో విలీనం చేసేందుకు ఉన్న అడ్డంకులను తొలగించేలా పురపాలక చట్టానికి సవరణలు తెచ్చే ప్రక్రియ సాగుతోంది.

ఎన్నికలు.. ఏ పద్ధతిలో!

పంచాయతీ ఎన్నికలు ప్రత్యక్షమా, పరోక్షమా అనే విషయమై ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదు. పరోక్ష ఎన్నికలకే ప్రభుత్వం మొగ్గు చూపుతుందనే భావన వ్యక్తమవుతోంది. కాగా పరోక్ష విధానంపై ఇప్పటికే కాంగ్రెస్, టీడీపీ, బీజేపీతో పాటు బీసీ సంక్షేమ సంఘం నేతలు ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యక్షం, పరోక్షంపై ఏడ చూసిన పల్లెల్లో చర్చ సాగుతోంది. పరోక్ష ఎన్నికలు డబ్బున్న వారికే ఉపయోగపడతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, జెడ్పీ చైర్మన్, ఎంపీపీలను పరోక్ష పద్ధతిలోనే ఎన్నుకుంటుండగా సర్పంచి విషయంలో మాత్రం ప్రత్యక్షం ఎందుకంటూ పాలకులు పేర్కొంటుండటం విశేషం. రాజకీయ లబ్ధి కోసమే టీఆర్ఎస్ ప్రభుత్వం పరోక్ష విధానానికి శ్రీకారం చుడుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తుండగా, ఎన్నికల్లో గెలిచిన ప్రతి వార్డు సభ్యునికి గౌరవం కల్పించేందుకే పరోక్ష విధానమంటూ అధికార పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

సూత్రధారుల మాటేంటి?

(మొదటి పేజీ తరువాయి)

ఎంపికయ్యారు. అందులోనూ ఒక్క ఉమ్మడి నల్లగొండ జిల్లానుంచే 54 మంది కొలువు పొందడం, వీరిలో దాదాపు 15 మంది ఒకే మండలం వారు కావడాన్ని బట్టి ఈ బాగోతం ఏ స్థాయిలో సాగిందీ ఊహించుకోవచ్చు. ఈ వ్యవహారం 2010లో బయటపడగా అభ్యర్థులు, దళారులు, సూత్రధారిగా భావించే అధికారిసహా 14 మందిపై కేసు నమోదైంది. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు నిమిత్తం నాటి ప్రభుత్వం సీఐడీకి కేసును అప్పగించింది. దీంతో రంగంలో దిగిన అధికారులు ఎంపికైన అభ్యర్థులలో కొందర్ని శిక్షణకు వెళ్లడానికి ముందే అరెస్ట్ చేశారు. బాగోతంలో భాగస్వాములందరి కూపీలాగే సమయానికే ఉద్యోగాల్లో చేరిపోయిన మరికొందర్ని ఆ తర్వాత అరెస్ట్ చేశారు. అయితే, సదరు కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించినట్లు ఆరోపణలున్న నాటి అధికార పార్టీ నేత తన రాజకీయ పలుకుబడితో విచారణకు బ్రేక్ వేయించారని సమాచారం. సదరు నేతతోపాటు ఆయనకు సన్నిహితుడైన, ప్రస్తుతం జైళ్లశాఖలో పనిచేస్తున్న ఉన్నతాధికారి గ్యాంగ్‌స్టర్ నయీంతో అంటకాగిన నేపథ్యంలోనే ఈ ‘పైలటింగ్’ వ్యవహారం అప్పట్లో మరుగునపడిందని సమాచారం. మరోవైపు ఇదే బాగోతంలో మరో 18 మంది ఎస్ఐలుగానూ ఎంపికయ్యారని సమాచారం. వీరిపైనా అంతర్గతంగా ఫిర్యాదులు రావడంతో వారి గుట్టు బయటపెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు తెలిసింది.

ఎస్ఐ చొరవతో బాగోతం బట్టబయలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తిప్పర్తి స్టేషన్ ఎస్ఐ కె.ధనుంజయ చొరవతో ఈ బాగోతం 2010లో బట్టబయలైంది. ఆ మండల వాస్తవ్యుడైన ఓ అభ్యర్థి రిక్రూట్‌మెంట్ టెస్టు ఉన్న రోజు స్థానికంగా నిర్వహించిన కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొన్నాడు. వారి జట్టు విజేతగా నిలవడంతో ఎస్ఐ ధనుంజయ చేతులమీదుగా బహుమతి కూడా అందుకున్నాడు. తర్వాత కొద్ది రోజులకు తనకు కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చిందంటూ అతడు స్టేషన్‌కు వచ్చి ఎస్ఐకి స్వీటు ఇచ్చాడు. అతణ్ని గుర్తుపట్టిన ఎస్ఐకి పోలీసు నియామక పరీక్షనాడు అతడు కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొన్న సంగతి గుర్తుకొచ్చింది. అతణ్ని గట్టిగా నిలదీయడంతో పైలటింగ్ గుట్టు రట్టయింది. అతడేకాకుండా మరికొంతమంది కూడా ఇలాగే ఉద్యోగానికి ఎంపికైనట్లు ప్రాథమిక విచారణలో తేలింది. దీంతో ఎంపికైనవారు, వారికి సహకరించిన మరికొందరుసహా 11 మందిపై అక్టోబరు 19న ఆయన కేసు నమోదు చేశారు. అలా తిప్పర్తి ఎస్ఐ తీగ లాగడంతో డొంకంతా కదిలి రాష్ట్రంలో 93 మంది ఇలా ఎంపికైనట్లు బయటపడింది. అయితే, ఈ వ్యవహారంలో పెద్ద చేపలను వదిలి చిన్న చేపలను బలిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాడు సీఐగా పనిచేస్తూ.. నేడు డివిజన్ స్థాయి అధికారిగా ఉన్న వ్యక్తిని ఈ మొత్తం వ్యవహారానికి బాధ్యుడిని చేసే తతంగం నడుస్తోందని తెలిసింది. అయితే, ఈ బాగోతంలో కీలక పాత్రధారి అయిన నేతకు అనుంగు అనుచరుడున్న మాట వినిపిస్తోంది. కాగా, ఈ నాయకుడి నియోజకవర్గంలోనే అధికార పార్టీకి చెందిన మరో నేతకు విభేదాల నేపథ్యంలో ఈ కేసు ఒక పావుగా మారినట్లు సమాచారం. ఇందులో నిజమెంత అన్నది అటుంచి ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎంత నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందన్న అంశంపైనే నల్లగొండ జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

డీజీపీ ఆదేశాలతో మళ్లీ కదలిక

ఈ నేపథ్యంలో పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించాలని డీజీపీ మహేందర్ రెడ్డి ఆదేశించడంగా ఇప్పుడీ కేసులో చలనం వచ్చింది. ఆ మేరకు సీఐడీ అధికారులు వారం వ్యవధిలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన 11 మంది కానిస్టేబుళ్లు, ముగ్గురు పాత్రధారులను అరెస్టు చేశారు. అయితే, ఈ వ్యవహారంలో సూత్రధారులను తప్పించే ప్రయత్నాలు సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాల్లో కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలున్న నాటి అధికార పార్టీ నేత ఇప్పుడు కూడా అధికార పార్టీలోనే ఉండటంతో కేసు పక్కదోవ పడుతున్నదని సమాచారం. ఇందులో భాగంగా సదరు నేతతోపాటు ప్రస్తుతం జైళ్లశాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న సూత్రధారిని తప్పించాలని ఒత్తిళ్లు వస్తున్నట్లు భోగట్టా.


రాజ్‌భవన్ వద్దు.. ప్రజాభవన్‌లోనే!

(మొదటి పేజీ తరువాయి)

చేయడానికి కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం మొత్తం 99 పథకాలు గుర్తిస్తే, అందులో 13 పథకాలను తెలంగాణలో అమలయ్యేలా చేసిందన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయం అని, 24 గంటల విద్యుత్ ఘనత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. తాగునీరు, సాగునీరుకు బీజేపీ ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యమిస్తోందన్నారు. బంగారు తెలంగాణ అంటే ప్రతి పొలానికి నీరు అందించాలి, ప్రతి చేతికి పని ఇవ్వాలన్నారు. గ్రామీణాభివృద్ధి, రోడ్లు, మహిళా శిశు సంక్షేమం, విద్య, వైద్యం, ఆరోగ్యానికి సంబంధించిన ఎన్నో పథకాలు అందుబాటులో ఉన్నాయని, కేంద్రం వాటికి నిధులు కేటాయించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్వోసీ ఇచ్చి ఆ నిధులను తెచ్చుకోవాలని సూచించారు. కొత్తగా పంచాయతీ రాజ్ చట్టం తీసుకొచ్చి, పరోక్ష ఎన్నికలు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ధనిక వర్గాలు లాభపడేందుకే ఇలా చేస్తున్నారని ఆయన విమర్శించారు. అఖిలపక్ష సమావేశం నిర్వహించి పంచాయతీరాజ్ చట్టం చేయాలని ఆయన తెలిపారు.

వేటు పడింది

(మొదటి పేజీ తరువాయి)



సానుకూలంగా స్పందించారు. వాళ్లందరినీ అనర్హులుగా ప్రకటించారు. దాంతో ఆ 20 స్థానాల్లో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్‌కు మార్గం సుగమమైంది. 20 మంది ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యేలు పార్లమెంటరీ కార్యదర్శులుగా లాభదాయకమైన పదవులలో 2015 మార్చి 13 నుంచి 2016 సెప్టెంబరు 8 వరకు ఉన్నందున వారిని అనర్హులుగా ప్రకటించాలంటూ గత శుక్రవారం ఎన్నికల కమిషన్ రాష్ట్రపతికి లేఖ రాసింది. దీనిపై ఆయన తాజాగా నిర్ణయం తీసుకున్నారు.

వేటు పడిన ఎమ్మెల్యేలు వీరే..

అల్కా లాంబా, ఆదర్శ్ శాస్త్రి, సంజీవ్ ఝా, రాజేష్ గుప్తా, కైలాష్ గెహ్లాట్, విజేంద్ర గార్గ్, ప్రవీణ్ కుమార్, శరద్‌కుమార్, మదన్‌లాల్ ఖుఫియా, శివచరణ్ గోయల్, సరితా సింగ్, నరేష్ యాదవ్, రాజేష్ రుషి, అనిల్ కుమార్, సోమ్ దత్, అవతార్ సింగ్, సుఖ్‌వీర్ సింగ్ దాలా, మనోజ్ కుమార్, నితిన్ త్యాగి.

సర్కారు క్షేమం

70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీలో ఆప్‌కు 66 మంది ఎమ్మెల్యేలున్నారు. దాంతో ఇపుడు 20 మంది మీద వేటు పడినా మరో 46 మంది ఉంటారు కాబట్టి ప్రభుత్వానికి వచ్చిన ఢోకా ఏమీ లేదు. అయినా.. ఇంత మంది మీద ఒకే సారి వేటు పడింది కాబట్టి నైతిక విలువలకు లోబడి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నాయి.

కోర్టుకెళ్తాం: ఆప్

ఈ విషయంలో తమ వాదన వినిపించడానికి ఎన్నికల కమిషన్ అసలు అవకాశం ఇవ్వలేదు కాబట్టి.. తాము దీనిపై కోర్టుకు వెళ్తామని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోదియా అన్నారు. 20 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే విషయంలో నియమ నిబంధనలను పాటించలేదని, అలాగే రాష్ట్రపతిని కూడా పార్టీ అభిప్రాయం వినాల్సిందిగా కోరలేదని ఆయన మండిపడ్డారు. అలాగే.. ఆప్ ప్రధాన అధికార ప్రతినిధి సౌరభ్ భరద్వాజ్ కూడా దీనిపై విమర్శలు గుప్పించారు. ఇదంతా తమ పార్టీపై జరిగిన రాజకీయ కుట్ర అని.. దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో విఫలమైన బీజేపీ ప్రభుత్వం దాని నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి తన ఏజెంట్లతో ఇలా కుట్ర పన్నిందని ఆయన మండిపడ్డారు.



జగన్ @ 900

- పాదయాత్రలో మరో మైలురాయి
- చిత్తూరు జిల్లాలో ప్రజా సంకల్పయాత్ర
- కడప, కర్నూలు, అనంతపురంలో పూర్తి



శ్రీకాళహస్తి, జనవరి 21: వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర మరో మైలురాయి చేరుకుంది. 900 కిలో మీటర్లు పాదయాత్ర పూర్తి చేశారు. యాత్రలో భాగంగా 67వ రోజు ఆదివారం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని చెర్లోపల్లి వద్ద ఈ మైలురాయి దాటారు. ఈ సందర్భంగా చెర్లోపల్లి గ్రామంలో జగన్ మొక్క నాటారు. కడప జిల్లా ఇడుపులపాయలో పాదయాత్ర ప్రారంభించిన జగన్.. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో యాత్ర పూర్తి చేశారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో యాత్ర కొనసాగిస్తున్నారు. దారి పొడవును ప్రజల సమస్యలు తెలుసుకుంటూ, వారికి భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్నారు. యాత్రలో ప్రతి వంద కిలో మీటర్ల మైలురాయి వద్ద జగన్ ఓ మొక్క నాటుతున్నారు. కడప జిల్లాలో పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాలు.. కర్నూలులో ఆళ్లగడ్డ, బనగానపల్లి, డోన్, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆలూరు.. అనంతపురం జిల్లాలో గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల, ఉరవకొండ, రాప్తాడు, అనంతపురం రూరల్, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి.. చిత్తూరు జిల్లాలో తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు, పుంగనూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు, చంద్రగిరి, నగరి నియోజకవర్గాలలో యాత్ర పూర్తి చేశారు. జగన్ ఇప్పటి వరకూ మొత్తం 909.1 కి.మీ పాదయాత్ర చేశారు. 67వ రోజు 12.7 కి.మీ నడిచారు.



'కాబూల్' ఉగ్రవాదుల హతం

- దాడిచేసిన ఐదుగురిని చంపిన బలగాలు
- హోటల్ నుంచి 150 మంది విడుదల
- 12 గంటలు పోరాడిన భద్రత సిబ్బంది
- మృతుల సంఖ్యపై స్పష్టతలేని సమాచారం

కాబూల్, జనవరి 21: అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని విలాసవంతమైన ఇంటర్ కాంటినెంటల్ హోటల్‌పై దాడి చేసిన ఐదుగురు ఉగ్రవాదులను భద్రత దళాలు హతమార్చాయి. ఉగ్రవాదులతో బలగాలు 12 గంటల పాటు పోరాడి, హోటల్‌లో బందీలుగా ఉన్న దాదాపు 150 మందిని రక్షించినట్టు అధికారులు తెలిపారు. వీరిలో 40 మందికిపైగా విదేశీయులు ఉన్నట్టు చెప్పారు. కాగా ఉగ్రవాదుల దాడిలో కనీసం ఆరుగురు మరణించినట్టు వార్తలు రాగా, 18 మంది మరణించినట్టు మరో వార్త సంస్థ వెల్లడించింది. ఎంతమంది చనిపోయారన్న విషయంపై కచ్చితమైన సమాచారం రాలేదు. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తాలిబన్లు హోటల్‌పై దాడి చేశారు. కాల్పులు జరుపుతూ.. హోటల్‌లోని గదులకు నిప్పు పెట్టారు. హోటల్‌లో మంటలు, దట్టమైన పొగ వ్యాపించాయి. హోటల్‌లో ఉన్నవారు కొందరు బందీలుగా చిక్కుకుపోగా, మరికొందరు ప్రాణాలు రక్షించుకోవడానికి పై అంతస్తుకు చేరుకున్నారు. కొందరు బెడ్‌షీట్ల సాయంతో కిందకు దిగుతున్న దృశ్యాలు ఓ అఫ్గాన్ టీవీలో



ప్రసారమయ్యాయి. తప్పించుకునే ప్రయత్నంలో ఓ వ్యక్తి అదుపు తప్పి నేలపై పడ్డాడు. భద్రత బలగాలు హెలికాప్టర్లలో హోటల్‌పై దిగి ఆపరేషన్ చేపట్టాయి. 12 గంటల పాటు పోరాడిన తర్వాత ఉగ్రవాదులను హతమార్చి.. బందీలను విడిపించినట్టు అధికారులు తెలిపారు. ఈ దాడికి పాల్పడింది తామేనని తాలిబన్లు ప్రకటించారు. 2011లో ఇదే హోటల్‌పై తాలిబన్లు దాడి చేసిన ఘటనలో 10 మంది పౌరులు సహా 21 మంది మరణించారు.

మలేసియాలో హైదరాబాదీ అదృశ్యం

- భారత్‌లో కుటుంబీకుల ఆవేదన
- సాయం కోసం సుష్మ స్వరాజ్‌కు వినతి

హైదరాబాద్, జనవరి 21: ఉపాధి కోసం వెళ్లిన హైదరాబాదీ యువకుడు మలేసియాలో అదృశ్యమయ్యాడు. గత ఏడాది అక్టోబర్‌లో చివరిసారిగా కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ తర్వాత సదరు యువకుడి నుంచి ఎలాంటి సమాచారం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. బాధిత కుటుంబానికి సాయం చేయాలంటూ కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్‌కు అమ్జదుల్లా ఖాన్ లేఖ రాయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. మంత్రి ఆదేశాలతో భారత, మలేసియా రాయబార కార్యాలయం ఆ యువకుడి ఆచూకీ కోసం ప్రయత్ని



స్తోంది. నగరంలోని సలాలా బర్కాస్ కు చెందిన సయ్యద్ యూసఫ్ గత ఏడాది జూలై 6 న మలేసియా వెళ్లా డు. ఉపాధి కల్పిస్తామంటూ మాయ మాటలు చెప్పిన ఏజెంట్‌కు రూ.75 వేలు చెల్లించాడు. అయితే, టూరిస్ట్ వీసా చేతిలో పెట్టి ఆ ఏజెంట్ సయ్యద్‌ను విమానం ఎక్కించాడు. మలేసియాలో దిగిన తర్వాత మొబైల్ షాప్‌లో పనిచేయాలంటూ ఒత్తిడి చేశారంటూ సయ్యద్ ఫోన్‌లో సమాచారం అందించాడు. గత ఏడాది అక్టోబర్ 23న సయ్యద్ నుంచి చివరిసారి ఫోన్ వచ్చిందని.. ఆ తర్వాత తన ఆచూకీ దొరకడం లేదని సయ్యద్ కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో 2017 నవంబరు 3న ఈ విష యాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకె ళ్లామని వివరించారు. కాగా, మంత్రి సుష్మ స్వరాజ్ ఆదేశాలతో మలేసియాలోని భారత రాయబార కార్యాల య అధికారులు రంగంలోకి దిగి, సయ్యద్ కోసం గాలింపు చర్యలు చేపట్టా రు. మలేసియా పోలీస్ శాఖ సాయం కోరినట్లు సమాచారం. ఏదేని కారణంతో అరెస్టయి జైల్లో ఉన్నాడా అనే కోణంలో శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీల వివరాలనూ పరిశీలిస్తున్నారు.


ప్రతిష్టంభన యథాతథం

అమెరికా ప్రభుత్వ స్తంభనలో తొలిరోజు..

ద్రవ్యబిల్లును ఆమోదిస్తేనే వలసలపై చర్చ

- రిపబ్లికన్ల షరతు.. పట్టువీడని డెమోక్రాట్లు
- ట్రంప్ రెండో ఏడాది 'మూత'తో మొదలు

వాషింగ్టన్, జనవరి 21: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండో ఏడాది పదవీకాలం ప్రభుత్వ స్తంభనతో మొదలైంది. ద్రవ్య వినిమయ బిల్లుకు కాంగ్రెస్‌లో ఆమోదం లభించని ఫలితంగా తలెత్తిన ప్రతిష్టంభనతో శుక్రవారం అర్ధరాత్రి నుంచే ప్రభుత్వ సంస్థలకు నిధుల విడుదల నిలిచిపోయింది. అత్యవసర సేవల రంగాలు మినహా సర్కారు మూసివేత యథాతథంగా కొనసాగుతోంది. వాస్తవానికి నిరుడు అక్టోబరులో ప్రారంభమైన ఆర్థిక సంవత్సరం ఇప్పటిదాకా మూడు వరుసన తాత్కాలిక నిధుల విడుదల బిల్లులతోనే సాగుతుండగా, తాజా ప్రతిపాదన నాలుగోది కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వ కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమైతే తప్ప అక్రమ వలసదారులకు రక్షణ కొనసాగింపుపై చర్చల ప్రసక్తి లేదని రిపబ్లికన్ పార్టీ ప్రతినిధులు స్పష్టం చేసున్నారు. అయితే, 'డ్రీమర్ల' విషయంలో తమ డిమాండ్‌ను వదలుకోబోమని డెమోక్రాట్లు కూడా కుండబద్దలు కొట్టారు. ఇలా అధికార, విపక్షాలు రెండూ ఎదురునిలిచి వాగ్యుద్ధానికి తలపడిన నేపథ్యంలో ప్రతిష్టంభనకు ఇప్పుడప్పుడే శుభం కార్డు పడే పరిస్థితి కనిపించడం లేదు. మరోవైపు ప్రభుత్వ ఉద్యోగులు విధులకు రానక్కర్లేదని ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని రంగాలకు సంబంధించి జీతం లేకుండా పనిచేయాల్సిందిగా కోరింది. ఈ పరిణామంపై అధికార, విపక్షాలు శనివారం సమావేశమైనా యథావిధిగా పరస్పర ఆరోపణలు గుప్పించుకుంటూనే ఉన్నాయి.



కాగా, ఫిబ్రవరి 8 దాకా ప్రభుత్వ కార్యకలాపాలకు నిధుల లోటు రాకుండా ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టనుంది. డెమోక్రాట్లు వీలైనంత త్వరగా దీన్ని ఆమోదించకపోతే వారు కోరుతున్న విధంగా అక్రమ వలసదారుల రక్షణపై చర్చకు అవకాశం ఉండదని స్పష్టం చేసింది. మొత్తంమీద కాంగ్రెస్ ఉభయసభలలో అధికార రిపబ్లికన్ పార్టీకి ఆధిక్యం ఉన్నప్పటికీ డెమోక్రాట్లతో ఒప్పందానికి రావడంలో ట్రంప్ అసమర్థతే ఆయన యంత్రాంగాన్ని బలహీనపరిచే బలమైన దెబ్బకొట్టినట్టయింది.

పార్కులు సహా అన్నీ మూత

శ్వేతసౌధం వెలుపల- నేషనల్ మాల్ వేదికగా మహిళా హక్కుల రెండో వార్షికోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్కులు, బహిరంగ చరిత్రాత్మక ప్రదేశాలు, స్మిత్‌సోనియన్ మ్యూజియంలు పనిచేస్తున్నాయి. అయితే, ఫిలడెల్ఫియాలో లిబర్టీ బెల్, స్వేచ్ఛా విగ్రహం, న్యూయార్క్ ఓడరేవులోని ఎల్లిస్ ద్వీపం తదితరాల వద్దనుంచి సందర్శకులను వెనక్కు పంపేశారు. ఇక స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు ట్రంప్, కొందరు కేబినెట్ మంత్రుల పర్యటనపై రోజువారీ అంచనా వేస్తామని బడ్జెట్ డైరెక్టర్ మిక్ మల్వానీ చెప్పారు. ''డెమోక్రాట్లు తమ ఆటలు కట్టిపెట్టి ప్రతిష్టంభన తొలగేందుకు సహకరించాలి. లేకపోతే వారు కోరుతున్న మేరకు వలసల సంస్కరణపై అధ్యక్షుడు సంప్రదింపులకు అంగీకరించే ప్రసక్తే లేదు'' అని శ్వేతసౌధం అధికార ప్రతినిధి సారా శాండర్స్ స్పష్టం చేశారు. డెమోక్రాట్లు పట్టువీడకపోతే ప్రభుత్వ స్తంభన అంశాన్ని అధ్యక్షుడు నేరుగా ప్రజల ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని అధ్యక్ష భవనం చట్టసభా వ్యవహారాల డైరెక్టర్ మార్క్ షార్ట్ చెప్పారు. ఆ మేరకు కొద్దిరోజుల్లో ఆయన జాతినుద్దేశించి ప్రసంగించవచ్చున్నారు. అధ్యక్ష భవనం, రిపబ్లికన్లు తెగేసి ప్రకటిస్తున్న నేపథ్యంలో రాజకీయ సంకుల సమరం సుదీర్ఘంగానే సాగవచ్చునని విశ్లేషకులు భావిస్తున్నారు.

చపలచిత్తపు ట్రంప్: షుమర్ విమర్శ

ట్రంప్‌ను చపలచిత్తపు చర్చల భాగస్వామిగా సెనేట్ డెమోక్రాట్ నాయకుడు చక్ షుమర్ విమర్శించారు. శుక్రవారం నాటి చర్చల సందర్భంగా పలుమార్లు ఒక అంగీకారానికి వచ్చే అవకాశం ఏర్పడినా వలస వ్యతిరేక భావన వదులుకోవడంపై ఆయన వెనకడుగు వేసినట్లు పేర్కొన్నారు. ''అధ్యక్షుడు ట్రంప్‌తో చర్చలంటే జారుడు పదార్థాన్ని పట్టుకునే ప్రయత్నమే. విపరీత చాంచల్యంగల వ్యక్తితో సంభాషించడం అసాధ్యం.. అంగుళం తేడాతో అవకాశం చేజారుతూంటుంది'' అని వ్యాఖ్యానించారు. కాగా, సంక్షోభ పరిష్కారం చేరువైనట్టే కనిపించినా నాలుగో 'తాత్కాలిక నిధుల విడుదల' బిల్లుకు మోకాలడ్డుపెట్టి డెమోక్రాట్లు గండికొట్టారని సెనేట్‌లో అధికారపక్ష రిపబ్లికన్ల నాయకుడు మిచ్ మెకానెల్ ఆరోపించారు. బిల్లుపై తిరిగి సోమవారం ఓటింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

భారత్ పాక్ సరిహద్దులో 'రెడ్ అలర్ట్'

- సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి
- ప్రజలకు జమ్ము పోలీసుల సూచన

జమ్ము. జనవరి 21: భార‌త్, పాక్ సరిహద్దుల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో జమ్ము కశ్మీర్ పోలీసులు శనివారం రెడ్ అలెర్ట్ ప్రకటించారు. పాక్ దళాలు బాంబు దాడులు ఆపకపోవడంతో సరిహద్దులోని గ్రామాల్లో నివాసముంటున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచిస్తున్నారు. జమ్ము ప్రావిన్స్‌లోని సరిహద్దు ప్రాంతాలు చీకటిగా ఉండడమే కాకుండా ఏడారి భాగం ఎక్కువ ఉండడంతో బాంబుల దాడి కొనసాగుతుందని, ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లడం మంచిదని జమ్ము పోలీసులు సూచిస్తున్నారు. అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రభుత్వం అప్రమత్తమైందని పోలీసులు చెప్పారు. ప్రజలు ఇళ్లలో లైట్లు వెలిగించ వద్దని, గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే ఫొన్ కాల్స్‌కు స్పందించవద్దని, భద్రత దళాలకు సంబంధించిన సమాచారంపై ఇతరులతో చర్చించవద్దని ప్రజలకు సూచనలు చేస్తున్నారు.

భారత రాయబారికి మళ్లీ పాక్ సమన్లు

ఇస్లామాబాద్, జనవరి 21: భారత డిప్యూటీ హైకమిషనర్‌కు వరుసగా 4వ రోజు పాకిస్థాన్ సమన్లు జారీచేసింది. నియంత్రణ రేఖవద్ద భారత్ నిష్కారణంగా జరిపిన కాల్పులతో, పాక్‌లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని పాక్ ఆరోపించింది. గతకొన్ని రోజులుగా ఇరుదేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సోమవారం నుంచి ఇప్పటివరకూ మొత్తం ఐదు సార్లు భారత డిప్యూటీ హై కమిషనర్ జేపీ సింగ్‌కు సమన్లు జారీచేసింది. కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ భారతసైన్యం కాల్పులు జరుపుతోందని పాక్ విదేశాంగ శాఖ ఆరోపిస్తోంది. ఈనెల 20-21 తేదీల్లో భారీ ఆయుధాలు, మోర్టార్లను నియంత్రణా రేఖకు ఆనుకుని ఉన్న నికియల్ సెక్టార్‌పై 18 భారత పోస్టులు ప్రయోగించాయని పాక్ మండిపడుతోంది. మరోవైపు తమ దేశంలోని పౌరులే లక్ష్యంగా పొరుగుదేశం భారత్ ఇలాంటి దాడులు అదేపనిగా చేయడం, అంతర్జాతీయ మానవహక్కుల ఉల్లంఘనకు పాల్పడటమేనని దాయాది దేశం మండిపడింది. ప్రాంతీయ భద్రత, ప్రశాంతతకు భంగం వాటిల్లే ప్రమాదాన్ని ఈ కాల్పులు సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేసిన పాక్, 2003లో చేసుకున్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ గౌరవించాలని విజ్ఞప్తి చేసింది. భారత్- పాక్ ఐక్యరాజ్యసమితి సైనిక పరిశీలకుల బృందాన్ని భారత్‌లో అనుమతిస్తే, యూఎన్ సెక్యూరిటీ కౌన్సిల్ తీర్మానాలన్నింటినీ తూ.చ. తప్పకుండా అమలయ్యేలా చేస్తుందని సార్క్, దక్షిణాసియా డైరెక్టర్ జనరల్ మహమ్మద్ ఫైసల్ పేర్కొన్నారు.

సమ్మతి లేనిదే మహిళను తాకరాదు

- లైంగిక వేధింపుల కేసులో ఢిల్లీ కోర్టు వ్యాఖ్య
- బాలికను వేధించిన కామాంధుడికి ఐదేళ్ల జైలు
- స్త్రీలపై పైశాచిక దాడులు దురదృష్టం: న్యాయమూర్తి

న్యూఢిల్లీ, జనవరి 21: 'మహిళల దేహంపై పూర్తి హక్కు, అధికారం ఆమెదే. ఆమె అనుమతి లేనిదే ఎవరూ తాకడానికి కూడా హక్కు లేదు. కానీ దురదృష్టవశాత్తు దేశంలో మహిళలపై కామాంధుల పైశాచిక దాడులు కొనసాగుతూనే ఉన్నాయి' అని ఢిల్లీ కోర్టు వ్యాఖ్యానించింది. కామవాంఛతో కొట్టుమిట్టాడుతున్న కామాంధుల చేతుల్లో మహిళలు ఇంకా సమిధలవుతూనే ఉన్నారని పేర్కొంది.

2014లో 9 ఏళ్ల బాలికను ఢిల్లీ ముఖర్జీ నగర్‌లోని రద్దీగా ఉన్న మార్కెట్‌లో తాకరాని చోట అసభ్యంగా తాకి లైంగిక వేధింపు లకు పాల్పడిన చవి రామ్ అనే నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష విధించిన అదనపు సెషన్స్ కోర్టు జడ్జి సీమా మణి ఈ వ్యాఖ్యలు చేశారు. 2014 సెప్టెం బరు 25న తన తల్లితో కలిసి మార్కెట్‌కు వెళ్లిన తొమ్మిదేళ్ల బాలికపై రామ్ అనే వ్యక్తి అసభ్యంగా తాకి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆ విషయాన్ని చిన్నారి తన తల్లికి చెప్పడంతో.. అతడు అక్కడి నుంచి పరుగులు తీశాడు. అక్కడున్న వారి సాయంతో అతడిని పట్టుకున్న ఆమె తల్లి.. నిందితుడిని పోలీసులకు అప్పగించింది. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి సీమా మణి నిందితుడు కావాలనే లైంగిక వాంఛ తీర్చుకోవాలని బాలికను అసభ్యంగా తాకాడని నిర్ధారించారు. రామ్ క్షమార్హుడు కాదని వ్యాఖ్యానించారు. ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానాను విధించారు. అంతేకాక బాధిత బాలికకు రూ.50 వేల పరిహారం చెల్లించాల్సిందిగా ఢిల్లీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు. మహిళల గోప్యతా హక్కును మగాళ్లు ఇంకా గుర్తించనట్టే కనిపిస్తోందని ఈ సందర్భంగా న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. లైంగిక వాంఛ తీర్చుకోవాలన్న ఆలోచనతో రెండో ఆలోచన లేకుండా నిస్సహాయ బాలికలపై కొందరు మగాళ్లు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. ''సాంకేతికంగా దూసుకుపోతూ, వేగంగా వృద్ధి చెందుతున్న భారత్ లాంటి స్వేచ్ఛాయుత దేశంలో బాలికలు, మహిళలపై ఇలాంటి అకృత్యాలు జరగడం దురదృష్టకరం. ప్రత్యేకించి జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, మార్కెట్లు, సినిమా హాళ్లు, బస్సులు, మెట్రో రైళ్లలో కూడా కామాంధులు తెగబడడం దారుణం'' అని కోర్టు వ్యాఖ్యానించింది.

తొలి అంధ ఐఎఫ్ఎస్‌కు రాష్ట్రపతి సత్కారం


- 111 మంది 'తొలి' నారీమణులకు గౌరవం

న్యూఢిల్లీ, జనవరి 21: ఆత్మస్థైర్యంతో ఎటువంటి సవా ళ్లనైనా అధిగమించి విజయం సాధించవచ్చని నిరూపించిన నారీమణులు వారంతా! వైక ల్యాలను సైతం వెక్కిరించి... తమ లక్ష్యాలను అందుకున్నారు. ఇలా ఎన్నో ప్రతిబంధకాలను దాటుకొని తొలిసారిగా ఆయా రంగాల్లో అడుగుపెట్టిన తొలి వనితలను రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సత్కరించారు. స్త్రీ, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆ ధీర వనితలు తమ అనుభవాలను పంచుకున్నారు. చెన్నైకి చెందిన అంధురాలైన యువతి బెనో జెఫీన్. అఖిల భారత సర్వీసుల్లో చేరడం జీవితాశయంగా పెట్టుకున్నారామె. కానీ యూపీఎస్సీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ బ్రెయిలీ లిపిలో అందుబాటులో లేదు. తల్లిదండ్రులు చదివి వినిపిస్తుంటే.. అక్షరం కూడా విడువకుండా అవపోసన పట్టేసేవారు బెనో. కఠిన పరిశ్రమతో సివిల్స్‌లో 343వ ర్యాంకు సాధించారు. 2015లో ఇండియన్ ఫారెన్ సర్వీసు అధికారి ఎంపికై ఇప్పుడు పారిస్‌లోని భారత రాయబార కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలా తొలి అంధురాలైన ఐఎఫ్ఎస్ అధికారిగా బెనో తన కలను సాకారం చేసుకున్నారు.

'బవానా' ఫ్యాక్టరీ యజమాని అరెస్ట్

- మృతుల కుటుంబాలకు 5 లక్షల పరిహారం
- అగ్నిప్రమాద ఘటనలో 17 మంది మృతి

న్యూఢిల్లీ, జనవరి 21: ఢిల్లీలోని బవానా పారిశ్రామిక వాడలో బాణసంచా కర్మాగారంలో అగ్నిప్రమాద ఘటన కేసులో దాని యజమాని మనోజ్ జైన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రోహిణి మేజిస్ట్రేట్ ముందు ఆయన్ను హాజరు పరచగా.. న్యాయమూర్తి ఒక్కరోజు జ్యుడిషియల్ కస్టడీకి ఆదేశించారు. సోమవారం మనోజ్ జైన్‌ను కోర్టులో హాజరు పరచనున్నారు. శనివారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో 17 మంది మరణించగా, మరో 30 మంది గాయపడ్డారు. మృతుల్లో 8 మంది మహిళలు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుల్లో దాదాపుగా కార్మికులు ఉన్నారు. ఈ ఘటనపై ఢిల్లీ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీకి లైసెన్స్ తీసుకున్న ఫ్యాక్టరీ యజమానులు.. అక్రమంగా బాణసంచా తయారు చేయిస్తున్నట్టు సమాచారం.




జీశాట్-11తోనే ఆఖరు?

- జీఎస్ఎల్వీ సామర్థ్యం పెంచుతాం
- ఉపగ్రహాల బరువు తగ్గించవచ్చు
- విదేశీ ప్రయోగాలపై ఆధారపడక్కర్లేదు


చెన్నై, జనవరి 21: ఉపగ్రహ ప్రయోగంలో విదేశాల సాయం తీసుకోవడం జీశాట్-11తోనే ఆఖరు కానుందని ఇస్రో చైర్మన్ కె.శివన్ పేర్కొన్నారు. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే.. ఇకపై జీశాట్ ఉపగ్రహాలతో పాటు కాస్త బరువు ఎక్కువగా ఉండే ఉపగ్రహాలను మన రాకెట్లతోనే అంతరిక్షంలోకి చేరుస్తామని వివరించారు. ప్రస్తుతం ఈ దిశగా ప్రయోగాలు జరుగుతున్నాయని ఆయన వివరించారు. ప్రస్తుతం కమ్యూనికేషన్ అవసరాల కోసం భారత్ త్వరలో జీశాట్ -11 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపించనున్న విషయం తెలిసిందే! అయితే, ఈ ఉపగ్రహ బరువు 5.7 టన్నులు కావడంతో దీనిని అంతరిక్షంలోకి చేర్చే రాకెట్ మన దగ్గర లేదు. ఈ క్రమంలో జీశాట్ -11 ఉపగ్రహాన్ని ఏరియన్ రాకెట్ ద్వారా నింగిలోకి చేర్చనున్నట్లు అధికారులు తెలిపారు. ఇస్రోకు అందుబాటులో ఉన్న జీఎస్ఎల్వీ మార్క 3 రాకెట్‌తో కేవలం నాలుగు టన్నుల లోపు బరువున్న ఉపగ్రహాలను మాత్రమే పంపించవచ్చన్నారు. దీంతో తాజా ప్రయోగానికి విదేశాలపై ఆధారప డాల్సిందే! భవిష్యత్తులో ఈ పరిమితిని మార్చేందుకు ప్రస్తుతం శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారని శివన్ వివరించారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి వారు రెండు రకాలుగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇందులో.. జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్ సామర్థ్యాన్ని పెంచేందుకు శోధిస్తూ, ఉపగ్రహాల బరువును గరిష్ఠంగా తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. సాధారణంగా ఉపగ్రహంలోని బరువులో మెజారిటీ వాటా అందులోని ఇంధనానిదే.. దీనిపై మరిన్ని పరిశోధనలు జరిపి, ఇంధన వినియోగానికి ప్రత్యామ్నాయం రూపొందిస్తే శాటిలైట్ బరువు తగ్గుతుందని శివన్ వివరించారు.


భారీ విస్ఫోటం దిశగా 'మేయన్'

ఫిలిప్పీన్స్‌లోని మౌంట్ మేయన్ అగ్ని పర్వతం ఇప్పటికీ అంతర్గతంగా మండుతూనే ఉంది.. ఇటీవల ఈ అగ్ని పర్వతం భారీ ఎత్తున లావా వెదజల్లనుందని వార్తలు వెలువడ్డాయి. దీంతో సమీప గ్రామాల్లోని ప్రజలు అప్పటికప్పుడు తట్టాబుట్టా సర్దేసుకుని ఆ ప్రాంతాన్ని ఖాళీ చేశారు. తరచుగా కొద్ది మొత్తంలో లావా వెదజల్లుతూనే ఉంటోంది. ఈ నేపథ్యంలో మౌంట్ మేయన్ అగ్ని పర్వతం విశేషాలు..



మేయన్- స్ట్రాటోవోల్కనోకు ఉదాహరణగా నిలుస్తోంది. కోనికల్ షేప్‌కు అనుకూలంగా ఉంటోంది.





2006లో మండుతున్న లావాను వెదజల్లుతున్న మేయన్ పర్వతం.

1814లో ఈ అగ్ని పర్వతం వెదజల్లిన లావా కారణంగా దాదాపుగా 1200 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఆపై 2013లో మరోసారి బద్దలైన మేయన్.. ఐదుగురి ప్రాణాలను బలి తీసుకుంది.



కాలా డబ్బింగ్

రజనీకాంత్ టైటిల్ పాత్రలో నటిస్తున్న చిత్రం 'కాలా'. ముంబై దారావి ప్రాంతంలోని తమిళుల కోసం పోరాటం చేసే వ్యక్తిగా, రాజకీయ నాయకుడిగా రజనీకాంత్ దర్శనమీయబోతున్నారు. 'కబాలి' ఫేమ్ పా రంజిత్ ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. సినిమా తుది దశకు చేరుకుంది. నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. అందులో భాగంగా రజనీకాంత్ డబ్బింగ్ చెబుతున్నారు. బాలీవుడ్ నటుడు నానా పటేకర్ ఇందులో రాజకీయ నాయకుడి పాత్రలో కనిపించనున్నారు. హీరో ధనుష్ తన స్వంత నిర్మాణ సంస్థ వండర్ బార్స్‌పై ఈ సినిమాను నిర్మిస్తుండటం విశేషం. '2.0' తర్వాతే ఈ సినిమా విడుదల ఉంటుంది.



వరుణ్ తేజ్ 'తొలిప్రేమ'

ఆడియో ఆవిష్కరణ

వరుణ్ తేజ్ కథానాయకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పి పతాకంపై నిర్మిస్తున్న చిత్రం 'తొలిప్రేమ. రాశి ఖన్నా హీరోయిన్. వెంకీ అట్లూరి దర్శకుడు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ నిర్మాత. ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నారు. ఎస్.ఎస్.తమన్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలను శనివారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. బిగ్ సీడీని, ఆడియో సీడీలను అల్లు అరవింద్ విడుదల చేయగా.. తొలి సీడీని దిల్‌రాజు అందుకున్నారు. వరుణ్ తేజ్ మాట్లాడుతూ ''ఈ సినిమా చేసే క్రమంలో ఆరు నెలల వరకు ఏ టైటిల్ పెడదామని ఆలోచించాం. దర్శకుడు వెంకీ ముందుగా తొలిప్రేమ అనే టైటిల్ పెడదామని అనడంతో.. నాకు ఇష్టమున్నా కూడా కాస్త భయపడ్డాను. ఆ టైటిల్ పెట్టుకుని ఏమైనా తేడా వస్తే... మనకు పగిలిపోద్ది అని అన్నాను. ఎందుకంటే అది బాబాయ్‌కి ఐ కాంటాక్ట్ మూవీ. డెఫినెట్‌గా అప్పటి తొలిప్రేమను ప్రేక్షకులు ఎంత ఆదరించారో తెలుసు. కాబట్టి ఆ సినిమా టైటిల్ పెట్టినందుకు జస్టిఫై చేసేలా మా సినిమా ఉంటుందని నమ్మకంగా ఉన్నాం'' అన్నారు. దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ ''వరుణ్ ఈ సినిమా విషయంలో నాకు ఎంతో ధైర్యాన్నిచ్చారు. సినిమాలో వరుణ్ నటన అందర్నీ ఆకట్టుకుంటుంది. రాశిని గ్లామర్ క్వీన్‌గా చూసిన ప్రేక్షకులకు ఈ సినిమాలో పెర్‌ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే రాశి కనిపిస్తుంది'' అన్నారు. ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ ''బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్‌గారికి, నాకు చాలా మంచి అనుబంధం ఉంది. పవన్‌తో అత్తారింటికి దారేది చేసిన ప్రసాద్‌గారు ఇప్పుడు పవన్ సినిమా టైటిల్‌తోనే వరుణ్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది'' అన్నారు. ఎస్.ఎస్.తమన్ మాట్లాడుతూ ''ఇంత మంచి మెలోడీ ఆల్బమ్ చేసే అవకాశం కలిగించిన నిర్మాతలకు థాంక్స్. దర్శకుడు వెంకీ అట్లూరి నా నుండి మంచి మ్యూజిక్‌ను రాబట్టుకున్నారు'' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ ''తమన్ చేసిన ఆల్బమ్స్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ ఆల్బమ్. మాకు, ప్రసాద్‌గారికి దగ్గర రిలేషన్ ఉంది. ఈ తొలిప్రేమ ఆడియో వేడుకలో ఆ తొలిప్రేమను గుర్తు చేసుకోవాల్సిందే'' అన్నారు.

ఏడు భాషల్లో...

అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. వక్కంతం వంశీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. లగడపాటి శిరీషా శ్రీధర్ సినిమాను నిర్మిస్తున్నారు. అల్లు అర్జున్‌కు తెలుగుతో పాటు మలయాళంలో మంచి క్రేజ్ ఉంది. ఆ దృష్ట్యా నిర్మాతలు బన్ని సినిమాను మలయాళంలో కూడా అనువాదం చేసి విడుదల చేస్తుంటారు. అయితే బన్ని 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' సినిమా మాత్రం ఏడు భాషల్లో విడుదల కానుంది. తెలుగు, మలయాళంతో పాటు తమిళం, హిందీ, బోజ్‌పురి, మరాఠీ, బెంగాలీ భాషల్లో సినిమాను అనవాదం చేయనున్నారు. సినిమా ఏప్రిల్ 27న విడుదలవుతుంది. బన్ని ఈ చిత్రంలో సోల్జర్ పాత్రలో నటిస్తున్నారు. అను ఇమాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తుంది.



అల్లు అర్జున్



స్కెచ్ పక్కా మాస్ మూవీ

- విక్రమ్

విక్రమ్, తమన్నా జంటగా నటించిన చిత్రం 'స్కెచ్'. విజ్ చందర్ దర్శకుడు. ఈ సినిమా విడుదల సందర్భంగా హీరో విక్రమ్ మాట్లాడుతూ ''ఒక వ్యక్తిని చంపడానికి, కిడ్నాప్ చేసే సందర్భంలో స్కెచ్ వేయడం అనే పదం వినే ఉంటాం. దాన్నే సినిమా టైటిల్‌గా ఎందుకు పెట్టామని తెలియాలంటే సినిమా చూడాల్సిందే. కారు లోన్లు తీసుకుని ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించని వారిపై ... ఓ గ్రూప్‌తో స్కెచ్ వేసి వారి దగ్గర లోన్స్ వసూలు చేసే పాత్రలో నేను కనపడతాను. ఓ సందర్భంలో ఓ పెద్ద వ్యక్తితో హీరో గొడవ జరుగుతుంది. అది ఎక్కడికి దారి తీస్తుందనేదే సినిమా. ఇది పక్కా మాస్ కమర్షియల్ మూవీ. ఆల్‌రెడి విడుదలైన ఈ స్కెచ్ చిత్రానికి తమిళనాడుతోపాటు ఓవర్‌సీస్‌లో మంచి ఆదరణ లభించింది. కథలో మంచి ట్విస్ట్‌లుంటాయి. ముఖ్యంగా క్లైమాక్స్ అద్భుతంగా వుంటుంది. దర్శకుడు విజయ్ చందర్ ఏడేళ్ళ క్రితం కథ రాసుకున్నారు. దాని ప్రకారం తమిళనాడులోని కొన్ని చోట్ల లోకల్ గూండాలు వుండే ప్రాంతాలను పర్యటించి కథను తయారు చేసుకున్నారు. తమన్నా బ్రాహ్మణ అమ్మాయిగా కనపడుతుంది.. తన పాత్ర సీరియస్‌గా ఉంటుంది. మా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగుంది. దేశంలో చాలా బాషలున్నాయి. ఎక్కడ మంచి ఛాన్స్ వస్తుందో అక్కడ చేస్తాను. 'బాహుబలి' తీసుకుంటే తెలుగు సినిమా కాదు. ఇండియన్ సినిమా. నేను తర్వాత హిందీ సినిమా చేస్తున్నా. హిందీలో కూడా అపరిచితుడు, ఐ.. చూశారు. బాహుబలిని కూడా అన్ని భాషల్లో చూశారు. ముంబైలో కూడా తెలుగు, తమిళ సినిమాలు సబ్ టైటిల్స్‌తో చూస్తారు. బాహుబలి సినిమా వచ్చి వైవిధ్యానికి గేట్స్ తెరిచేసింది. దక్షిణాదిలోనే మంచి టాలెంట్ పర్సన్ వున్నారనేలా చేసింది. అలాగే మా అబ్బాయి ధ్రువ 'అర్జున్‌రెడ్డి' రీమేక్‌లో నటిస్తున్నారు. తను న్యూయార్క్‌లో మెథడ్ యాక్టింగ్ నేర్చుకున్నాడు. తనను మూడేళ్ళ తర్వాత నటుడిగా చేయాలనుకున్నా. కానీ ఈ ఆఫర్ వచ్చింది. చాలా మంది కథకు సరిపోతాడని అన్నారు. అర్జున్‌రెడ్డిలో అన్ని అంశాలున్నాయి. పెర్‌ఫార్మెన్స్‌కు బాగా అవకాశముంది. అందుకే బెస్ట్‌గా వుంటుందని నిర్ణయించాను. తండ్రిగా నాకు హ్యాపీ. ఈ సినిమా తర్వాత మళ్ళీ వెనక్కువెళ్ళి డైరెక్షన్ కోర్సు చేస్తానన్నాడు. ఇక నాకు రాజకీయాల గురించి అవగాహన లేదు. వాటికి పనికిరాను. గౌతమ్‌మీనన్‌తో 'ధ్రువ నక్షత్రం' సినిమా చేస్తున్నాను. అలాగే 'సామి స్క్వేర్' చేస్తున్నా. తర్వాత కమల్ సార్ బ్యానర్‌లో థ్రిల్లర్ మూవీ చేయబోతున్నా. అలాగే కర్ణ సినిమాను ఫిబ్రవరిలో ప్రకటిస్తారు. మహాభారతంలో భీష్మ, దుర్యోధన.. కుంతీ, ద్రౌపతి.. ఈ పాత్రలు ఎవరు చేస్తే బాగుంటుందో వారు ఈ చిత్రంలో వుంటారు. దాదాపు 300 కోట్ల బడ్జెట్ సినిమా అది. ఆస్కార్ రేంజ్‌లో ఉంటుంది. ప్రస్తుతం ఆ సినిమా కోసం సిద్ధమవుతున్నాను'' అని తెలిపారు.



సూర్యతో యువన్

సూర్య, సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సూర్య సరసన సాయిపల్లవి, రకుల్ ప్రీత్ సింగ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఇటీవల లాంఛనంగా ప్రారంభమైన ఈ చిత్రాన్ని దీపావళికి విడుదల చేయాలనేది నిర్మాతల ఆలోచన. ఈ సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. రీసెంట్‌గా 'గ్యాంగ్'తో సందడి చేసిన సూర్య తదుపరి కె.వి.ఆనంద్‌తో కూడా సినిమా చేయబోతున్నారు.





తమన్నా రిస్కీ డాన్స్

కల్యాణ్‌రామ్ హీరోగా జయేంద్ర దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నా నువ్వే'. విభిన్నంగా సాగే రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ చిత్రంలో తమన్నా రేడియో జాకీ పాత్ర పోషిస్తోంది. ఇప్పటివరకు తెలుగు సినిమాల్లో మనం చూడని పాటని ఈ చిత్రం కోసం ప్రత్యేకంగా చిత్రీకరించారు. ఈ పాట సినిమాకి పెద్ద హైలైట్ అవుతుందని చిత్ర యూనిట్ చెప్తోంది. ఈ పాట కోసం తమన్నా టాంగో అనే కొత్త డాన్స్‌ని నేర్చుకుంది. ఈ డాన్స్ ఎంతో నేర్పుతో కూడిన పాట కావడంతో నేర్చుకోవడం చాలా కష్టమని చెప్తోంది తమన్నా. ఈ డాన్స్‌కి సంబంధించి శిక్షణ తీసుకుంటున్న సమయంలో తమన్నాకి గాయాలు కూడా అయ్యాయట. ఈ డాన్స్ పర్‌ఫెక్ట్‌గా చెయ్యడంలో డాన్స్‌మాస్టర్ బృంద సహకారం ఎంతో ఉందని చెప్తోంది తమన్నా. డాన్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునే తమన్నా 'నా నువ్వే' సినిమా కోసం రిస్క్ కూడా తీసుకుందంటే సినిమాలో ఆ పాటకు ఉన్న ప్రత్యేకత ఏమిటో అర్ధమవుతుంది.

'దివ్యమణి' పాటలు



మోహ్ మాయా ఎంటర్‌టైన్‌మెంట్స్ రెడ్‌నోడ్ మీడియా పతాకంపై గిరిధర్ గోపాల్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తొన్న చిత్రం 'దివ్యమణి'. గిరిధర్ గోపాల్, స్టీవ్ శ్రీధర్ సంగీతాన్ని అందించిన ఆడియోను హైదరాబాద్‌లో విడుదల చేశారు. మధురా ఆడియో ద్వారా పాటలను లెజెండరీ డాన్సర్ డా.యామిని కృష్ణమూర్తి విడుదల చేసారు. ఈ చిత్రంలో ప్రముఖ యోగా గురు, మార్షల్ ఆర్ట్స్ సురేష్ కమల్ హీరోగా, వైశాలి, కిమయా హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సురేష్ కమల్ మాట్లాడుతూ ''గిరిధర్‌గారు మంచి కథ చెప్పారు. యాక్షన్ అంతా నేను ఒరిజినల్‌గా చేశాను. గిరిధర్ గోపాల్‌గారు టాలెంటెడ్ పర్సన్, ఆల్ రౌండర్. ఈ సినిమా ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తుంది'' అన్నారు. గిరిధర్ గోపాల్ మాట్లాడుతూ ''పాటలు బాగున్నాయంటున్నారు. సినిమా కూడా అందరినీ అలరిస్తుంది'' అన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ ''గిరిధర్ గోపాల్ దివ్యమణిలో ఎన్నో అద్భుతాలను చూపించారు. ఈ సినిమాలో స్టంట్స్ చూసి ఎక్సైట్ అయ్యాను. యామినిగారు ఈ కార్యక్రమంలో పాల్గొనడం మా అదృష్టం'' అన్నారు. యామిని కృష్ణమూర్తి మాట్లాడుతూ ''నా భాష, నా మనుషుల మధ్య ఈ కార్యక్రమం జరుపుకోవటం ఆనందంగా ఉంది. గిరిధర్ గోపాల్‌కు విజయం లభించాలని కోరుకుంటున్నాను'' అన్నారు.


ఫిబ్రవరి 16న 'మనసుకు నచ్చింది'



అమైరా దస్తూర్, సందీప్ కిషన్

ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ పతాకాలపై సంజయ్ స్వరూప్, పి.కిరణ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మనసుకు నచ్చింది'. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం ద్వారా మంజుల ఘట్టమనేని దర్శకురాలిగా పరిచయమవుతుంది. ఈ చిత్రం ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకొని 'యు/ఎ' సర్టిఫికెట్ అందుకొంది. ఫిబ్రవరి 16న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ ''రొమాంటిక్ యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా 'మనసుకు నచ్చింది' తెరకెక్కింది. సెన్సార్ పూర్తయ్యింది. రాధన్ మ్యూజిక్ సినిమాకి బిగ్గెస్ట్ ఎస్సెట్‌గా నిలుస్తుంది. ప్రేక్షకులకి ఒక మంచి సినిమా చూశామనే భావన కలిగించే చిత్రం 'మనసుకు నచ్చింది'' అన్నారు. సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిధా చౌదరి, ప్రియదర్శి, పునర్నవి భూపాలం, నాజర్, అరుణ్ ఆదిత్ తదితరులు ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రాధన్, ఎడిటర్: సతీష్ సూర్య, కళ: హరివర్మ, సినిమాటోగ్రఫీ: రవి యాదవ్, మాటలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: పి.కిరణ్-సంజయ్ స్వరూప్, రచన-దర్శకత్వం: మంజుల ఘట్టమనేని.






ఢిల్లీలో ఆదివారం ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు నివాసంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్



దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ ప్రభుత్వంపై మొదటిసారిగా 1801లో తిరుగుబాటు చేసిన పోరాట యోధుడు ముత్తుకూరు గౌడప్ప విగ్రహాన్ని.. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలో ఆవిష్కరిస్తున్న కర్నూలు ఎంపీ రేణుక

దావోస్‌కు చంద్రబాబు

- నేటి నుంచి 25 వరకు పర్యటన
- ప్రపంచ ఆర్థిక సదస్సులో ప్రసంగం

అమరావతి, జనవరి 21 (మనం న్యూస్ బ్యూరో): దావోస్‌లోజరగనున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ నెల 22 నుంచి 25 వరకు ఆయన అక్కడ పర్యటించనున్నారు. ఈ పర్యటనలో వ్యవసాయం, ఔషధ రంగం, సోలార్ ఎనర్జీ, ఐటీ, మౌలిక వసతులు వంటి కీలక రంగాలకు సంబంధించిన ఎంవోయూలను రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకోనుంది. ఈ సదస్సులో పాల్గొనేందుకు ఆదివార సాయంత్రం సీఎం బయలుదేరి వెళ్లారు. వరుసగా నాలుగో ఏడాది ఈ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొంటున్నారు. ఈ సారి సదస్సు తొలిరోజున (23న) సీఎం చంద్రబాబు కీలక ప్రసంగం చేయనున్నారు. అనంతరం క్రిస్టల్ అవార్డుల ప్రధానోత్సవంలో పాల్గొంటారు. తర్వాత డీఈపీపీ ఏర్పాటు చేయనున్న కార్యక్రమానికి హాజరవుతారు. రెండో రోజు ఏపీ లాంజ్‌లో జరిగే ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నుంచి అంతర్జాతీయ కంపెనీల సీఈవోలతో సమావేశమవుతారు. రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఏపీ లాంజ్‌ను సందర్శిస్తారు. మూడో రోజు మధ్యాహ్నం 12 గంటలకు హోటల్ బెల్విడర్ లంచ్ ఆన్ సమావేశంలో సీఎం పాల్గొంటారు. ఇందులో టెక్నాలజీస్ ఫర్ టుమారో అనే అంశంపై ఆవిష్కర్తలతో చర్చాగోష్టిలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం సీఐఐ సీఈవోలతో జరగనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో సీఎం పాల్గొంటారు. అనంతరం బహ్రెయిన్ పెట్రోలియం కంపెనీ చైర్మన్ షేక్ బిన్ ఖలీఫా అల్ ఖలీఫా ఏర్పాటు చేయనున్న విందు సమావేశంలో పాల్గొంటారు. నాలుగో రోజు పలు కంపెనీలతో ఎంవోయూలు కుదుర్చుకోవడంతో పాటు, వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై చంద్రబాబు ప్రసంగిస్తారు. మంత్రి లోకేశ్ కూడా చంద్రబాబుతో పాటు దావోస్ పర్యటనకు వెళ్తున్నారు.



గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

- ఈ సారి విజయవాడే వేదిక.. సన్నాహక పరేడ్

అమరావతి, జనవరి 21 (మనం ప్రతినిధి): గణతంత్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఈ ఏడాది కూడా విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నారు. పోలీసు, మునిసిపల్, ఇతర ప్రభుత్వ శాఖలు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఎటువంటి అవాంఛనీయం ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాటు చేశారు. పోలీసుల ఉన్నతాధికారులు ఆదివారం ఏర్పాట్లపై సమీక్షించారు. అలాగే వేడుకల్లో భాగంగా నిర్వహించే పరేడ్ రిహార్సల్స్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. అలాగే వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 13 శకటాలు కూడా ఇక్కడ రిహార్సల్‌లో పాల్గొన్నాయి. విజయవాడ పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్, కృష్ణాజిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం రిహార్సల్స్, వేడుక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.ఈ వేడుకలకు పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లను చేస్తోంది. దాదాపు 4 వేల మంది పోలీసులతో భద్రత కల్పించనుంది. ఇప్పటికే విజయవాడ పోలీసులు కమిషనరేట్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూం నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మరోవైపు వేడుకల్లో పాల్గొనే ప్రజానీకానికి, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు వివిధ శాఖలు ఏర్పాట్లు చేశాయి. విద్యార్థులను తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ శాఖ రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేస్తోంది. కాగా, విభజన అనంతరం పంద్రాగస్టు వేడుకలను ఏడాదికో నగరం వేదికగా నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గణతంత్ర దినోత్సవ వేడుకలను మాత్రం ఏడా విజయవాడలోనే నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది గణతంత్ర వేడుకల సందర్భంగా విజయవాడ నగరాన్ని మునిసిపల్ శాఖ సుందరీకరిస్తోంది. గన్నవరం విమానాశ్రయం నుంచి విజయవాడలోని రహదారులకు లైటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. కాగా, ఈ నెల 26న జరగనున్న గణతంత్ర వేడుకల్లో గవర్నర్ నరసింహన్ జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

ఎల్ఐసీ తాత్కాలిక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- కేంద్ర ఆర్థిక మంత్రికి కేవీపీ లేఖ

అమరావతి, జనవరి 21 (మనం ప్రతినిధి): లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)లో తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు లేఖ రాశారు. దాదాపు 24 ఏళ్లుగా ఎల్ఐసీలో పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలన్న కోర్టులు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ కొందరిని తొలగించారని, వారికి న్యాయం చేయాలని అందులో కోరారు. ''ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం, నెల్లూరు, విశాఖపట్నం, తెలంగాణలోని వరంగల్, కరీంనగర్ డివిజన్లకు చెందిన 600 మంది తాత్కాలిక ఉద్యోగులు 1993 నుంచి పనిచేస్తున్నారు. అయితే ఇప్పటికీ వారికి ఇతరుల పేర్ల మీద జీతాలు చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదేళ్లు దాటి పనిచేసిన వారందరిని పర్మినెంట్ చేయాలని సుప్రీంకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ క్రమంలో ఈ ఉద్యోగులెవరూ పనిచేయటం లేదని, దానికి సంబంధించిన ఆధారాలు లేవని ఎల్ఐసీ సంస్థ తెలపటంతో ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లారు. విచారణ అనంతరం ఉద్యోగులకు మద్దతుగా తీర్పు వెలువరించింది. కాగా హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూఎల్ఐసీ... కోర్టుకు వెళ్లిన ఉద్యోగులు, మరికొందరిని విధులను నుంచి తొలగించింది. ఆ స్థానంలో కొత్త వారిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తోంది. దీనిపై జోక్యం చేసుకుని ఉద్యోగులకు న్యాయం చేయాలి'' అని కేవీపీ లేఖలో పేర్కొన్నారు.

కేంద్రంపై విమర్శలొద్దు!

గొడవ పెట్టుకుంటేే నిధులు వస్తాయా



- మిత్ర ధర్మాన్ని పాటిస్తున్నాం
- అన్ని ప్రయత్నాలూ చేస్తున్నా
- చివరిదాకా ప్రయత్నిద్దాం
- కాకపోతే కేంద్రానికి ఓ దండం
- రాష్ట్ర ప్రయోజనాలకు రాజీలేదు
- నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, జనవరి 21 (మనం ప్రతినిధి): తెలుగుదేశం పార్టీ నేతలెవ్వరూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయొద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదివారం ఉండవల్లిలో సీఎం నివాసం వద్ద జరిగిన టీడీపీ పార్టీ నేతల ఒక్క రోజు సమావేశంలో చంద్రబాబు సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆ సమావేశంలో పలు అంశాలు చర్చకు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వంతో మిత్ర ధర్మాన్ని పాటిస్తున్నామని, సత్సంబంధాలు ఇక ముందు కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. విభజన చట్టంలోని హామీలపై ఇటీవల ప్రధాని మోదీతో భేటీ అయ్యానని, రాష్ట్రానికి ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తానని ఆయన హామీ ఇచ్చారని చెప్పారు. ఇలాంటి సమయంలో కేంద్రంపై ఎవరూ ఎలాంటి విమర్శలు చేయొద్దని నేతలకు చంద్రబాబు సూచించారు. ''రాష్ట్రం ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్రంతో సఖ్యతగా మెలిగితేనే రాష్ట్రానికి ప్రయోజనం. కేంద్రంతో గొడవపడితే నిధులు వస్తాయా? నిధులు రాకపోగా రాష్ట్రానికి మరింత నష్టం వాటిల్లుతుంది. అందుకే నేను సంయమనంగా వ్యవహరిస్తున్నా. ప్రజలను రెచ్చగొడితే రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడుతుంది. పంజాబ్, అసోంలో ఇదే విధంగా హింస ప్రజ్వరిల్లింది. ఇది మంచి పద్ధతి కాదు. మనం ఎన్నో ఆశయాలతో ముందుకెళ్తున్నాం. ఎన్ని సంక్షోభాలు వచ్చినా వాటిని అవకాశాలుగా మలుచుకుంటున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలో ఈ మూడున్నరేళ్లలో మన రాష్ట్రంలో జరిగినంత అభివృద్ధి జరగలేదు. టెక్నాలజీతో దేశానికే ఆదర్శంగా నిలిచాం. నా నాలుగు దశాబ్దాల చరిత్రలో ఈ విధంగా ఎప్పుడూ కష్టపడలేదు. నాకు చాలా సంతోషంగా ఉంది. కానీ ఇలాంటి పరిస్థితుల్లో కేంద్రం కూడా మనకు చేయూత నందిస్తే అభివృద్ధిని వేగంగా చేయగలుగుతాం. కేంద్రాన్ని కూడా మనం గొంతెమ్మ కొర్కెలు కోరడం లేదు. విభజన చట్టంలోని హామీలనే అడుగుతున్నాం. అందుకే కేంద్రంతో వీలైనంత సయోధ్యతో, సామరస్యంగా పరిష్కరించుకోవాలి. నేను అన్ని ప్రయత్నాలు చేస్తున్నా. చివరి దాకా ప్రయత్నిస్తునే ఉంటా. చివరి వరకు చూద్దాం. కాకపోతే అప్పుడే కేంద్రానికి దండం పెడదాం. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదు. సమస్యల పరిష్కారానికి ఎంతవరకైనా వెళ్తాను. మిగతావారిలా నేనుకూడా తిరగబడితే.. ప్రజలు అసహనానికి గుర్రై రెచ్చిపోతారు'' అని చంద్రబాబు నేతలకు దిశానిర్దేశం చేశారు. టీడీపీ వర్క్‌షాప్‌లో అవంతి శ్రీనివాస్ ఆవేశంగా ప్రసగించిన వెంటనే చంద్రబాబు పై విధంగా స్పందించారు.

వికలాంగులకు వందశాతం పింఛన్లు

రాష్ట్రంలో ఉన్న వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులందరికీ నూరు శాతం ఫించన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. వర్క్‌షాపులో ఆయా జిల్లాల నేతలు పింఛన్ల అంశంపై మాట్లాడారు. అర్హులైన వికలాంగులకు రాష్ట్రంలో చాలా మందికి ఫించన్లు అందడం లేదని చంద్రబాబు దృష్టికి తీసుకొచ్చారు. వాళ్లకు ఎలాంటి నిబంధనలు లేకుండా రాష్ట్రంలోని వికలాంగులందరికీ పింఛన్లు ఇస్తే బాగుంటుందని పలువరు నేతలు సీఎంకు వివరించారు. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే రాష్ట్రంలోని వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలందరికీ ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

అడిగిన వాళ్లకు పింక్ కార్డులు

రాష్ట్రంలో అడిగిన వాళ్లందరికీ పింక్ కార్డులు మంజూరు చేయాలని పలువురు నేతలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. చాలా మంది గుర్తింపు కోసం రేషన్‌కార్డులు అడుగుతున్నారని వివరించారు. నిరుపేదలకు ఇచ్చే తెల్లకార్డులతో పాటు గతంలో ఇచ్చిన మాదిరిగా అడిగిన వాళ్లందరికీ పింక్ కార్డులు ఇవ్వాలని కోరారు. అధికారులతో మాట్లాడి ఆ విషయంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. కాగా రాష్ట్రంలోని కళాకారులందరికీ పింఛన్లు ఇవ్వాలని పలువురు నేతలు కోరారు.

మినుమలకు మద్దతు ధరపెంచాలి

మినుములకు మద్దతు ధర చాలా తక్కువగా ఉందని, ఆ ధరను పెంచాలని టీడీపీ నేతలు చంద్రబాబును కోరారు. మినుము పంట వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారని ధర క్వింటా రూ. 4వేలు కూడా పలకడం లేదని వివరించారు. ఇప్పటికే మద్దతు ధర పెంచామని, త్వరలోనే నాఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

కేంద్రానికి వైసీపీ ఎందుకు మద్దతిచ్చింది?

కేంద్రంతో తెలుగుదేశం పార్టీ సఖ్యంగా ఉంటే వైసీపీ ఓర్వలేకపోతోందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే టీడీపీ కేంద్రంతో తెగదెంపులు చేసుకోవాలని డిమాండ్ చేస్తోందని దుయ్యబట్టారు. ''కేంద్రం నుంచి బయటకు రావడం ఒక్క నిమిషం పని. అలాచేస్తే రాష్ట్రానికి ఒరిగేదేముంది. ప్రత్యేక హోదా కోసం వైసీపీ ఎంపీలు రాజీనామా చేస్తామని చెప్పారు. వాళ్ల డిమాండ్ ఏమైంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎందుకు కేంద్రానికి మద్దతిచ్చారు. వాళ్ల వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్రానికి మద్దతు ఇస్తున్నారు. మనం రాష్ట్ర ప్రయోజనాల కోసం మద్దతు ఇస్తున్నాం. ఈ విషయాలు నేతలంతా తెలుసుకోవాలి. రాష్ట్రాభివృద్ధి కోసమే కేంద్రంతో సఖ్యంగా ఉంటున్నాం. ఉన్నత విద్యా మండలిలో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. దానిపై కోర్టుకెళుతున్నాం. విభజన చట్టంలో అమలు కాని అంశాలపైనా కోర్టుకు వెళ్లాలని నిర్ణయించాం. ఇరు రాష్ట్రాల మధ్య సమస్యలను కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలి. అంతే కానీ కేంద్రంపై మాకేమీ కోపం లేదు. అలా అని కేంద్రంతో విభేధించినట్లు కాదు'' అని నేతలకు చంద్రబాబు వివరించారు.

పవన్ ప్రజాయాత్ర

- నేటి నుంచి ప్రారంభం
- కొండగట్టు నుంచి షురూ
- జనసేనాని ప్రణాళిక ప్రకటన
- 24 వరకు తెలంగాణలో పర్యటన

హైదరాబాద్/కరీంనగర్, జనవరి 21 (మనం ప్రతినిధి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తన ప్రజా యాత్రను సోమవారం నుంచి ప్రారంభించబోతున్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి అక్కడ ప్రత్యేక పూజలు చేసి.. అక్కడి నుంచి తన రాజకీయ, ప్రజాయాత్ర ప్రణాళికను ఆయన ప్రకటిస్తారు. ఇక్కడి నుంచి ఈ నెల 24 వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ కార్యాలయం ఆదివారం ప్రకటన విడుదల చేసింది. సోమవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం నుంచి పవన్ బయలురుతారు. మధ్యాహ్నం 3 గంటల సమయానికి కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి చేరకుని పూజలు చేస్తారు. అనంతరం ఆయన యాత్ర ప్రణాళికను వెల్లడిస్తారు. సాయంత్రానికి అక్కడి నుంచి బయలుదేరి కరీంనగ్ చేరుకుని స్థానిక నేతలతో మాట్లాడుతారు. 23న కరీంనగర్‌లోని ఓ రిసార్ట్‌లో పూర్వపు కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల జనసేన కార్యకర్తలతో పవన్ సమావేశం నిర్వహిస్తారు. పార్టీ ప్రణాళికలపై వారితో చర్చిస్తారు. అనంతరం 23న సాయంత్రం అక్కడి నుంచి కొత్తగూడెం బయలుదేరి వెళ్తారు. 23న రాత్రి అక్కడే బస చేస్తారు. 24న ఉదయం 9 గంటలకు కొత్తగూడెం నుంచి బయలుదేరి ప్రదర్శనగా మధ్యాహ్నానికి ఖమ్మం చేరుకుంటారు. మూడు గంటలకు పూర్వపు ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం తిరిగి హైదరాబాద్ పయనమవుతారు. కాగా, పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో కార్యకర్తలు భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.



పవన్‌ను కలిసిన పోలెండ్ రాయబారి

చదువుల్లో రాణించి ఉంటే తాను ప్రొఫెసర్‌ను అయ్యేవాడినని పవన్ తెలిపారు. పోలాండ్ రాయబారి ఆడమ్ బురాకోవస్కీ, పోలెండ్ చార్టర్ స్కూల్ విద్యార్థులు పవన్‌ను జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాజకీయాలు, సినిమాలపై అడిగిన పలు ప్రశ్నలకు పవన్ సమాధానం చెప్పారు. తాను చదువుల్లో రాణించి ఉంటే ప్రొఫెసర్‌ను అయ్యేవాడినన్నారు. తన సినిమాల్లో స్త్రీల విద్య, భద్రతకు గల ప్రాముఖ్యతను తెలియజేసే అంశాలు ఉంటాయని పవన్ చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో శరణు కోరి భారత్‌కు వచ్చిన పోలాండ్ వాసులకు దిగ్విజయ్‌సింగ్ రంజిత్‌సింగ్ అనే రాజు తన రాజ్యంలో ఆశ్రయం ఇచ్చిన విషయాన్ని పవన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. తదనంతరం ఆ రాజు పేరును పోలాండ్ ఓ స్కూల్‌కు పెట్టారని పవన్ తెలపగా తాను అదే స్కూల్‌లో విద్యనభ్యసించానని ఆడమ్ బురాకోవస్కీ తెలిపారు. భారత్-పోలాండ్ మధ్య బంధం మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు పవన్, తన భార్య అన్నా లెజ్నేవా, పోలాండ్ రాయబారితో కలిసి సికింద్రాబాద్‌లోని సెయింట్ మెరీస్ చర్చిలో ప్రార్థనలు చేశారు.

రాజకీయం కోసం వస్తే ఊరుకోం: పొన్నం

కొండగట్టుకు వస్తున్నట్లు ప్రకటించిన పవన్ కల్యాణ్ కేవలం మొక్కు తీర్చుకోవడానికి వస్తే సరేనని, రాజకీయం కోసం వస్తే ఊరుకునేది లేదని మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొంటేనే కొండగట్టులో అడుగుపెట్టాలని డిమాండ్ చేశారు.

మీ బిడ్డలా దీవించండి

- వ్యవస్థను మార్చేందుకు సహకరించండి
- చంద్రబాబు పుట్టడం చిత్తూరు దురదృష్టం
- జిల్లాలో ప్రజా సంకల్పయాత్రలో జగన్



శ్రీకాళహస్తి, జనవరి 21 (మనం న్యూస్): ''మీ బిడ్డగా మీముందుకు వచ్చాను. నన్ను దీవించి.. ఆశీర్వదించండి. చెడిపోయిన రాజకీయ వ్యవస్థను మార్చడం నా ఒక్కడి వల్ల కాదు. అందుకు మీరంతా సహకరించండి'' అని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ఆదివారం శ్రీకాళహస్తిలో జరిగిన బహిరంగ సభలో జగన్ పాల్గొన్నారు. వైఎస్ హయాంలో ప్రాజెక్టులు కడితే చంద్రబాబు గేట్లు ఎత్తి తామే కట్టినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని జగన్ ఎద్దేవా చేశారు. చిత్తూరు జిల్లాలో చంద్రబాబు నాయుడు పుట్టడం ఈ జిల్లా దురదృష్టమని అన్నారు. బాబు హయాంలో ఆర్టీసీ చార్జీలు అమాంతంగా పెరిగాయన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజల్ ధరలు 6 రూపాయలు తక్కువని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పెట్రోల్ ధరలు అధికంగా ఉన్నాయని అన్నారు. రుణమాఫీ మొత్తం బూటకమని విమర్శించారు. ఎన్నికల ముందు జాబు రావాలంటే బాబు రావాలని ప్రచారం చేసుకున్న ముఖ్యమంత్రి.. ప్రస్తుతం ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ప్రతి కులాన్ని మోసం చేస్తూ చంద్రబాబు కుల రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలప్పుడే చంద్రబాబుకు ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. వైసీపీకి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను కొలుగోలు చేసి అందులో నలుగురికి మంత్రి పదవులు ఇచ్చినా వారిపై ఎలాంటి అనర్హత వేటు లేదని పేర్కొన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా ఇంత దారుణం జరగలేదన్నారు.

వేదిక కూలి 10 మందికి గాయాలు



శ్రీకాళహస్తి బహిరంగ సభలో అపశృతి చోటు చేసుకుంది. వేదిక కూలడంతో పదిమందికి గాయాలయ్యాయి. కాగా ఆ సమయంలో వేదికపై జగన్ లేకపోవడంతో ఆయనకు ప్రమాదం తప్పింది. పట్టణంలోని పెండ్లిమంటపం వద్ద జగన్ సభకు వేదిక ఏర్పాటు చేశారు. ఆయన వస్తుండగా.. వేదికపైకి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు చేరుకున్నారు. అంతేగాక వందలాది మంది వేదిక వద్దకు తోసుకువచ్చారు. వేదిక కుప్పకూలడంతో 10 మంది గాయపడ్డారు. వారిని చికిత్స కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వేదిక కూలడంతో పక్కనే ఉన్న వాహనంపైకి ఎక్కి జగన్ సభను కొనసాగించారు.

అమరావతిలో అంబేద్కర్ స్మృతి వనం

- ఏప్రిల్ 14న శంకుస్థాపన..
- 20 న రాష్ట్ర దళిత మహా సభ

అమరావతి, జనవరి 21 (మనం న్యూస్ బ్యూరో): అమరావతిలో అంబేద్కర్ స్మృతి వనం ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ వర్క్‌షాప్ తీర్మానం చేసింది. ఏప్రిల్ 14న దీనికి శంకుస్థాపన చేయాలని పార్టీ నిర్ణయించింది. ఈ సందర్భంగా అన్ని నియోజకవర్గాలకు చెందిన నేతలు అంబేద్కర్ జ్యోతులతో స్మృతివనం వద్దకు తరలి రావాలని పిలుపునిచ్చింది. ఏప్రిల్ 20న పార్టీ నేతృత్వంలో రాష్ట్ర దళిత మహా సభ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. వీటి నిర్వహణకు సన్నాహకంగా జనవరి 25 నుంచి 'దళిత తేజం-తెలుగుదేశం' పేరుతో క్షేత్ర స్థాయిలో కార్యక్రమాల నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందుకోసం మండల కమిటీలు, అసెంబ్లీ స్థాయిలో కో-ఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో అంబేద్కర్ జ్యోతి చైతన్య రథం ఏర్పాటు చేసి సమావే శాలు, సాంస్కృతిక బృందాలతో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రోగిపై బాయ్ లైంగిక దాడికి యత్నం.. అరెస్టు

విశాఖపట్నం, జనవరి 21(మనం న్యూస్): అపస్మారక స్థితిలో అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన మహిళపై, స్ట్రెచర్ బాయ్ లైంగిక దాడికి యత్నించిన ఘటన విశాఖ కింగ్‌జార్జి ఆస్పత్రి(కెజీహెచ్)లో సంచలనం సృష్టించింది. వ్యవహారమంతా సీసీ కెమెరాల్లో రికార్డు కావడం, బాధితురాలి కుటుంబ సభ్యులు దీనిని త్రీవంగా పరిగణించి వెంటనే ఫిర్యాదు చేయడంతో పోలీసులు రంగంలోకి దిగి బాయ్ మాడుగుల కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. గాజువాక సమీపంలోని వికాస్ నగర్‌కు చెందిన 43 సంవత్సరాల మహిళకు ఫిట్స్ రావడంతో కేజీహ్‌చ్‌కు తరలించారు. ఆమెకు తలలో నరాల సమస్య తలెత్తినట్టు గుర్తించిన వైద్యులు స్కానింగ్ పరీక్ష చేయాలన్నారు. దీంతో, ఆస్పత్రి ఆవరణలోనే పీపీపీ విధానంలో నడుస్తున్న మోడల్ డయాగ్నస్టిక్ సెంటర్‌కు ఆమెను తీసుకెళ్లారు. అక్కడ స్ట్రెచర్ బాయ్‌గా పనిచేస్తున్న మాడుగుల కిరణ్‌కుమార్ ఆమెను స్ట్రెచర్‌పై స్కానింగ్ గదిలోకి తీసుకువెళ్లారు. స్కానింగ్ అయ్యాక, గదిలో కిరణ్‌కుమార్ అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె భయంతో కేకలు వేసింది. దీంతో భయపడిన కిరణ్ అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు కిరణ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కిరణ్‌కుమార్‌పై చర్యలు తీసుకుని, విధుల నుంచి తప్పించనున్నట్టు డాక్టర్ అర్జున్ చెప్పారు.



‘స్టాండర్డ్ డిడక్షన్’ కోసం ఉద్యోగుల పట్టు



తమపై పన్ను భారాన్ని తగ్గించాలని డిమాండ్

- బడ్జెట్‌లో ఉద్యోగులకు ఊరట ఇవ్వండి
- అరుణ్ జైట్లీకి విజ్ఞప్తి చేసిన ఫిక్కీ

న్యూఢిల్లీ, జనవరి 21: ఉద్యోగులపై పన్ను భారాన్ని తగ్గించేందుకు వీలుగా వివిధ రకాల పన్నుల స్థానంలో స్టాండర్డ్ డిడక్షన్ పన్ను విధానాన్ని అవలంభించాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కి) కోరుతోంది. ఈమేరకు కొత్త బడ్జెట్‌లో మార్పులు చేయాలని కేంద్ర ఆర్థికశాఖామంత్రి అరుణ్ జైట్లీకి ఫిక్కి విజ్ఞప్తి చేసింది. ఉద్యోగుల కొనుగోలు శక్తి, ద్రవ్యోల్బణంను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది కొత్త బడ్జెట్‌లో మార్పులు చేస్తే జీతమే ఆధారంగా బ్రతికే ఉద్యోగులకు పెద్ద ఊరట లభిస్తుందని ఫిక్కి నివేదికలో



పేర్కొన్నారు. 2006వరకూ ఉన్న స్టాండర్డ్ డిడక్షన్ విధానాన్ని అప్పటి యూపీఏ ప్రభుత్వం తొలగించిందని నివేదికలో వివరించారు. కాగా దేశంలో కేవలం ఒక్కశాతం ప్రజలు మాత్రమే ఆదాయపన్ను చెల్లిస్తున్నారని, వీరిలో అత్యధికులు కేవలం ఉద్యోగులేనని ఫిక్కి స్పష్టం చేసింది. ఆదాయపన్నును ఉద్యోగులు కచ్చితంగా చెల్లిస్తున్నప్పటికి అది చాలా పెద్ద మొత్తం మాత్రం కాదు కనుక, స్టాండర్డ్ డిడక్షన్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని నివేదికలో కోరింది.

విదేశాల్లోనూ స్టాండర్డే

స్టాండర్డ్ డిడక్షన్ అనే విధానాన్ని ప్రపంచంలో పలు దేశాలు విజయవంతంగా అమలుచేస్తున్నాయి. అమెరికాలో రూ. 8.5 లక్షలవరకూ దీనికింద ఆదాయపన్ను మినహాయింపు లభిస్తూండగా, బ్రిటన్‌లో రూ. 10 లక్షలు, సింగపూర్‌లో రూ. 48,000గా ఉంది. ఇక ఉద్యోగులు, వ్యాపారులను పోల్చిచూస్తే, వ్యాపారులకే బోలెడు విషయాల్లో పన్నుచెల్లించడం నుంచి మినహాయింపు లభిస్తోంది. ఆఖరుకి మరిన్ని మెళకువలు నేర్చుకుని నైపుణ్యాన్ని పెంచుకునేందుకు ఏదైనా కోర్సులో చేరిన ఉద్యోగికి తన జేబునుంచే ఫీజు చెల్లించాల్సిన పరిస్థితులుంటే, వ్యాపారస్థులకుమాత్రం దీన్ని ఆదాయపన్ను మినహాయింపుల కింద చూపే అవకాశముండడం సబబు కాదని ప్రత్యక్ష ఉదాహరణలతో నివేదిక వివరించడం విశేషం. పైపెచ్చు ఇంటి అద్దెను చెల్లించని కొన్ని సంస్థలుండగా, ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు ఈమేరకు కూడా ఆదాయపన్ను మినహాయింపు పొందే అవకాశం లేదు. మరోవైపు, 1998 తరువాత ఇంటి అద్దెల్లో ఎటువంటి మార్పు లేకుండా హెచ్ఆర్ఏ ఉండడం ఏమాత్రం సరికాదు, ఎందుకంటే ఉద్యోగికి



కేవలం రూ. 2000 మాత్రమే అద్దెరూపంలో మినహాయింపు లభిస్తుండగా, రెండు వేల రూపాయల అద్దె ఇళ్లు లభిస్తున్న దెక్కడ అంటూ ఫిక్కి నివేదిక ప్రశ్నించింది. వైద్య ఖర్చుల నిమిత్తం ఉద్యోగికి లభించేది ఇలాంటి కాకి లెక్కల కిందికే వస్తుంది కానీ, దీంతో పావు వంతు వైద్య బిల్లులు కూడా కవర్ కావనేది ఫిక్కి వాదన. వీటన్నిటితోపాటు పొదుపు పరిమితిపై లభించే పన్నురాయితీ ని మరింత పెంచాలని, ప్రస్తుతం ఇది కేవలం రూ. 1.5 లక్షలు మాత్రమే ఉండగా, ఉద్యోగుల్లో పొదుపును ప్రోత్సహించేందుకు ఇది చాలా అవసరమని ఫిక్కి నివేదిక నొక్కి చెప్పింది.

ఉద్యోగులే ఎందుకు?

ధనికులైన స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులు, రైతులు, వ్యాపారస్తులు కాకుండా కేవలం ఆదాయపన్ను భారాన్ని ఇలా ఉద్యోగులపై మాత్రమే మోపడం సరికాదన్నది ఫిక్కి వాదన. వ్యవసాయంలో ఆర్జించే లాభాలపై ఎటువంటి పన్నులు లేకపోగా, వివిధ రూపాల్లో వీరికి రాయితీలు సైతం లభిస్తున్నాయని గుర్తు చేసింది. వ్యాపారస్తులకు టీఏ, డీఏ, పుస్తకాలు, అద్దెలు వంటి పేర్లతో బోలెడు మినహాయింపులు లభిస్తుండగా, వీరంతా నాణ్యమైన జీవితాన్ని గడిపేందుకు సహకరించేలా ఆదాయపన్ను చట్టాలుండగా, ఉద్యోగికి మాత్రం తనకు వచ్చే పరిమితమైన జీతంలో ఇలాంటి సౌలభ్యాలు లేవని నొక్కి చెప్పింది. ధరాఘాతానికి బలవుతున్న ఉద్యోగికి కేవలం కొన్నింటిపైనే పన్నుల నుంచి మినహాయింపు లభిస్తోందని నివేదికలో వివరించారు. ఉదాహరణకు ఢిల్లీలో నివసిస్తున్న ఒక ఉద్యోగికి నెలకు రూ. 1,600ను రవాణా భత్యం రూపంలో పన్నునుంచి మినహాయింపు లభిస్తోంది, మరి ఢిల్లీలాంటి మహానగరంలో కేవలం 1,600రూపాయలతో ప్రయాణించడం సాధ్యమా?

2018-19 బడ్జెట్‌లో తగ్గనున్న పన్ను స్లాబ్‌లు, రేట్లు?

- ఈవై ఇండియా ట్యాక్స్ కన్సల్టెంట్ సర్వే



న్యూఢిల్లీ: ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం 2018-19 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను స్లాబ్‌లు, రేట్లను తగ్గించనుందని, డివిడెండ్లపై ప్రస్తుతం ఉన్న ఆదాయపు పన్ను రేట్లను యథావిధిగా కొనసాగించే అవకాశాలున్నాయని ప్రముఖ ట్యాక్స్ కన్సల్టెంట్ ఈవై ఇండియా సంస్థ చేసిన ముందస్తు బడ్జెట్ సర్వేలో వెల్లడించింది. అంతేకాకుండా ఉద్యోగులపై పన్ను భారాన్ని తగ్గించేందుకు వీలుగా ఇప్పటివరకు విధిస్తూ వస్తున్న రకరకాల పన్నుల స్థానంలో ఒక స్టాండర్డ్ డిడక్షన్ పన్ను విధానాన్ని అవలంబిస్తే బాగుంటుందని 59 శాతం మంది ఉద్యోగులు భావిస్తున్నట్లు సంస్థ నివేదికలో పేర్కొంది. జనవరిలో నిర్వహించిన ఈ సర్వేలో కేవలం ప్రజల అభిప్రాయాలు మాత్రమే కాకుండా వివిధ సంస్థలకు చెందిన సీఎఫ్‌వోలు, సీనియర్ ఆర్థికవేత్తలు అభిప్రాయాలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది.

2018లో బడ్జెట్.. ఇల్లు కొనుగోళ్లపై రాయితీ ఆప్షన్లు..!

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రతిపాదనలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు మరో 9 రోజుల గడువు ఉన్నది. అయితే ఈలోగా వివిధ రంగాలు, పరిశ్రమలకు చెందిన ప్రముఖులు, నిపుణులు తమకు రాయితీలు కల్పించాలని కోరడం ఆనవాయితీ. అలాగే సొంతింటి కల సాకారం చేసుకోవాలని భావించే వారూ తమకు ఒకింత వెసులుబాటు కల్పించాలని అభ్యర్థిస్తున్నారు. 2018 – 19 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్ ప్రతిపాదనల్లో సొంతింటి కల సాకారం చేసుకోవాలని భావించే వారికి ప్రయోజనం చేకూర్చే దిశగా స్వల్ప ఊరటనిచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. బ్యాంకు రుణాల ద్వారా కొనుగోలు చేసే ఇళ్లపై వడ్డీ భారం తగ్గించాలన్న అభ్యర్థనలు వెలువడుతున్నాయి. సొంతిల్లు కట్టుకున్నవారైనా, కొనుగోలు చేసిన వారైనా ఆదాయం పన్ను చట్టం (ఐటీ యాక్ట్)లోని 80 – సీ నిబంధన కింద పన్ను చెల్లింపులో రూ.50 వేల నుంచి అంతకంటే ఎక్కువ మినహాయింపు పొందొచ్చు. ప్రస్తుతం ఇంటి రుణాలు తీసుకున్న వారికిది వర్తిస్తుంది. కొత్తగా తీసుకున్న రుణాలపై అదనపు రాయితీలు పొందే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీని ప్రకారం సొంతిల్లు కొన్న వారు తమ రుణంపై రూ.2 లక్షల వరకు వడ్డీ మినహాయింపు లభిస్తుంది. ఉదాహరణకు రూ.40 లక్షల రుణాలపై 15 ఏళ్లకు 8.35 శాతం వడ్డీ వసూలు చేశారు. తొలి రెండేళ్లలో సుమారు



రూ.3.28 లక్షలు, రూ.2.90 లక్షల వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఇటువంటి వారికి వడ్డీపై పన్ను రాయితీ ఇచ్చి వారికి వెసులుబాటు కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఇంటికి రుణం తీసుకున్నట్లైతే నిర్మాణం పూర్తి కాకముందు భాగాన్నిఐదు సమాన భాగాలుగా విభజిస్తారు. ఇందులో ఐదో వంతు వడ్డీరేటును పన్ను నుంచి మినహాయించేందుకు వీలు ఉంది. ఇంటిని పూర్తిగా స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి రుణ వసూళ్లు ప్రారంభం అవుతాయి.

పెరగనున్న స్మార్ట్ ఫోన్ల ధరలు!



న్యూఢిల్లీ: ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత మన దేశంలో స్మార్ట్ ఫోన్ల ధరలు పెరిగే అవకాశం ఉంది. మొబైల్ ఫోన్ పరికరాలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ విధించే వీలుంది. సర్క్యూట్ బోర్డులు, కెమెరా మాడ్యూల్స్, డిస్‌ప్లే తదితర విడి భాగాలపై కస్టమ్ సుంకం విధించడం వల్ల ఫోన్ల ధరలు పెరగనున్నాయి. విదేశాల నుంచి విడి భాగాలు దిగుమతి చేసుకొని మన దేశంలో అసెంబ్లింగ్ చేస్తున్న ఫోన్ల బ్రాండ్లపై ప్రభావం ఉండనుంది. దేశాన్ని ఉత్పత్తి హబ్‌గా మార్చడం కోసం తీసుకున్న నిర్ణయంలో భాగంగా ప్రభుత్వం విడి భాగాలను దిగుమతి చేసుకొని అసెంబ్లింగ్ చేస్తున్న వాటిపై కస్టమ్స్ సుంకం విధించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విడి పరికరాల దిగుమతి ఎలాంటి పన్ను వసూలు చేయడం లేదు.

ప్రభుత్వం నిర్ణయం వల్ల ఆపిల్, సామ్‌సంగ్, ఎల్‌జీ, సోనీ లాంటి కంపెనీలు విక్రయించే ఖరీదైన స్మార్ట్ ఫోన్లపై ప్రభావం పడనుంది. మిడ్ రేంజ్, బడ్జెట్ స్మార్ట్ ఫోన్లపై కూడా స్వల్పంగా ప్రభావం ఉండే అవకాశం ఉంది.

దిగుమతి చేసుకుంటున్న మొబైల్ హ్యాండ్ సెట్లపై విధిస్తోన్న కస్టమ్స్ డ్యూటీని ఆర్థిక శాఖ ఇటీవలే 10 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. దీంతో ఆపిల్ సహా అనేక బ్రాండ్లకు చెందిన ఫోన్ల ధరలు పెరగనున్నాయి.



డ్రాగన్‌ను దాటేసి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్!

న్యూఢిల్లీ: 2018 నాటికి ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించనున్నట్లు సెంటర్ ఫర్ ఎకనమిక్స్ అండ్ బిజినెస్ రిసెర్చ్ కన్సల్టెన్సీ తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. బ్రిటన్, ఫ్రాన్స్ లాంటి అగ్రదేశాలను భారత్ అధిగమించి ఐదో స్థానానికి చేరుకుంటుందని సీఈబీఆర్ నివేదిక వెల్లడించింది. తాజాగా పొరుగున ఉన్న చైనాను కూడా దాటేసి భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని, దేశీయ ఈక్విటీ మార్కెట్లు ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద మార్కెట్లుగా రూపాంతరం చెందుతాయని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ నివేదిక తెలియజేసింది. వ్యవస్థీకృత మార్పులు లేకుండా మిగతా దేశాలు తక్కువ వృద్ధిని నమోదు చేస్తుంటే దీనికి భిన్నంగా భారత్ మాత్రం ఆర్థిక సంస్కరణలతో దీర్ఘకాలిక వృద్ధిలో దూసుకుపోతోందని తెలిపింది.

2018లో డ్రాగన్‌ను దాటేసి అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుంది... దేశీయ ఈక్విటీ మార్కెట్లు ప్రపంచంలోనే ఐదో అతిపెద్దవిగా మారుతాయని నివేదిక తేటతెల్లం చేసింది. అంతేకాదు చైనా వృద్ధిరేటు మందగిస్తోందని పేర్కొంది. ఇదే సమయంలో భారత ఈక్విటీ మార్కెట్లు



6-8 శాతం కన్నా అధికంగా రాబడులు అందిస్తున్నాయని వెల్లడించింది. కానీ పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం మార్కెట్ ఎదుగుదలపై తప్పకుండా ప్రభావం చూపుతుందని స్పష్టం చేసింది. మిగతా ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు కేవలం 2 నుంచి 3 శాతం మాత్రమే వృద్ధి సాధిస్తే, భారత్ మాత్రం 7.5 శాతం లక్ష్యంగా పెట్టుకుందని నివేదిక వ్యాఖ్యానించింది.

‘నిఫ్టీ50 ప్రస్తుతం జీవితకాల గరిష్ఠంలో ఉంది. 10,490-10,580 పాయింట్ల వద్ద నిలదొక్కుకుంటే కొద్ది రోజుల్లోనే 11,200-11,500 స్థాయికి చేరుకుంటుంది. అలాగే దేశీయ మదుపర్లు ఈక్విటీ కొనుగోళ్లకు ఆసక్తి చూపడం.. 2017లో మ్యూచువల్ ఫండ్స్ రూపంలో విదేశీ పెట్టుబడుదారులు 8 బిలియన్ డాలర్లను, దేశీయ పెట్టుబడిదారులు 15 బిలియన్ డాలర్లను మదుపు చేసినట్లు నివేదిక వెల్లడించింది. ఆధార్, జన్‌ధన్ ఖాతాలు, నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను లాంటి మరెన్నో ఆర్థిక సంస్కరణలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తాయని తెలిపింది. ఇవి సరికొత్త సమ్మిళిత మౌలిక సదుపాయాలను సృష్టిస్తాయని సాంక్టమ్ వెల్త్ మేనేజ్‌మెంట్ సీఈవో శివగుప్తా తెలిపారు.

రేంజ్ రోవర్ వెలార్ ఎస్‌యూవీ విడుదల




ముంబై: రేంజ్ రోవర్ లగ్జరీ ఎస్‌యూవీల విపణిలోకి సరికొత్త వెలార్ ఎస్‌యూవీని లాంచ్ చేసింది. కొత్తగా విడుదలైన రేంజ్ రోవర్ వెలార్ ఎస్‌యూవీ ప్రారంభ ధర రూ. 78.83 లక్షలు మరియు టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ. 1.37 కోట్లు ఎక్స్-షోరూమ్‌గా ఉంది.


రేంజ్ రోవర్ వెలార్ ఇంజన్ స్పెసిఫికేషన్స్


రేంజ్ రోవర్ తమ వెలార్ ఎస్‌యూవీలో పెట్రోల్ మరియు డీజల్ రెండు ఇంజన్ ఆప్షన్‌లను అందించింది. ఇందులో 2.0 లీటర్ కెపాసిటి గల నాలుగు సిలిండర్ల పెట్రోల్ ఇంజన్ రెండు రకాల పవర్ ఉత్పత్తి చేస్తుంది.వెలార్ పెట్రోల్ బేస్ వేరియంట్ 247బిహెచ్‌పి పవర్ మరియు 365ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. కేవలం 6.7 సెకండ్ల వ్యవధిలోనే గంటకు 0 నుండి 100కిలోమీటర్ల వేగాన్ని పుంజుకోగల ఇది గరిష్టంగా 217కిమీల వేగాన్ని అందుకుంటుంది.వెలార్‌లోని పవర్‌ఫుల్ పెట్రోల్ వేరియంట్‌లో అదే 2.0-లీటర్ టుర్బోఛార్జ్‌డ్ ఇంజీనియం పెట్రోల్ ఇంజన్ ఉంది. ఇది గరిష్టంగా 296బిహెచ్‌పి పవర్ మరియు 400ఎన్ఎమ్ టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 6 సెకండ్ల వ్యవధిలో గంటకు 0 నుండి 100కిమీల వేగాన్ని అందుకునే ఇది గరిష్టంగా 234కిమీల వేగాన్ని చేరుకుంటుంది. డీజల్ ఇంజన్ విషయానికి వస్తే 2.0-లీటర్ కెపాసిటి గల నాలుగు సిలిండర్ల చిన్న డీజల్ ఇంజన్ ఉంది. ఇది 177.5బిహెచ్‌పి పవర్ మరియు 430ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. 8.9 సెకండ్ల వ్యవధిలో గంటకు 0 నుండి 100కిమీల వేగాన్ని అందుకోగల దీని గరిష్ట వేగం 189కిమీలుగా ఉంది.

వెలార్ ఎస్‌యూవీలోని టాప్ ఎండ్ డీజల్ వేరియంట్లో 3.0-లీటర్ కెపాసిటి గల టుర్బో వి6 ఇంజన్ ఉంది. ఇది 296బిహెచ్‌పి పవర్ మరియు 700ఎన్ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. కేవలం 6.5 సెకండ్ల వ్యవధిలో గంటకు 0 నుండి 100కిమీల వేగాన్ని అందుకోగల దీని గరిష్ట వేగం 241కిమీలుగా ఉంది. ల్యాండ్ రోవర్ లాంచ్ చేసిన రేంజ్ రోవర్ వెలార్ లోని అన్ని ఇంజన్ వేరియంట్లలో 8-స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ కలదు, ఇది ఇంజన్ ఉత్పత్తి చేసే పవర్ మరియు టార్క్‌ను ఆల్ వీల్ డ్రైవ్ సిస్టమ్ ద్వారా నాలుగు చక్రాలకు సరఫరా చేస్తుంది.

రేంజ్ రోవర్ లైనప్‌లో ఉన్న ఇతర మోడళ్లతో పోల్చుకంటే వెలార్ ఎస్‌యూవీ చూడటానికి కూపే స్టైల్లో ఉంటుంది. వాలుగా ఉన్న రూఫ్ లైన్ మరియు పదునుగా డిజైన్ చేయబడిన రియర్ ఎండ్ ఎస్‌యూవీకి ఒక కొత్త లుక్ తీసుకొచ్చాయి. అదే విధంగా ఎవోక్‌లో ఉన్నటువంటి విప్లవాత్మక పలుచటి హెడ్ ల్యాంప్స్ మరియు టెయిల్ ల్యాంప్స్ ఇందులో వచ్చాయి.







మనం ఆరోగ్యం
సోమవారం, 22 జనవరి 2018
www.manamnews.com

డిప్రెషన్ తగ్గించుకోండిలా...



నేటితరం యువతకు అన్ని అందుబాటులో ఉంది. అధునాతన సౌకర్యాలు, అనువైన పరిస్థితులు అన్ని వారికి అనుకూలంగానే ఉన్నాయి. ఇప్పుడున్న కుటుంబాల్లో చాలావరకు ఒక సంతానం ఉండటం వల్ల వారికి తల్లిదండ్రులు పూర్తి స్వేచ్ఛనిస్తున్నారు. కాబట్టి యూత్ ఆడింది ఆట, పాడింది పాటగా ఉంటుంది. ఇంతటి సౌకర్యవంతమైన కుటుంబాల్లో పెరిగిన యువత.. జీవితంలో మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు ఒడిదుడుకుల్ని తట్టుకోలేక పోతున్నారు. కష్టాలు వస్తున్నప్పుడు కుంగిపోయి విషాదంలోకి జారిపోతున్నారు. ఈ పరిస్థితినే డిప్రెషన్ అంటారు.

డిప్రెషన్ తలెత్తకుండా తీసుకొనే జాగ్రత్తలు చూద్దాం. కొత్త విషయాలపై ఆసక్తి పెంచుకోవాలి. హాబీలతో మానసికంగా సేద తీరవచ్చు. అందుకే చాలా పెద్ద స్థాయిలో స్థిరపడిన వారు కూడా హాబీలను వదులకోరు. చాలావరకు పుస్తకపఠనం మంచిది. ఎందుకంటే విపరీతమైన ఒత్తిడి ఉన్నప్పుడు పుస్తకాలు చదవటంతో తమ దృష్టిని మళ్లించుకోగలుగుతారు. దీంతో ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి ఉన్నప్పుడు కీలక నిర్ణయాలు తీసుకోకూడదు. కావాలంటే కొంత సేపు గ్యాప్ తీసుకొని నిదానంగా ఆలోచించి వ్యవహరించాలి. లేదంటే తప్పు మీద తప్పు జరిగి మరింత ఇబ్బంది ఏర్పడుతుంది.

రోజువారీ పనుల్లో ఆందోళనలు పెట్టుకోకూడదు. ఒకటే ఆలోచన వెంటపడి తరుముతుంటే దాని మీద నుంచి డైవర్షన్ తీసుకోవాలి. పరాజయం ఎదురైనప్పుడు కుంగిపోకూడదు. పదేపదే దాని గురించే ఆలోచించడం మంచిది కాదు. కొన్ని విషయాలు మన చేతిలో ఉంటాయి. మరి కొన్ని విషయాలు మన చేతిలో లేదన్న జీవన సత్యాన్ని గ్రహించాలి. శారీరక వ్యాయామం కూడా చాలా ముఖ్యం అని గుర్తుంచుకోవాలి. ఒకేచోట కదలకుండా కూర్చొని పని చేస్తే మెదడు మొద్దుబారిపోతుంది. అందుకని తేలికపాటి వ్యాయామాల ద్వారా రక్త ప్రసరణ వేగవంతం అవుతుంది. అప్పుడు మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

సైనసైటిస్‌తో జాగ్రత్త



ప్రతి మనిషి తన జీవితకాలంలో సైనసైటిస్ బారిన పడకుండా ఉండరు. ఈ సైనసైటిస్ వ్యాధి ఇన్ఫెక్షన్స్ వల్ల వస్తుంది. ముక్కు భాగంలో అంతరాయం ఏర్పడటానికి, ముక్కులోని టర్బినేట్లు వ్యాకోకించడం గానీ, ముక్కు భాగంలోని సెప్టమ్లు పక్కకు జరగడం గానీ, సైనస్ భాగాల్లో గానీ, కణజాలంలో వాపు ఏర్పడటం గానీ, కారణం కావచ్చు.

సైనసైటిస్ సమస్య వయోభేదం లేకుండా ఎవరికైనా రావచ్చు. కాకపోతే ఇది వర్షాకాలం, శీతలకాలంలోనే ఎక్కువగా వస్తుంది. అలర్జీ తత్వం ఉన్నవారిలోనూ, కాలుష్యాల మధ్య పనిచేసే వారిలోనూ ఈ సమస్య అధికంగా కనిపిస్తుంది. అయితే వ్యాధి ముదిరేదాకా చూడకుండా ముందే చికిత్స తీసుకోవడం వల్ల వ్యాధి నుంచి తొందరగా బయటపడవచ్చు. ఈ వ్యాధిని ముందే గుర్తించాలంటే, సైనసైటిస్ లక్షణాల గురించి తెలియాలి. ఆ లక్షణాల్లో ప్రధానంగా కనిపించేవి ఇవి..

అస్తమానం ముక్కునుండి నీరుకారం, తుమ్ములు రావడం, కోపం, చిరాకు, కళ్లలో నీరు కారడం, తలనొప్పి, ఒళ్లు వేడిగా ఉండటం, తల ముందుకు వంచితే బరువుగా అన్పించడం, ముక్కులోంచి కొన్ని ద్రవాలు గొంతులోకి జారడం, చెంపలు, నుదురు భాగాల్లో ఒత్తిడి అనిపించడం, ముఖం బరువుగా అనిపించడం, శ్వాస సరిగా ఆడక ముక్కు దిబ్బడ వేసినట్లు ఉండటం, కనుబొమ్మల మధ్య నొప్పి రావటం, ముక్కులో మంట దురదగా ఉండటం, తలనొప్పి, కళ్ల వద్ద నొప్పి అనిపించడం. వాసనలు తెలియకపోవడం, గొంతులో నొప్పిగా ఉన్నట్లు అనిపించటం. దుమ్ము, ధూళి ఏ కొంచెం సోకినా, చల్లగాలిలో తిరిగినా చాలామందికి వెంటనే తుమ్ములు రావటం జలుబు చేయటం జరుగుతుంది. జలుబు అప్పుడప్పుడు చేయడం సహజం. అలా కాకుండా సంవత్సరం పొడవునా కాలంతో సంబంధం లేకుండా దీర్ఘకాలికంగా జలుబుతో బాధపడేవారు ఎక్కువగా 'సైనసైటీస్'కు గురికావడం జరుగుతుంది. శీతాకాలంలో ఈ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి లక్షణాలు సైనసైటిస్‌ను తెలియజేస్తాయి. వైద్యుల దగ్గరకు వెళ్లటంవలన వ్యాధి తీవ్రత పెరగకుండా జాగ్రత్త పడవచ్చును. శీతల పానీయాలు, చల్లటి పదార్థాలు తీసుకోకుండా తీసుకోవాలి. దుమ్ము, ధూళి పరిసర ప్రాంతాలలోకి వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలి. తప్పనిసరిగా వెళ్లవలసి వస్తే మాస్కు తప్పనిసరిగా ధరించాలి. ప్రతిరోజు వ్యాయామం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయడంవలన వ్యాధి తీవ్రత తగ్గుతుంది.

థైరాయిడ్ గ్రంధి మన శరీరంలో జీవ క్రియలకు అత్యంత అవసరమైనది. ఇది బాగుంటేనే మనం కూడా ఆరోగ్యంగా ఉంటాం. దీని పనితీరు సరిగా లేకుంటే ఎన్నో సమస్యలు చుట్టుముడతాయి. ప్రతి ఒక్కరూ దీని పనితీరు గురించి తప్పకుండా తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిలో తేడా వస్తే మన శరీరం ఎన్నో లక్షణాల ద్వారా దాన్ని మనకు తెలియజేస్తుంది. అవేంటో తెలుసుకుంటే థైరాయిడ్ వ్యాధి భారిన పడకుండ జాగ్రత్తగా, హెల్దీగా ఉండొచ్చు.

థైరాయిడ్



థైరాయిడ్ గ్రంధి కేవలం రెండు అంగుళాలంత పరిమాణంలో మన గొంతులో ముందు భాగంలో ఉంటుంది. అచ్చం సీతాకోక చిలుక మాదిరిగా ఉంటుంది. కచ్చితంగా చెప్పాలంటే స్వరపేటిక కింద ఉంటుంది. థైరాయిడ్ గ్రంధి తల్లిగర్భంలో ఉన్న శిశువులో 14వ వారం నుంచి పనిచేయడం ప్రారంభిస్తుంది. మనకు ఆక్సిజన్ ఎలా ప్రాణావసరమో, థైరాయిడ్ గ్రంధికి కూడా ఐయోడిన్ అంతే అవసరం. తల్లి గర్భంలోని శిశువులో ఈ గ్రంధి తొలుత నాలుక వెనుక భాగంలో అభివృద్ధి చెందుతుంది. ఆ తర్వాత దానంతట అదే బిడ్డ ఎదుగుతున్న కొద్దీ స్వరపేటిక కింది భాగంలోకి వెళ్లిపోతుంది. తల్లి గర్భం నుంచి భూమ్మీదకు వచ్చేనాటికి పూర్తిగా మెడ ముందు భాగంలోకి వచ్చేయాలి. చాలా అరుదైన సందర్భాల్లో ఇది నాలుక వెనుక భాగంలోనే ఆగిపోవడం లేదా మెడ పై భాగంలో నిలిచిపోవడం జరుగుతుంది. అలాగే అరుదుగా ఇది ఛాతీ భాగం వరకూ వెళ్లిపోతుంది.



పనితీరు..

మనం తీసుకునే ఐయోడిన్ ఉప్పు సహా పలు ఆహార పదార్థాల నుంచి అందే అయోడిన్ సాయంతో థైరాయిడ్ గ్రంధి పనిచేస్తుంటుంది. ఇది పనిచేయాలంటే అయోడిన్ తప్పనిసరి. ఈ గ్రంధి ఐయోడిన్‌ను గ్రహించి దాన్ని థైరాయిడ్ హార్మోన్‌లుగా మారుస్తుంది. థైరాక్సిన్ (టీ4), ట్రై అయోడోథైరాయిన్ (టీ3) అన్నవి థైరాయిడ్ హార్మోన్లు. మన శరీరంలో థైరాయిడ్ కణాలు ఐయోడిన్ తోపాటు అమైనో యాసిడ్ అయిన టైరోసిన్ సాయంతో టీ3, టీ4ను ఉత్పత్తి చేస్తాయి. ఈ టీ3, టీ4 రక్త ప్రవాహం ద్వారా శరీరమంతటా వ్యాప్తిస్తాయి. దాంతో ఇవి జీవక్రియలను నియంత్రిస్తాయి. కేలరీలను శక్తిగా మార్చేందుకు ఇవి చాలా అవసరం. ప్రొటీన్, ఫ్యాట్, కార్బోహైడ్రేట్‌లను టీ3, టీ4 నియంత్రిస్తాయి. ఓ కణం ఎంత మేరకు శక్తిని తీసుకోవాలన్నది వీటిపైనే ఆధారపడి ఉంటుంది.

థైరాయిడ్ హార్మోన్ల స్థాయిలను బట్టే కణాలు జీవక్రియలను నియంత్రించడం ఆధారపడి ఉంటుంది. సాధారణంగా థైరాయిడ్ గ్రంధి 80 శాతం టీ4ను, 20 శాతం టీ3ని ఉత్పత్తి చేస్తుంది. టీ4 కంటే టీ3 నాలుగు రెట్ల అధిక శక్తిమంతం. ఇక పిట్యూటరీ గ్రంధి నియంత్రణలో థైరాయిడ్ గ్రంధి పనిచేస్తుంటుంది. పిట్యూటరీ గ్రంధి వేరుశనగ గింజ పరిమాణంలో మెదడులో ఉంటుంది. థైరాయిడ్ హార్మోన్లు టీ3, టీ4 మరీ తక్కువ స్థాయికి పడిపోయినప్పుడు పిట్యూటరీ గ్రంధి థైరాయిడ్ ఉత్ప్రేరక హార్మోన్ (టీఎస్ హెచ్)ను విడుదల చేస్తుంది. అప్పుడు థైరాయిడ్ గ్రంధి మరింతగా హార్మోన్‌లను ఉత్పత్తి చేసేలా టీఎస్ హెచ్ ప్రేరేపిస్తుంది. టీఎస్ హెచ్ ఇచ్చిన బూస్ట్‌తో థైరాయిడ్ గ్రంధి టీ3, టీ4 హార్మోన్‌లను మరింతగా విడుదల చేస్తుంది. థైరాయిడ్ గ్రంధి తిరిగి టీ3, టీ4 హార్మోన్‌ల ఉత్పత్తిని పెంచిన తర్వాత ఆ విషయాన్ని పిట్యూటరీ గ్రంధి గ్రహించి టీఎస్ హెచ్ విడుదలను తగ్గించేస్తుంది. రక్తంలో టీ3, టీ4 స్తాయులు అధిక స్థాయికి చేరాయని గుర్తిస్తే పిట్యూటరీ గ్రంధి టీఎస్ హెచ్ విడుదలను తగ్గిస్తుంది. ఇక పిట్యూటరీ గ్రంధిని మెదడులోని హైపోథాలమస్ అనే గ్రంధి నియంత్రిస్తుంది. ఇది టీఎస్ హెచ్‌ను విడుదల చేయడానికి అవసరమైన టీఆర్ హెచ్ అనే హార్మోన్‌ను విడుదల చేస్తుంది. ఈ టీఆర్ హెచ్ సాయంతో పిట్యూటరీ గ్రంధి టీఎస్ హెచ్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఏదైనా వ్యాధి లేదా పిట్యూటరీ గ్రంధిలో గడ్డలు ఏర్పడితే అది థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావాన్ని చూపిస్తుంది.

టీ3, టీ4 పెరిగితే (హైపర్ థైరాయిడిజం)


ఆందోళన, చిరాకు, మూడీగా ఉండడం, అధికంగా చెమట పట్టడం, గుండె స్పందనల వేగం పెరిగిపోవడం (పాల్పిటేషన్స్), అధిక ఉష్ణోగ్రతలకు తట్టుకోలేని సున్నితత్వం, చేయి వణకడం, బరువు తగ్గడం, జుట్టు రాలడం, నెలసరి క్రమం తప్పడం లేదా రుతుచక్రాలు చిన్నవిగా మారడం వంటివి థైరాయిడ్ హార్మోన్లు తగ్గితే కనిపిస్తాయి. థైరాయిడ్, కార్డియో వాస్కులర్ వ్యవస్థలకు సన్నిహిత సంబంధాలున్నాయి. అందుకే థైరాయిడ్ హార్మోన్‌ల వ్యవస్థ గతితప్పితే వెంటనే గుండెపై ప్రభావం చూపిస్తుంది. హైపర్ థైరాయిడిజం సమస్యను నివారించేందుకు థైరాయిడ్ అధిక ఉత్పత్తిని నివారించే మందులను వైద్యులు సూచిస్తారు. కొన్ని సందర్భాల్లో థైరాయిడ్ కేన్సర్, గొంతు కేన్సర్లలో రేడియేషన్ థెరపీ కారణంగా థైరాయిడ్ గ్రంధిని పూర్తిగా తొలగించాల్సి వస్తుంది. సర్జరీ ద్వారా థైరాయిడ్ గ్రంధిని పాక్షికంగా, లేదా పూర్తిగా తొలగించే అవకాశం లేకపోలేదు.

టీ3, టీ4 స్థాయులు తగ్గితే (హైపో థైరాయిడిజం)

నిద్రకు సంబంధించిన సమస్యలు, అలసిపోవడం, ఏకాగ్రత లోపించడం లేదా దృష్టి నిలపలేకపోవడం, డ్రై స్కిన్ లేదా హెయిర్, ఒత్తిడి, శీతల వాతావరణం పడకపోవడం, తరచుగా, అధిక రక్తస్రావంతో కూడిన రుతుచక్రాలు, కీళ్ల, కండరాలలో నొప్పులు సమస్యలు ఎదురవుతాయి. అలాగే, జుట్టు రాలడం, జ్ఞాపకశక్తి క్షీణించడం, గుండె రేటు తగ్గడం, మలబద్ధకం వంటి సమస్యలు కనిపిస్తాయి. దీనికి చికిత్సగా థైరాక్సిన్ హార్మోన్ సింథటిక్ డ్రగ్‌ను వైద్యులు సూచించొచ్చు. ఇలా మందులు సూచిస్తే జీవిత కాలం పాటు వాడాల్సి ఉంటుంది. సాధారణంగా పురుషుల కంటే మహిళలపై ఇది ఎక్కువ ప్రభావం చూపుతుంది. మరీ ముఖ్యంగా 60 ఏళ్లు దాటిన మహిళల్లో ఎక్కువగా కనిపించే సమస్య ఇది. ఐయోడిన్ లోపం వల్ల రావచ్చు. లేదా రోగ నిరోధక వ్యవస్థకు సంబంధించి హషిమోటోస్ థైరాయిడైటిస్ వల్ల కూడా కావచ్చు. ఇందులో బ్యాక్టీరియా నుంచి రక్షణ కల్పించాల్సిన యాంటీబాడీలు థైరాయిడ్ గ్రంధిని బయటి శక్తిగా పొరపడి దానిపై దాడి చేయడం వల్ల పనితీరు దెబ్బతింటుంది.

పెద్ద వయసులో...


60 ఏళ్లు దాటిన వారిలో థైరాయిడ్ సమస్యలు కనిపిస్తుంటాయి. పెద్ద వయసు కావడంతో హార్మోన్ ఉత్పత్తిలో తేడా రావడం, పలు మందుల దుష్ప్రభావాలు, గుండె, గ్యాస్ట్రోఇంటెస్టినల్, నరాల సంబంధిత సమస్యల వల్ల కూడా ఇలా జరుగుతుంది. అయితే, పెద్ద వయసు వారిలో థైరాయిడ్ సమస్య ఉందని గుర్తించడం మామూలుగా కష్టం. ఈ తరహా సమస్యలుంటే రక్తపరీక్ష చేయించుకుని చికిత్స తీసుకుంటే ఆరోగ్యంతో కూడిన ఆయుర్దాయాన్ని పెంచుకోవచ్చు.



జీవ క్రియల్లో కీలకం

శ్వాసతీసుకోవడం, గుండె రేటు, శరీర బరువు, కండరాల బలం, రుతుచక్రం, శరీర ఉష్ణోగ్రత, కొలెస్టరాల్ (కొవ్వు) స్థాయిలు, కేంద్ర నాడీ వ్యవస్థల పనితీరును థైరాయిడ్ గ్రంధి నియంత్రిస్తుంది. టీ3, టీ4 హార్మోన్లు రక్తం ద్వారా శరీరంలోని ప్రతీ కణాన్ని చేరతాయి.

తద్వారా జీవక్రియల వేగాన్ని నియంత్రిస్తాయి. ఉదాహరణకు గుండె ఎంత వేగంతో కొట్టుకోవాలి, తీసుకున్న ఆహారాన్ని జీర్ణవ్యవస్థ ఎంత వేగంగా ప్రాసెస్ చేయాలి అనేవి థైరాయిడ్ హార్మోన్లు అయిన టీ3, టీ4 పైనే ఆధారపడి ఉంటాయి. ఒకవేళ ఈ జంట థైరాయిడ్ హార్మోన్‌ల స్థాయిలు తగ్గాయనుకోండి... గుండె రేటు కూడా సాధారణం కంటే తక్కువకు పడిపోతుంది. మలబద్దకం, బరువు పెరగడం ఇలా ఎన్నో సమస్యలు చుట్టుముడతాయి. అదే టీ3, టీ4 అధిక స్థాయిలకు చేరితే గుండె రేటు పెరిగిపోతుంది. డయోరియా, బరువు కోల్పోతారు. కేలరీలు ఏ స్థాయిలో ఖర్చవ్వాలన్నది ఇవే నిర్ణయిస్తాయి. కేలరీల వినియోగాన్ని బట్టే బరువు పెరగడం, తరగడం ఆధారపడి ఉంటుందని తెలుసుకోవాలి. మన దేశంలో ప్రతీ 10 మందిలో ఒకరు థైరాయిడ్ సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు.



గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలి

శిశువుకు కావాల్సిన అయోడిన్ తల్లి నుంచే వెళ్లాలి. శిశువు మెదడు సాధారణంగా అభివృద్ధి చెందాలంటే అందుకు థైరాయిడ్ హార్మోన్లు అవసరం. అందుకే గర్భిణులు తమ ఆహారంలో నిర్ణీత పరిమాణం మేర అయోడిన్ అందేలా చూసుకోవాలి. అప్పుడే శిశువులో థైరాయిడ్ హార్మోన్ పరంగా సమస్యలు రాకుండా నివారించుకోవచ్చు. ఒక్క థైరాయిడ్ హార్మోన్ ఎన్నో రకాల ఎదుగుదలకు కీలకం. గర్భిణుల్లో థైరాయిడ్ హార్మోన్లు తగ్గితే అంటే హైపోథైరాయిడిజం కారణంగా శిశువుకు ఐక్యూ సమస్యలతోపాటు మానసిక ఎదుగుదల లోపం కూడా ఎదురుకావచ్చని పలు వైద్య పరిశోధనల్లో వెల్లడైంది. అందుకే గర్భంతో ఉన్నవారు తన కోసం, తన గర్భంలోని శిశువు కోసం తగినంత మోతాదులో ఐయోడిన్ అందేలా చూసుకోవాలి. శిశువు ప్రసవించిన తర్వాత మొదటి 30 నిమిషాల్లోపలే వారిలో టీఎస్ హెచ్ స్థాయిలు బాగా పెరిగిపోతాయి. అయినప్పటికీ తల్లిలోని థైరాయిడ్ హార్మోన్ వారికి రక్షణనిస్తుంది. కానీ ప్రతీ 4000 మందిలో ఒక శిశువు కంజెన్షియల్ హైపోథైరాయిడిజం (పుట్టుకతో) సమస్యతో జన్మిస్తారు. థైరాయిడ్ గ్రంధి డెవలప్ కాకపోవడం వల్ల ఈ



సమస్య ఏర్పడుతుంది. దీంతో థైరాయిడ్ హార్మోన్లు ఉత్పత్తి కాకపోవడం లేదా అయోడిన్ లోపం వల్ల ఇలా జరగడానికి అవకాశం ఉంది. చికిత్స ద్వారా దీన్ని నయం చేయవచ్చు. దీన్ని గుర్తించకుండా, చికిత్స చేయకుండా వదిలేస్తే హైపో థైరాయిడిజం వల్ల చిన్నారిలో ఎదుగుదల లోపం, శాశ్వత మేధోపరమైన సామర్థ్యలోపానికి దారితీస్తుంది. అందుకే నేడు ఆస్పత్రుల్లో ప్రసవానంతరం ప్రతీ శిశువుకు టీఎస్ హెచ్ టెస్ట్ చేయడం తప్పనిసరిగా అమలు చేస్తున్నారు.

యుక్తవయసుపై

థైరాయిడ్ సమస్య ఉంటే యుక్తవయసు రాక ఆలస్యమవుతుంది. మన శరీరంలో వయసుకు తగ్గ మార్పులు వస్తుంటాయని తెలుసు. ఉదాహరణకు యవ్వన దశలో స్త్రీలలో రుతుచక్రం ప్రారంభం అవుతుంది. పునరుత్పత్తి వ్యవస్థ తన పనితీరును ప్రారంభించేది ఈ దశలోనే. దానికి తగ్గట్టు శరీరంలోనూ మార్పులు చోటు చేసుకుంటాయి. మరి వీటన్నింటికీ థైరాయిడే కీలకం. ఇది లోపిస్తే యవ్వనదశ ప్రారంభం ఆలస్యం అవుతుంది. లేదా బలహీనంగా ఆలస్యంగా మొదలవుతుంది. ఇది తదుపరి శారీరక నిర్మాణం, సామర్థ్యంపైనా ప్రభావం చూపిస్తుంది. నెలసరి క్రమ పద్ధతి లోపించడం, అధిక రక్తస్రావం కావడం వంటివి కనిపిస్తాయి.



మనం స్పోర్ట్స్
సోమవారం, 22 జనవరి, 2018
www.manamnews.com



టీమిండియాకు హర్భజన్ మద్దతు

న్యూఢిల్లీ: మరో టెస్ట్ మిగిలుండగానే దక్షిణాఫ్రికా చేతిలో 2-0తో సిరీస్ కోల్పోయిన టీమిండియాకు స్పిన్నర్ హర్భజన్ సింగ్ మద్దతు తెలిపాడు. సఫారీలతో సిరీస్‌కు ముందు భారత్‌లో శ్రీలంకతో జరిగిన సిరీస్‌తో భారత్‌కు ఒరిగిందేమీ లేదని అదో చెత్త సిరీస్ అని భజ్జీ అభిప్రాయపడ్డాడు. దక్షిణాఫ్రికా గడ్డపై ఆ జట్టు చేతిలో సిరీస్ ఓడిన విరాట్ కోహ్లీ సేన వైట్ వాష్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయంటూ కొందరు మాజీలు చెబుతుండగా భజ్జీ మాత్రం భారత్‌కు మద్దతు తెలపాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నాడు.

'సఫారీలతో సిరీస్‌కు ముందు స్వదేశంలో లంకతో సిరీస్ వల్ల కోహ్లీ సేన నేర్చుకున్నదేం లేదు. లంకేయులు ఈజీగా ఓటమిని అంగీకరించారు. దాంతో భారత క్రికెట్ జట్టుకు ఒరిగిందేమీ లేదు. బీసీసీఐ సూచించినట్లుగా కొందరు టెస్ట్ స్పెషలిస్ట్ ఆటగాళ్లు కొన్ని రోజుల ముందే దక్షిణాఫ్రికాకు వెళ్లి ప్రాక్టీస్ చేసి ఉంటే మెరుగైన ఫలితాలు వచ్చేవి. లేనిపక్షంలో కనీసం ధర్మశాలలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడినా బాగుండేది. చల్లగా ఉండే ఆ మైదానం ఎంతో ఎత్తులోనూ ఉంటుంది. దక్షిణాఫ్రికా పిచ్‌ల తరహాలోనే స్వింగ్, సీమ్, బౌన్స్‌కు అనుకూలిస్తుంది. రహానేకు చోటు దక్కకపోవడంపై విమర్శిస్తున్నారు. కానీ నాణ్యమైన ఆటగాళ్లు ఉన్నప్పుడు ఎవరి చోటుపై గ్యారంటీ ఉండదని ఆటగాళ్లు, విమర్శకులు గ్రహించాలి. రోహిత్ స్థానంలో రహానేను తీసుకున్నా భారత్ 0-2తో ఓడితే అప్పుడు విమర్శలు మరోలా ఉండేవి. కోహ్లీ కెప్టెన్సీలో 30 టెస్టులాడిన రహానే సగటు 40 కంటే తక్కువన్న విషయం గుర్తు పెట్టుకోండి. భువనేశ్వర్ కుమార్‌ను పక్కనపెట్టడం మాత్రం నన్ను బాధించింది. భువీ రాణించిన ప్రతిసారీ జట్టు గెలుపొందింది. ఇషాంత్ కంటే భువీనే నా దృష్టిలో బెస్ట్ చాయిస్. చివరి టెస్టులో విజయంతో సిరీస్‌ను 1-2తో ముగిస్తుందని' భావిస్తున్నట్లు హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు.



క్వార్టర్స్‌లో నాదల్, వోజ్నియాకి

డిమిత్రోవ్, సిలిక్ గెలుపు, ఆస్ట్రేలియా ఓపెన్



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్పెయిన్ యోధుడు రఫెల్ నాదల్, డెన్మార్క్ కరొలిన్ వోజ్నియాకి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. మూడో గ్రిగర్ డిమిత్రొవ్ (బల్గేరియా), ఆరోసీడ్ మారిన్ సిలిక్ (క్రొయేసియా) కూడా ప్రిక్వార్టర్ ఫైనల్ సమరంలో విజయం సాధించారు. అయితే కిర్గియాన్ (ఆస్ట్రేలియా), అనెట్ కొంటావెట్ (ఇస్టోనియా) నాలుగో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్ సమరంలో టాప్ సీడ్ నాదల్ 6-3, 7-6, 4-6, 7-6 తేడాతో అర్జెంటీనా ఆటగాడు డిగోస్చ్వార్ట్‌జ్‌మన్‌ను ఓడించాడు. ఈ టోర్నమెంట్‌లో తొలిసారి నాదల్‌కు కాస్త గట్టిపోటీ ఎదురైంది. అయినా చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకుంటూ నాదల్ మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. తొలి సెట్‌ను సునాయసంగా గెలుచుకున్న నాదల్‌కు తర్వాతి సెట్‌లో ప్రత్యర్థి నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. డిగో అద్భుత పోరాట పటిమ కనబరచడంతో సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లింది. కానీ, కీలక సమయంలో డిగో ఒత్తిడికి గురయ్యాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న నాదల్ సెట్‌ను కైవసం చేసుకున్నాడు. కాగా, నాలుగో సెట్‌లో మాత్రం నాదల్‌కు ఓటమి తప్పలేదు. డిగో అద్భుతంగా ఆడి సెట్‌ను దక్కించుకున్నాడు. నాలుగో సెట్‌లో కూడా పోరు నువ్వానేనా అన్నట్టు సాగింది. ఈ సెట్ టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఒక దశలో డిగో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. కానీ, నాదల్ కీలక సమయంలో పుంజుకున్నాడు. తన మార్క్ షాట్లతో ప్రత్యర్థిని హడలెత్తిస్తూ మ్యాచ్‌ను సొంతం చేసుకుని క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు.

వోజ్నియాకి అలవోకగా..

మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ వొజ్నియాకి సునాయాస విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. స్లావేకియా క్రీడాకారిణి రైబరికొవాతో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో వోజ్నియాకి 6-3, 6-2తో విజయం సాధించింది. ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన వోజ్నియాకి ఏ దశలోనూ ప్రత్యర్థిని కోలుకోనివ్వలేదు. తన మార్క్ షాట్లతో రైబరికొవాను హడలెత్తించింది. వొజ్నియాకి దూకుడుకు ప్రత్యర్థి వద్ద సమాధానమే లేకుండా పోయింది. చివరి వరకు పూర్తి ఆధిపత్యం చెలాయించిన మాజీ నంబర్‌వన్ వోజ్నియాకి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. మరో ప్రిక్వార్టర్ ఫైనల్ సమరంలో కార్లా సౌరెజ్ నవేరా (స్పెయిన్) విజయం సాధించింది. మూడు సెట్ల సమరంలో 4-6, 6-4, 8-6 తేడాతో ఇస్టోనియా క్రీడాకారిణి కొంటావెట్‌ను ఓడించింది. నువ్వానేనా అన్నట్టు సాగిన మారథాన్ సమరంలో కార్లా అసాధారణ ఆటతో విజయాన్ని అందుకుంది. మరోవైపు క్రొయేసియా క్రీడాకారిణి పెట్రా మ్యాట్రిక్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లో జయకేతనం ఎగురవేసింది. బెల్జియం క్రీడాకారిణి ఎలిసె మెర్టెన్స్‌పై మ్యాట్రిక్ విజయం సాధించింది. నువ్వానేనా అన్నట్టు సాగిన సమరంలో మ్యాట్రిక్ 7-6, 7-5తో విజయాన్ని అందుకుంది.

చెమటోడ్చిన డిమిత్రొవ్..



మరోవైపు మూడో సీడ్ డిమిత్రొవ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో చెమటోడ్చాడు. ఆస్ట్రేలియా ఆటగాడు, 17వ సీడ్ నిక్ కిర్గియస్‌తో జరిపిన ఉత్కంఠ పోరులో డిమిత్రొవ్ విజయం సాధించాడు. చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో డిమిత్రొవ్ 7-6, 7-6, 4-6, 7-6 తేడాతో కిర్గియాస్‌ను ఓడించాడు. తొలి సెట్‌లలో పోరు టైబ్రేకర్ వరకు వెళ్లింది. ఇద్దరు కూడా ప్రతి పాయింట్ కోసం సర్వం ఒడ్డారు. దీంతో పోరు యుద్ధాన్ని తలపించింది. కాగా, తొలి రెండు సెట్‌లలో డిమిత్రొవ్ దక్కించుకున్నాడు. కానీ, మూడో సెట్‌లో స్థానిక ఆటగాడు కిర్గియాస్ విజయం సాధించాడు. అద్భుత షాట్లతో డిమిత్రొవ్‌ను హడలెత్తించిన కిర్గియాస్ 6-4తో సెట్‌ను సొంతం చేసుకున్నాడు. నాలుగో సెట్‌లో కూడా ఇద్దరి మధ్య హోరాహోరి పోరాటం కొనసాగింది. కానీ కీలక సమయంలో కిర్గియాస్ ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. దీన్ని తనకు అనుకూలంగా మార్చుకున్న డిమిత్రొవ్‌తో సెట్‌తో పాటు మ్యాచ్‌ను గెలిచి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాడు.

సిలిక్ ముందుకు..

క్రొయేసియా స్టార్, ఆరో సీడ్ మారిన్ సిలిక్ కూడా పురుషుల సింగిల్స్‌లో క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. ఆదివారం జరిగిన నాలుగో రౌండ్‌లో సిలిక్ స్పెయిన్ ఆటగాడు కరెనొ బుస్టా (స్పెయిన్)ను ఓడించాడు. నాలుగు సెట్ల సమరంలో సిలిక్ 6-7, 3-7, 7-6, 7-6 తేడాతో విజయం సాధించాడు. తొలి సెట్‌ను కోల్పోయిన సిలిక్ తర్వాత చెలరేగి ఆడాడు. వరుసగా మూడు సెట్‌లు గెలిచి ప్రత్యర్థిని మట్టి కరిపించాడు. మరోవైపు బుస్టా కూడా గెలుపు కోసం చివరి వరకు పోరాడాడు. రెండు సెట్లను టైబ్రేకర్ వరకు తీసుకెళ్లాడు. అయినా సిలిక్ తన అపార అనుభవాన్ని ఉపయోగించి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

లియాండర్ జోడీకి షాక్

పురుషుల డబుల్స్‌లో లియాండర్ పేస్, పురావ్ రాజా (భారత్) జంటకు మూడో రౌండ్‌లోనే షాక్ తగిలింది. ఆదివారం జరిగిన మూడో రౌండ్‌లో కొలంబియాకు చెందిన 11వ సీడ్ జువాన్ సెబస్టియన్, రాబర్ట్ ఫరా జంట చేతిలో ఓటమి పాలైంది. ఏకపక్షంగా సాగిన పోరులో పేస్ జోడి కనీస ప్రతిఘటన ఇవ్వకుండానే చేతులెత్తేసింది. మరోవైపు ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన కొలంబియా జంట 6-1, 6-2తో సునాయాస విజయాన్ని అందుకుంది.



తమిళనాడుపై ఢిల్లీ ఘన విజయం

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 క్రికెట్



కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ టీ20 క్రికెట్ సూపర్ లీగ్‌లో తమిళనాడుపై ఢిల్లీ ఘన విజయం సాధించింది. ఇక్కడి ఈడెన్ గార్డేన్‌లో ఆదివారం గ్రూప్-బిలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 145/7 పరుగులు చేసింది. తమిళనాడులో కెప్టెన్ వి. శంకర్ (57) అజేయ అర్ధ శతకంతో రాణించాడు. ఢిల్లీలో చెలరేగి బౌలింగ్ చేసిన ఖెజ్రోలియా 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 15.2 ఓవర్లలో కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 146 పరుగులు చేసి 8వికెట్లతో భారీ విజయాన్ని నమోదు చేసుకుంది. ఢిల్లీలో రిషబ్ పంత్ విధ్వంసకర బ్యాటింగ్‌తో 33 బంతుల్లోనే 7 ఫోర్లు 3 సిక్స్‌లతో 58 పరుగులు చేశాడు. చివర్లో రాణా (34) కూడా దూకుడుగా ఆడడంతో ఢిల్లీ పెద్ద విజయాన్ని అందుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన తమిళ్నాడు ఆరంభంలోనే 29 పరుగుల వద్ద వరుసగా రెండు వికెట్లు కోల్పోయింది. దూకుడుగా ఆడుతున్న వాషింగ్‌టన్ సుందర్ 9 బంతుల్లో 2 ఫోర్లతో 10 పరుగులు చేసి సంగ్వాన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే గంగా శ్రీధర్ రాజు (0) ఖాతా తెరువకుండానే పెవిలియన్ చేరుకున్నాడు. అనంతరం భరత్ శంకర్, బి. అపరజిత్ కలిసి తమిళనాడు ఇన్నింగ్స్‌ను ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, జట్టు స్కోరు 37 పరుగుల వద్ద తమిళ్నాడుకు మరో షాక్ తగిలింది. వేగంగా ఆడుతున్న భరత్ కుమార్ 17 బంతుల్లో 5 ఫోర్లతో 24 పరుగులను ఖెజ్రోలియా అద్భుత బంతితో వెనుకకు పంపాడు. దీంతో తమిళ్నాడు 5.1 ఓవర్లలోనే మూడో వికెట్ కోల్పోయింది. అనంతరం వచ్చిన కెప్టెన్ వి. శంకర్‌తో కలిసి అపరజిత్ తమిళ్నాడు ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరూ ఒకవైపు వేగంగా ఆడుతూనే మరోవైపు వికెట్‌ను కూడా కాపాడుకుంటూ ఆడారు. వీరిద్దరూ అవకాశం దొరికినప్పుడల్లా బౌండరీలు బాదుతూ స్కోరుబోర్డును ముందుకు సాగించారు. ఈ క్రమంలోనే తమిళ్నాడు 12.5 ఓవర్లలో 100 పరుగులు మార్కును పూర్తి చేసుకుంది. మరోవైపు ఢిల్లీ బౌలర్లు కూడా చక్కనైన లైన్ అండ్ లెన్త్‌తో కట్టు దిట్టమైన బౌలింగ్ చేశారు. ఈ సమయంలోనే కీలక ఇన్నింగ్స్ ఆడుతున్న అపరజీత్ 32 బంతుల్లో 7 ఫోర్లతో 45 పరుగులు చేసి ఖెజ్రోలియా బౌలింగ్‌లో వెనుదిరిగాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు కీలక మైన 92 పరుగులు జోడించారు. అనంతరం కెప్టెన్ శంకర్ 42 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. చివరి వరకు అజేయంగా నిలిచిన విజయ్ శంకర్ 48 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 57 పరుగులు చేసి నాటౌట్ నిలిచాడు. దీంతో తమిళనాడు 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. ఢిల్లీ బౌలర్లలో ఖెజ్రోలియా 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఢిలీకు శుభారంభమే లభించింది. ఓపెనర్లు తొలి వికెట్‌కు 5.3 ఓవర్లలో 43 పరుగులు జోడించారు. అనంతరం సీనియర్ బ్యాట్స్‌మన్ గౌతమ్ గంభీర్ 21 బంతుల్లో 2 ఫోర్లు, ఒక సిక్స్‌తో 21 పరుగులు చేసి వెనుదిరిగాడు. అనంతరం రిషబ్ పంత్, ధ్రువ్ శోరేలు ఢిల్లీ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. ధ్రువ్ కుదురుగా ఆడుతుంటే రిషబ్ పంత్ మాత్రం విధ్వంసకర బ్యాటింగ్ చేశాడు. ప్రత్యర్థి బౌలర్లను ఉతికి ఆరేశాడు. బౌండరీల మీద బౌండరీలు కొడుతూ 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. అనంతరం ఇతను వాషింగ్‌టన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన రిషబ్ పంత్ 33 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 58 పరుగులు చేసి వెనుదిరిగాడు. తర్వాత మిగిలిన లక్ష్యాన్ని ధ్రువ్, నిశత్ రాణాలు అజేయంగా పూర్తి చేశారు. దీంతో ఢిల్లీ మరో 18 బంతులు మిగిలుండగానే కేవలం 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. చివర్లో నితిశ్ రాణా 14 బంతుల్లోనే 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 34 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు ధ్రువ్ కూడా (24) పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. ఢిల్లీ 15.2 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. వాషింగ్‌టన్ సుందర్ 2 వికెట్లు పడగొట్టాడు.

ఉత్కంఠ మ్యాచ్‌లో పంజాబ్ విజయం

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ సూపర్ లీగ్ గ్రూప్-ఏ మ్యాచ్‌లో పంజాబ్ జట్టు ఉత్కంఠకర విజయం సాధించింది. కర్ణాటకపై సూపర్ ఓవర్‌లో గెలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఆ జట్టు సారథి సీఎం గౌతమ్ (36), అనిరుధ్ (40 నాటౌట్, 19 బంతుల్లో) రాణించాడు. ఛేదనకు దిగిన పంజాబ్ 7 వికెట్లు నష్టపోయి 158 పరుగులే చేసింది. మన్‌దీప్‌సింగ్ (45), సారథి హర్భజన్ సింగ్ (33), యువరాజ్ సింగ్(29) రాణించారు. రెండు జట్ల స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్ ఆడించారు.

సూపర్ ఓవర్‌లో ఉత్కంఠ

సూపర్ ఓవర్‌లో పంజాబ్ తొలుత బ్యాటింగ్ చేసింది. మన్‌దీప్ (10, 4 బంతుల్లో 1-6), యువరాజ్ (5, 2 బంతుల్లో 1-4) 250 స్ట్రైక్‌రేట్‌తో 15 పరుగులు చేశారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటకను పంజాబ్ బౌలర్ సిద్ధార్థ్ కౌల్ 11 పరుగులకే పరిమితం చేశాడు. ఒక వికెట్ తీశాడు. కరుణ్‌నాయర్ (8, 5 బంతుల్లో 1-4), అనిరుధ్ (2, 2 బంతుల్లో) కర్ణాటకకు విజయం అందించలేకపోయారు.



ముంబై చేతిలో జార్ఖండ్ ఓటమి



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సూపర్ లీగ్ టీ20లో భాగంగా జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో జార్ఖండ్ 13 పరుగుల తేడాతో ముంబై చేతిలో ఓటమి పాలైంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 170/5 పరుగులు చేసింది. ముంబైలో సిద్దేశ్ లాడ్, సారథి ఆదిత్య తారె, అద్భుత బ్యాటింగ్‌తో రాణించారు. ఒక దశలో 35 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన ముంబైకు వీరు ఆదుకున్నారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన సిద్దేశ్ లాడ్ 33 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 46 పరుగులు చేశాడు. మరోవెపు ఆదిత్య తారే 30 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 45 పరుగులు చేశాడు. చివర్లో సూర్య కుమార్ యాదవ్ 15 బంతుల్లోనే 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు, శివం దూబె (20 నాటౌట్) తన వంతు సహకారం అందించాడు. దీంతో ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన జార్ఖండ్‌లో విరాట్ సింగ్ 49 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 81 పరగులతో చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. కానీ, తమ జట్టుకు విజయం అందించలేక పోయాడు. ఇతర బ్యాట్స్‌మన్ సౌరభ్ తివారి (32) తప్ప మిగతా వారు విఫలమవ్వడంతో జార్ఖండ్ 20 ఓవర్లలో 157/7 పరుగులు మాత్రమే చేయగలిగింది. ముంబై బౌలర్లలో పార్కర్ 2 వికెట్లు తీశాడు.

ఫైనల్లో భారత్ ఓటమి

2-1తో బెల్జియం విజయం, నాలుగు దేశాల హాకీ టోర్నీ



తౌరంగ (న్యూజిలాండ్): బెల్జియం చేతిలో భారత్ మరోసారి పరాజయం పాలైంది. నాలుగు దేశాల ఆహ్వానిత టోర్నీలో భాగంగా జరిగిన ఉత్కంఠ భరిత తొలి దశ తుదిపోరులో టీమిండియా 1-2తో ఓటమి ఛవిచూసింది. బెల్జియం ఆటగాళ్లు టామ్ బూన్ (4 ని.), సెబాస్టియన్ డాకిర్ (36 ని.) గోల్స్ చేశారు. భారత్ తరపున మన్‌దీప్ సింగ్ (19 ని.) ఒక్కడే గోల్ చేశాడు.

తుది పోరులో రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే బెల్జియంకు పెనాల్టీ కార్నర్ లభించింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్న ప్రత్యర్థి జట్టు గోల్ చేసింది. ఆ తర్వాత రెండు జట్లు బంతిని అధీనంలో ఉంచుకునేందుకు పోటీపడ్డాయి. రెండో క్వార్టర్‌లో టీమిండియా ప్రత్యర్థి గోల్‌పోస్ట్ ముందు వలయాలు ఏర్పరిచి పదేపదే దాడులు చేసింది. ఈ క్రమంలోనే రూపిందర్‌పాల్ ఇచ్చిన పాస్‌ను మన్‌ప్రీత్ సింగ్ చక్కగా స్టైస్ చేసి 1-1తో స్కోర్ సమం చేశాడు.

ఆ తర్వాత బెల్జియం భారత్‌పై ఒత్తిడి పెంచింది. బంతి దొరకనివ్వకుండా అడ్డుకుంది. ఆట 36వ నిమిషంలో మరో గోల్ చేసిన బెల్జియం ఆధిక్యాన్ని 2-1కు పెంచుకుంది. చివరి క్వార్టర్‌లో భారత్ వేగంగా దాడులు చేసినా ప్రత్యర్థి గోల్‌కీపర్ అద్భుతంగా వాటిని తిప్పికొట్టాడు. దీంతో చివరకు భారత్‌కు ఓటమి తప్పలేదు. రెండో దశలో భాగంగా జనవరి 26న ఆతిథ్య జట్టు న్యూజిలాండ్‌తో భారత్ తొలి మ్యాచ్‌లో తలపడనుంది.

ఇంగ్లాండ్‌దే వన్డే సిరీస్

- మూడో వన్డేలోనూ ఓడిన ఆసీస్



సిడ్నీ: యషేస్ టెస్టు సిరీస్‌లో ఘోరంగా పరాజయం పాలైన ఇంగ్లండ్ ఇప్పుడు వన్డే సిరీస్‌లో దానికి ప్రతికారం తీర్చుకుంది. ఇప్పటికే రెండు విజయాలు సాధించిన ఇంగ్లండ్ ఆదివారం జరిగిన మూడో వన్డేలోనూ ఆస్ట్రేలియాను చిత్తు చేసి మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 302/6 పరుగులు చేసింది. ఇంగ్లండ్‌లో బట్లర్ (100 నాటౌట్)అద్భుత అజేయ సెంచరీ సాధించాడు. మరోవైపు వోక్స్ (53 నాటౌట్) కూడా అర్ధ శతకం సాధించి అజేయంగా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 286/6 పరుగులు మాత్రమే చేసి 16 పరుగులతో ఓటమి పాలైంది. 303 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే ఓపెనర్ డేవిడ్ వార్నర్ (8) రూపంలో షాక్ తగిలింది. తర్వాత మరో ఓపెనర్ అరోన్ ఫించ్ మాత్రం చెలరేగి ఆడుతూ 53 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లతో 62 పరుగులు చేసి రషీద్ బౌలింగ్‌లో ఎల్బీగా వెనుదిరిగాడు. తర్వాత కెప్టెన్ స్మిత్ (45), మిచెల్ మార్ష్ (55), స్టొనిస్ (56) టిమ్ పైనె (31 నాటౌట్), పరుగులు చేసినా కానీ, తమ జట్టును విజయాతీరానికి చేర్చలేక పోయారు. దీంతో ఆసీస్ 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో వుడ్, వోక్స్, రషీద్ తలో రెండు వికెట్లు తీశారు. అంతకుముందు టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్‌లో ఓపెనర్లు తొలి వికెట్‌కు 38 పరుగులు జోడించారు. అనంతరం జాసన్ రాయ్ (19) ఔటయ్యాడు. మరో ఓపెనర్ బైరిస్టో (39) పరుగులు చేసి వెనుదిరిగాడు. మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ మోర్గన్ (41) పరుగులు చేసి వెనుదిరిగాడు. మరోవైపు జొస్ బట్లర్ అద్భుత బ్యాటింగ్‌తో చెలరేగాడు. చివర్లో ఇతనికి వోక్స్ జతవ్వడంతో వీరిద్దరూ చివరి వరకు అజేయంగా ఉండి ఇంగ్లండ్ స్కోరును 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 302 పరుగులకు చేర్చారు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన బట్లర్ 83 బంతుల్లోనే 6 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 100 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇతనికి అండగా ఉన్న వోక్స్ 36 బంతుల్లోనే 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 53 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. ఆసీస్ బౌలర్లలో హాజల్‌వుడ్ 2 వికెట్లు పడగొట్టాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.